
కర్మయోగము



ధూమేనా్రవియతే వహ్నిర్యథాఽఽదర్శోమలేనచ
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్. **(3-38)**

పొగచేత అగ్నియు, మురికిచేత అద్దమున్ను, మావిచేత గర్భమందలి శిశువున్ను కప్పబడియుండులాగున ఆ కామముచేత ఈ ఆత్మజ్ఞానమున్ను కప్పబడియుండును.

ॐ

శ్రీ భగవద్గీత

అథ తృతీయోఽధ్యాయః

మూడవ అధ్యాయము

కర్మయోగః

కర్మయోగము

ఈ అధ్యాయముయొక్క పేరు :-

"కర్మయోగము" – లోకమున కర్మచేయక ఏ జీవియు నుండలేదు. వారి వారికి నియతములైన కర్మలను వారు తప్పక నిష్కామబుద్ధితో నాచరించవలయును. తమ విధ్యుక్తకర్మమును ఫలాపేక్షలేక ఈశ్వరార్పణబుద్ధితో గావింపలెను. ఆ యా కార్యములను మనుజు డెందుల కాచరింపవలయునో, వాని నాచరించనిచో కలుగునపకారమేమియో, ఆచరించినచో కలుగు మేలెద్దియో, ఏ కర్మ బంధమును గల్గించునో, ఏ కర్మ ముక్తికి దారితీయునో – ఈ ప్రకారముగ కర్మకు సంబంధించిన వివిధ విషయములు విపులముగ ఈ అధ్యాయమున చర్చించబడియుండుటవలన దీనికి కర్మయోగమని పేరుపెట్టబడినది.

ఈ అధ్యాయమందలి ప్రధాన విషయములు :-

(1) అనాసక్తిభావముతో నియతకర్మల నాచరించుట ఉత్తమమని నిరూపించుట
(1వ శ్లో॥ నుండి 8 వ శ్లో॥ వఱకు)

(2) ఫలాపేక్షలేక చేయబడు కర్మ యజ్ఞమేయని తెలుపుచు అట్టి యజ్ఞము నాచరింపవలసిన యావశ్యకతను తెలియజేయుట. (9వ శ్లో॥ నుండి 16వ శ్లో॥ వఱకు)

(3) జ్ఞానియు, సాక్షాత్ భగవానుడున్ను లోకసంగ్రహార్థము కర్మలజేయుచునే యుందురని వచించుట.
(17వ శ్లో॥ నుండి 24వ శ్లో॥ వఱకు)

(4) అజ్ఞానియొక్కయు, జ్ఞానియొక్కయు లక్షణములను పేర్కొనుచు, రాగద్వేషరహితముగ కర్మనాచరింపవలసినదని యుద్బోధించుట. (25వ శ్లో॥ నుండి 35వ శ్లో॥ వఱకు)

(5) కామక్రోధాదుల స్వభావమును, వానిని జయించు పద్ధతిని తెలియజేయుట.
(36వ శ్లో॥ నుండి 43వ శ్లో॥ వఱకు)

పూర్వాధ్యాయముతో ఈ అధ్యాయమునకు గల సంబంధము :-

క్రిందటి అధ్యాయమగు సాఙ్ఖ్యయోగముయొక్క ప్రారంభమున భగవానుడు అఖండమగు జ్ఞానోపదేశమును అర్జునునకు గావించిరి. మరల మధ్యలో నిష్కామకర్మయోగమును గూర్చిన ప్రశంస నొకింతగావించిరి. తుట్టతుదకు మరల స్థితప్రజ్ఞుని లక్షణములను, ఇంద్రియనిగ్రహాదిసాధనలను వచించి మహోన్నతమగు బ్రాహ్మీస్థితిని, జ్ఞానానుభవమును వర్ణించి చెప్పిరి. అదియంతయు విని అర్జునుడు జ్ఞానమే

కర్మకంటె నధికమని భగవానుడు నిర్ణయించినట్లు భావించి జ్ఞానమే గొప్పదని భగవానుని యభిమతమైనచో నన్నెందులకీ కర్మరంగమున - యుద్ధమను ప్రచండకర్మక్షేత్రమున వారు దింపుచున్నారను సంశయము గలిగి భగవానుని ఈక్రిందివిధముగ ప్రశ్నించుచున్నాడు -

అర్జున ఉవాచ :-

1. జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ.

అర్జున ఉవాచ = అర్జునుడు చెప్పెను -

టీక:- జనార్దన = ఓ కృష్ణా!, బుద్ధిః = జ్ఞానము, కర్మణః = కర్మముకంటె, జ్యాయసీ = శ్రేష్ఠమైనది (అని), తే = నీయొక్క, మతాచేత్ = అభిప్రాయమైనచో, తత్ = అప్పుడు, కేశవ = ఓ కృష్ణా!, ఘోరే = భయంకరమైన, కర్మణి = (యుద్ధమను) కర్మమునందు, మాం = నన్ను, కిమ్ = యెందువలన, నియోజయసి = ప్రవర్తింపజేయుచున్నావు?

తా:- ఓ కృష్ణా ! జ్ఞానము కర్మముకంటె శ్రేష్ఠమైనదని మీ యభిమతమగుచో, మఱి యీ భయంకరమైన (యుద్ధ) కర్మమునందు నన్నేల ప్రవర్తింపజేయుచున్నావు?

వ్యాఖ్య:- ఇచట బుద్ధియనగా జ్ఞానము. క్రిందటి అధ్యాయమున 49, 50, 51, శ్లోకములను భగవానుడు చెప్పినపుడే - అనగా కర్మకంటె బుద్ధియోగము శ్రేష్ఠమని వెల్లడించినపుడే అర్జునుని మనంబున ఈసందేహము జనించి యుండవచ్చును. "ఏమి, భగవానుడు కర్మలయందే నీ కధికారము గలదు (కర్మణ్యేవాధికారస్తే 2-47), కర్మలను జేయుము (కురు కర్మాణి 2-48), కాబట్టి లెమ్ము, యుద్ధము చేయుము (తస్మాద్యుధ్యస్వ 2-18) అని ఒకచెంప పలుకుచు, మరల బుద్ధియోగముకంటె కర్మ చాల తక్కువైనది (దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ 2-49) అని చెప్పినారే! ఈ వచనములు పరస్పరవిరుద్ధములుగ నున్నవే!" ఈ ప్రకారముగ సందేహించి రెండవ అధ్యాయమున 49, 50, 51 శ్లోకములను భగవానుడు చెప్పినపుడే తన సంశయము నాతనిముందు పెట్టదలంచియుండవచ్చును. కాని వెనువెంటనే శ్రీకృష్ణమూర్తి 'నీబుద్ధియెపుడు సమాధియందు నిలుకడనొందునో, అపుడు (జీవబ్రహ్మైక్యరూప) యోగమును బడయగలవు' అని బోధింప, తత్క్షణమే అర్జునునకు సమాధియందు నిలుకడను బొందిన వాని (స్థితప్రజ్ఞుని) లక్షణములను తెలికొనవలెనను ఉత్సుకత కలిగి, దానినే ముందుగా ప్రశ్నించివైచెను. అత్తఱి దానికి సమాధానముగ స్థితప్రజ్ఞ లక్షణములను భగవానుడు చెప్పి పూర్తి చేసినవెంటనే అర్జునుడు తన పాతసందేహమును వెంటనే వారి యెదుట పెట్టెను. ఈ మూడవ అధ్యాయ ప్రారంభమునగల రెండు శ్లోకములు ఆ సందేహమును గూర్చినవే యగును.

2. వ్యామిశ్రేణేవ[1] వాక్యేన బుద్ధిం మోహయసీవ మే
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్.

టీక:- వ్యామిశ్రేణేవ = మిశ్రమమైనదానివలెనున్న, వాక్యేన = వాక్యముచేత, మే = నాయొక్క, బుద్ధిం = బుద్ధిని, మోహయసీవ = కలవరపెట్టువానివలె (ఉన్నావు), అహమ్ = నేను, యేన = దేనిచేత, శ్రేయః =

1 వ్యామిశ్రేణైవ - పాఠాంతరము

శ్రేయస్సును , ఆప్నుయామ్ = పొందగలనో, తదేకమ్ = అట్టి యొకదానిని (కర్మమో, లేక జ్ఞానమో), నిశ్చిత్య =నిశ్చయించి, వద =చెప్పుము.

తా:– (ఓ కృష్ణా!) మిశ్రమమైనదానివలెనున్న వాక్యముచేత నీబుద్ధిని కలవరపెట్టు వానివలె నున్నావు. కావున నేను దేనిచే శ్రేయమును పొందగలనో అట్టి యొకదానిని (కర్మ, జ్ఞానములలో నొకదానిని) నిశ్చయించి నాకు జెప్పుము.

వ్యాఖ్య:– 'ఇవ' (వలె) అను పదమును అర్జునుడు రెండు పర్యాయములు ఈ శ్లోకమున ప్రయోగంచుటలో శ్రీకృష్ణమూర్తి వాస్తవముగ కలవరపెట్టు వాక్యములను, సందిగ్ధవచనములను చెప్పకున్నను, అర్జుననకు తన అజ్ఞానముచేతనే ఆ విధముగ గన్పట్టుచున్నదను భావము సూచింపబడుచున్నది.

అ॥ అర్జునుని యా ప్రశ్నకు భగవానుడు సమాధానమొసంగుచు మోక్షప్రాప్తికిగల రెండు మార్గములను తెలుపుచున్నాడు.

శ్రీభగవానువాచ :–

3. లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్.

శ్రీ భగవానువాచ = శ్రీ భగవంతుడు చెప్పెను –

టీక:– అనఘ = పాపరహితుడవగు ఓ అర్జునా!, పురా = పూర్వము, లోకేఽస్మిన్ = ఈ లోకమునందు, మయా = నాచేత, సాంఖ్యానామ్ = సాంఖ్యులకు (జ్ఞానమార్గావలంబులకు), జ్ఞానయోగేన = జ్ఞానయోగముచేతను, యోగినామ్ = యోగులకు (కర్మమార్గావలంబులకు), కర్మయోగేన = కర్మయోగముచేతను, ద్వివిధా = రెండువిధములగు, నిష్ఠా = అనుష్ఠానక్రమము, ప్రోక్తా = చెప్పబడినది.

తా:– పాపరహితుడవగు ఓ అర్జునా! పూర్వ మీలోకమున సాంఖ్యులకు (తత్త్వవిచారణాపరులకు) జ్ఞానయోగము, యోగులకు కర్మయోగము అను రెండు విధములగు అనుష్ఠానము నాచే జెప్పబడియుండెను.

వ్యాఖ్య:– "అనఘ" – 'పాపరహితుడా' యని అర్జునుని శ్రీకృష్ణమూర్తి యిట సంబోధించిరి. చిత్తము పాపరహితమగునపుడే అందు బ్రహ్మవిద్య చక్కగ ప్రవేశించును. గుడ్డకు మురికి వదలిపోయినపిమ్మటనే రంగుపట్టును. వేదాంతబోధకు, ఆత్మవిచారణకు అర్జునుడు అనఘత్వము (పాపరాహిత్యము) ద్వారా అర్హతను సంపాదించుకొనెను. అర్జునుడు పాపరహితుడు కనుకనే శ్రీకృష్ణమూర్తి అతని యోగ్యతను గుర్తెఱింగి గీతాజ్ఞానమను ఆధ్యాత్మికోపదేశము నతనికి గావించిరి.

జీవులలో వారివారి మనస్తత్త్వము ననుసరించి ఒక్కొక్కరికి ఒక్కొక్క మార్గమునందు ప్రీతిగలిగి యుండును. కొందఱికి తత్త్వవిచారణయందు ఆసక్తిగలిగి యండును. వీరు సాంఖ్యులు, జ్ఞానయోగులు. ఇట్టివారికి అనుగుణ్యమైనబోధ జ్ఞానయోగమేయగును. ఈ తరహావారికి సృష్ట్యారంభమున, (లేక పూర్వకాలమున) భగవానుడు జ్ఞానయోగమను సాధనక్రమము నుపదేశించిరి. మఱికొందఱికి కర్మమార్గమున ప్రీతికలిగియుండును. వారుయోగులు. అట్టివారికి వారి సంస్కారము ననుసరించి బోధింపదగు విద్య

కర్మయోగమే యగును. కావున అట్టి కర్మయోగమే వారికి పూర్వము సర్వేశ్వరుడు బోధించిరి. వారివారి సాధనను వారనుష్ఠించుటకు సర్వస్వతంత్రులు. ఇట బలాత్కారమేమియు లేదు. ఏలయనిన, ఒకవిధానమును ఒకరిప్రవృత్తికి విరుద్ధముగ అతనిపై రుద్దినచో, అది కృత్రిమముగానుండి ఆతనికి ఉన్నతిని గలుగజేయజాలకుండును. ఒక గమ్యస్థానమును చేరుటకు అనేక మార్గములుండవచ్చును. ఒక శిఖరము చేరుటకు పెక్కుదారులుండవచ్చును. ఏ దారిగుండా ప్రయాణము సల్పినను తుదకు అందరును గమ్యస్థానమునే చేరుదురు. కాబట్టి యెవరి మనస్సు ఏ మార్గమునందు ప్రీతిగలదైయుండునో, వారు ఆ మార్గమును శ్రద్ధాభక్తులతో ననుసరించి లక్ష్యమగు పరమాత్మను చేరవచ్చునని భగవాను డిచట తెలుపుచున్నాడు. గీతయం దనేక యోగములు వచింపబడినప్పటికిని అన్నిటిని ప్రధానముగ ఈ రెండు యోగముల (జ్ఞాన, కర్మయోగముల) క్రిందనే విభజింపవచ్చును.

పూర్వమెపుడో (సృష్ట్యారంభమున) శ్రీకృష్ణుడీ రెండు యోగములను బోధించిరని తెలుపబడుటవలన శ్రీకృష్ణుడు త్రికాలధీశుడనియు, దేశకాలాదులచే పరిచ్ఛిన్నుడు కానివా డనియు, సాక్షాత్పరమాత్మయే యనియు స్పష్టమగుచున్నది.

ప్ర:— పూర్వము భగవానుడు జనులు తరించుట కెన్ని మార్గములు బోధించెను? అవియేవి?

ఉ:— రెండు మార్గములను బోధించెను. (1) జ్ఞానయోగము (సాంఖ్యుల ఉపయోగార్థము) (2) కర్మయోగము (కర్మయోగుల ఉపయోగార్థము).

అ॥ ఈ రెండు మార్గములందును కేవలము కర్మలను త్యజించినంత మాత్రముచే మోక్షము లభించదని వచించుచున్నాడు –

4. న కర్మణా మనారమ్భా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి.

టీక:— పురుషః = మనుజుడు, కర్మణామ్ = కర్మలయొక్క, అనారమ్భాత్ = ఆచరింపక పోవుటవలన, నైష్కర్మ్యమ్ = నిష్క్రియ మగు ఆత్మస్వరూపస్థితిని, న అశ్నుతే = పొందడు, సన్న్యసనాదేవ = కర్మత్యాగముచేయుట మాత్రము వలననే, సిద్ధిమ్ = మోక్షమును, న చ సమధిగచ్ఛతి = పొందనేపొందడుగదా!

తా:— మనుజుడు కర్మల నాచరింపకపోవుటవలన నిష్క్రియమగు ఆత్మస్వరూపస్థితిని పొందజాలడు. కర్మత్యాగ మాత్రముచే మోక్షసిద్ధిని ఎవడును పొందనేరడు.

వ్యాఖ్య:— ఈ శ్లోకమునందలి మొదటిపాదము కర్మమార్గము గూర్చియు, రెండవ పాదము జ్ఞానమార్గమును గూర్చియు వివరించినది. కర్మమార్గము ననుసరించువాడు తన విధ్యుక్తధర్మమును, తన కర్తవ్యమును, తన నియతకర్మమును (నిష్కామముగ) ఆచరించకపోయినచో నతనికి చిత్తశుద్ధి గలుగదు. అత్తఱి యతడు నైష్కర్మ్య (ఆత్మ) స్థితిని చేరజాలడు. అట్లే జ్ఞానమార్గమునం దుండువాడును బాహ్యసన్న్యాసమాత్రముచే, కర్మత్యాగమాత్రముచే మోక్షసిద్ధి నెన్నటికిని బడయజాలడు. ఏలయనిన మోక్షమునకు అంతస్సన్న్యాసము, వాసనాక్షయము ముఖ్యముగ కావలసియున్నవి. ఈ ప్రకారముగ ఏ దృష్టియందు చూచినను కేవల కర్మత్యాగము మోక్షహేతువు కానేరదని భగవానుడు వచించుచున్నాడు.

కర్మలను నిష్కామముగ నాచరించనిచో చిత్తశుద్ధి కలుగదు. చిత్తశుద్ధి కలుగనిచో జ్ఞాన ముదయింపదు. జ్ఞాన ముదయించనిచో మోక్షము (నిష్క్రియ ఆత్మస్థితి, లేక నైష్కర్మ్యసిద్ధి) చేకూరదు. కనుకనే భగవాను డిచట కర్మల నాచరించనిచో మోక్షపదవి లభించనేరదని వాక్రుచ్చిరి. ప్రారంభమున ప్రతివారును కర్మాచరణను ఆశ్రయించిననే తుట్టతుదకు జ్ఞాననిష్ఠాత్మకమగు ఆత్మానుభవమును బడయగల్గుచున్నారు. కర్మలను విడచుట మాత్రముచే మోక్షసిద్ధిని యెవరును బొందలేరు. పైగా అట్టివారు సోమరులై జీవితమును వ్యర్థముగ తమస్సునందు గడిపివేయుదురు. కావున నైష్కర్మ్యపరబ్రహ్మము పేరుతో మొదటనే కర్మరహితులై జనులు అటు దైవమునకుగాని ఇటు ప్రపంచమునకుగాని ఉపకరించక ఉభయభ్రష్టులు కాకుండ చూడవలెను.

తమస్సు నుండి రజస్సులోనికి, రజస్సునుండి సత్త్వములోనికి, సత్త్వమునుండి విశుద్ధ సత్త్వమునకు లేక గుణాతీతమునకు జీవుడు క్రమముగ పోవలెను. అట్టి స్థితి ప్రారంభమున కర్మాచరణమువలననే సాధ్యమగునుగాని అకర్మణ్యత్వమువలనగాదు. కనుకనే భగవానుడిచట నైష్కర్మ్యసిద్ధిరూప మోక్షము సామాన్యమైనది కాదనియు, అది అకస్మాత్తుగ ఊడిపడునది కాదనియు, కర్మాచరణములేక, చిత్తశుద్ధికి వలయు నిష్కామకర్మలను మొదటచేయక ఆ స్థితి యెన్నటికిని సంభవింపనేరదని ఢంకా మ్రోగించినట్లు చెప్పివైచిరి. మఱియు అభ్యంతరమున వాసనలు కలిగి బాహ్యమున అన్నిటిని వదలివేసినంతమాత్రమున మనుజుడు సాధించగల్గునది యేమియు లేదనియు, బాహ్యసన్న్యాసమాత్రమున లక్ష్యము సిద్ధించదనియు గీతాచార్యు లిచట విస్పష్ట మొనర్చిరి. కర్మలను త్యజించుట, త్యజించకపోవుట కాదు ప్రధానము. లోని వాసనలు చావవలెను. చిత్తము నిర్మలత్వ మొందవలెను. అదియే ముఖ్యము. అదియో మొట్టమొదట కర్మాచరణమువలననే సాధ్యపడును. కావున భగవానుడు కర్మాచరణమును (నిష్కామ కర్మయోగమును) ఇచట ప్రోత్సహించుచున్నాడు. ఇవ్విధముగ సోమరులకు, అకర్మణ్యులకు సర్వేశ్వరుడు చక్కని గుణ పాఠమును నేర్పినవారైరి. దీనినిబట్టి ప్రారంభమున ప్రతివారున్ను చిత్తశుద్ధి కొఱకై ఏదియో యొక పవిత్ర కర్మను దైవప్రీత్యర్థముగ (ఫలాభిసంధిరహితముగ) తప్పక నాచరించియే తీరవలెనని స్పష్టమగుచున్నది.

ప్ర:– మోక్షము దేనివలన చేకూరదు?

ఉ:– (చిత్తశుద్ధికొఱకై) కర్మాచరణ చేయకపోవుటచేగాని, బాహ్యసన్న్యాసముమాత్రముచేగాని మోక్షము లభించదు.

ప్ర:– మఱి మోక్షము దేనివలన చేకూరునని దీనివలన స్పష్టమగుచున్నది?

ఉ:– నిష్కామకర్మాచరణమువలన క్రమముగ మోక్షము సంప్రాప్తించును. మఱియు అభ్యంతరసన్న్యాసము, అనగా వాసనాత్యాగమువలన మోక్షము లభించగలదు.

అ॥ ఇక కర్మయోగముయొక్క ఆవశ్యకతను భగవానుడు పెక్కురీతుల తెలియచేయుచు ప్రప్రథమమున కర్మత్యాగము భౌతికముగ అసాధ్యమని తెలుపుచున్నాడు –

5. న హి కశ్చిత్క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః.

టీక:– కశ్చిత్ = ఎవడున్ను, జాతు = ఒకప్పుడును, క్షణమపి = క్షణకాలమైనను, అకర్మకృత్ = కర్మముచేయనివాడై, న హి తిష్ఠతి = ఉండడుకదా! హి = ఎందువలననగా, ప్రకృతిజైః = ప్రకృతి (మాయ) వలన పుట్టిన, గుణైః = గుణములచేత, సర్వః = (అజ్ఞుడగు) ప్రతివాడును, అవశః = అస్వతంత్రుడై (తన వశములేకయే), కర్మ = కర్మను, కార్యతే = చేయుచున్నాడు.

తా:– (ప్రపంచమున) ఎవడును ఒక్క క్షణకాలమైనను కర్మచేయక ఉండనేరడు. ప్రకృతివలన బుట్టిన గుణములచే ప్రతివాడును బలాత్కారముగ కర్మలను చేయుచునే యున్నాడు.

వ్యాఖ్య:– కర్మలను చేయక ఎవరును ఒక్క క్షణమైనను ఉండలేరు. గాలిపీల్చుటయు కర్మయే, తినుట కర్మయే, నడచుట కర్మయే, మాట్లాడుట కర్మయే. ఇవిలేక ఎవ్వరైన ప్రపంచమున ఉండగలరా? కావున సర్వులకు కర్మ అనివార్యమైనదని భగవానుడు పలుకుచున్నాడు.

మఱియు, జ్ఞానితప్ప తక్కిన ప్రతిజీవియు మాయకు, ప్రకృతికి లోబడియే యున్నాడు. తత్ప్రకృతిజన్యములగు త్రిగుణముల కాతడధీనుడై ప్రవర్తించుచున్నాడు. కావున ఆ యా గుణముల ననుసరించి కర్మల నాతడు అవశుడై ఆచరించుచునే యుండును. అయితే ఇచట 'సర్వః' అను పదమునకు 'జీవన్ముక్తులగు మహనీయులు తప్ప తక్కిన వారందఱు' అని యర్థము. ఏలయనిన వారు గుణాతీతమగు ఆత్మస్థితిని బడసినవారు. గుణములకు లోబడినవారుకాదు. వారిని మాయ ఏమియు చేయజాలదు. అయినను వారి దేహేంద్రియాదులు ప్రకృతియం దంతర్గతములు. కావున అయ్యవి వానివాని నిర్దిష్టకార్యముల నాచరించినను, వారు అకర్తలై నిస్సంగముగ నుందురు.

ఇక అజ్ఞానులగువారు ప్రకృతికి, దానిగుణములకు బద్ధులై యున్నప్పటికిని అంతమాత్రముచేత నిరుత్సాహపడవలసిన పనిలేదు. పురుషప్రయత్నము నాశ్రయించి శుద్ధకర్మచే అశుద్ధకర్మను, పుణ్యముచే పాపమును రూపుమాపి ఈశ్వరార్పణ బుద్ధితో సత్కర్మల నాచరించుచు, నిష్కామముగ ప్రవర్తించినచో క్రమముగ చిత్తనైర్మల్యమును బడసి వారున్ను మోక్షస్థితిని బొందగలరు.

అ॥ ఇంద్రియములను బిగబెట్టికూర్చొనుట కర్మత్యాగము (నైష్కర్మ్యము) ఎన్నటికిని కానేరదని వచించుచున్నాడు –

6. కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్
ఇన్ద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే.

టీక:– యః = ఎవడు, కర్మేన్ద్రియాణి = కర్మేంద్రియ జ్ఞానేంద్రియములను, సంయమ్య = అణచిపెట్టి, మనసా = మనస్సుచేత, ఇన్ద్రియార్థాన్ = ఇంద్రియములయొక్క (శబ్దాది) విషయములను, స్మరన్ = చింతించుచు, ఆస్తే = ఉన్నాడో, విమూఢాత్మా = వివేకశూన్యమైన మనస్సుగల, సః = అతడు, మిథ్యాచారః = కపటమైన ఆచరణకలవాడని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా:– ఎవడు కర్మేంద్రియ జ్ఞానేంద్రియములను అణచిపెట్టి మనస్సుచేత ఇంద్రియములయొక్క శబ్దాది విషయములను చింతించు చుండునో మూఢచిత్తుడగు అట్టి మనుజుడు కపటమైన ఆచరణగలవాడని చెప్పబడుచున్నాడు.

వ్యాఖ్య:— ఇచట కర్మేంద్రియాణి అనుపదమునకు కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములు రెండును అని అర్థము. ఏలయనిన కొన్ని ఇంద్రియములనుగూర్చి మాత్రమే చెప్పినచో డంబాచారియొక్క చిత్రణ అపూర్ణముగా నుండును.

"సంయమ్య" – ఇది సాధకు డొనర్చు సంయమము కాదు. ఎందవలననగా, అట్టి ఉత్తమ సంయమము కలవాడు మిథ్యాచారి యెన్నటికిని కానేరడు. డంబము కొఱకు ఇంద్రియములను ఊరక బిగబెట్టుకొని కూర్చొని మనస్సుచే ముల్లోకములను తిరుగాడువానిని గూర్చియే ఇచట చెప్పబడినది. అయితే ప్రారంభమున కొందఱు సాధకులకుగూడ ధ్యానమందు మనస్సు దైవముపై (లక్ష్యముపై) నిలువక దిశదిక్కులు పరుగెత్తు చుండును. దానికిని ఈ డంబాచారియొక్క ప్రవర్తనకును చాల వ్యత్యాసము కలదు. ఎందుకనగా, ముముక్షువు తనమనస్సు విషయములపై పరువెత్తినను దాని నుండి మరలించి ఆత్మయందు (దైవమునందు) స్థాపించుటకు యత్నించుచుండును. డంబాచారి అట్లుచేయడు. సాధకునిది సదుద్దేశ్యము. ఈతనిది దురుద్దేశ్యము. ఈతడు చేయునది కృత్రిమధ్యానము, బకధ్యానము.

అధ్యాత్మసాధన ప్రారంభించునపుడు ముముక్షువు దాని పద్ధతిని, క్రమమును చక్కగ తెలిసికొనియుండవలెనని ఈ శ్లోకము వలన స్పష్టమగుచున్నది. లేకున్న కుమార్గమున పడిపోవును. పెద్దలగు మహాత్ములవలన, అనుభవజ్ఞులగు గురువులవలన సాధనపద్ధతులను ప్రత్యక్షముగ తెలిసికొనవలెను. 'ఇంద్రియనిగ్రహము ఆవశ్యకమైనది' అను సూత్రమును మాత్రము గ్రహించి, దాని లోతుపాతులను తెలియనిచో ఇంద్రియములను అణచిపెట్టి లోన మనస్సుతో లోకవ్యవహారమంతయు, విషయభోగమంతయు గావించుచుండుట సంభవించును. కాబట్టి ఇట్టి ప్రమాదమును ఊహించియే గురోర్గురువగు శ్రీకృష్ణపరమాత్మ అట్టివారిని చక్కదిద్దుటకై గీతాశాస్త్రమున ఈ విధములైన హెచ్చరికలు పెక్కింటిని అపుడపుడు కావించుచు పోవుదురు.

లోకమున యోగులవలె నటించు అజ్ఞానులు కొందఱుండవచ్చును. ప్రపంచమును వంచించుటకొఱకు ఇంద్రియములను అణచిపెట్టి వారొకచోట కూర్చున్నను, మనస్సు వాసనామయమై యుండుటచే అది త్రిలోకములందు సంచరించుచుండును. ఇటు ప్రపంచసుఖమునకును, అటు దైవసుఖమునకును రెండిటికిని వారు చెడినవారగుదురు. కనుకనే భగవాను డట్టివారికి 'మూఢు'లను పదము చాలదనియెంచి 'విమూఢు'లని పేరు పెట్టిరి.

ఇంద్రియములకు స్వతః విషయములను అనుభవించుశక్తిగాని, తెలిసికొనుశక్తిగాని లేదు. మనస్సు వానితో చేరినపుడే ఆయా శక్తులేర్పడును. కావున మనస్సుతోసహా ఇంద్రియములను నిగ్రహించుటవలన ప్రయోజనము కలదు. కాని కేవలము ఇంద్రియములను బిగబెట్టుటవలన ప్రయోజనముండదు. అట్లు బిగబెట్టినచో అది మిథ్యాచారము కాగలదు. విజ్ఞులగువారు అట్టి ప్రవర్తనను విడనాడవలెను. ఇంద్రియములతోబాటు మనస్సునుగూడ అదుపులో నుంచుకొనవలెను. అట్లు మనస్సును అదుపులో నుంచుకొనినచో, అత్తఱి ఒకవేళ ఇంద్రియములు దేహయాత్రావసరములైన అన్నపానాది విషయములందు ప్రవర్తించినను ప్రమాదములేదు. ఈ విషయమును గీతాచార్యులే రాబోవు శ్లోకమున తెలియజేయగలరు.

ప్ర:— మిథ్యాచారమనగా నేమి?

ఉ:— ఇంద్రియములను మాత్రము అణచిపెట్టి మనస్సుతో ముల్లోకములందును సంచరించుట, విషయములను స్మరించుట మిథ్యాచారము (డంబాచారము) అగును.

అ॥ మనస్సునందాసక్తిని విడిచి ఇంద్రియములచే నిష్కామముగ కర్మలనాచరించువాడుత్తముడని వచించుచున్నాడు -

7. యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున కర్మేన్ద్రియైః కర్మయోగమసక్తస్స విశిష్యతే.

టీక:– అర్జున = ఓ అర్జునా!, యస్తు = ఎవడైతే, ఇంద్రియాణి = ఇంద్రియములను, మనసా = మనస్సుచేత, నియమ్య = నియమించి, కర్మేన్ద్రియైః = ఆ కర్మేంద్రియ జ్ఞానేంద్రియములచేత, కర్మయోగమ్ = కర్మయోగమును, అసక్తః = సంగములేనివాడై, ఆరభతే = చేయుచున్నాడో, సః = అతడు, విశిష్యతే = శ్రేష్ఠుడగును.

తా:– ఓ అర్జునా! ఎవడు ఇంద్రియములన్నిటిని మనస్సుచే నియమించి, వానిచే కర్మయోగమును సంగములేనివాడై ఆచరించునో, అతడుత్తముడు.

వ్యాఖ్య:– పైశ్లోకమునందువలె ఇచటకూడ 'ఇంద్రియాణి' 'కర్మేన్ద్రియైః' అను పదములచే ఇంద్రియములన్నియును వివక్షితములగును. ఏలయనిన ఒక్క కర్మేంద్రియములతోనే ఆచరింపబడు కర్మయోగము అపూర్ణమే కాగలదు.

మనస్సును చక్కగా నిగ్రహించి (అందలి వాసనలను దూరీకృతముచేసి), ఇంద్రియములను సంయమనమొనర్చి విషయములందు అంటక (అసక్తుడై) ఫలాపేక్షారహితముగ కర్మల నాచరించినచో మనుజుడు బద్ధుడు కానేరడు. ఇంద్రియములు మనస్సునకు లోబడియుండవలెను. మనస్సు తనకు లోబడియుండవలెను. ఇంద్రియములు వానివాని కార్యములను చేసినను చేయకున్నను మనస్సుయొక్క సక్తతయే బంధమునకు కారణము. అసక్తతయే మోక్షమునకు కారణము. కాబట్టి అట్టి సక్తత, విషయవాసన, మనస్సున లేకుండచేసి, తదుపరి ఇంద్రియములచే కార్యములను చేసినను దోషము కలుగదని భగవానుడు తెలుపుచున్నారు. కనుకనే మహనీయులు మొట్టమొదట మనస్సంయమము నభ్యసించి, ఇంద్రియములను అదుపులోనికి తెచ్చుకొని అట్టి విశుద్ధేంద్రియములచే లోకహితార్థము కర్మలను చేయుచుందురు.

ప్ర:– కర్మయోగము నెట్లు శీలించవలెను?

ఉ:– ఇంద్రియమనంబులను నిగ్రహించి అట్టి నియమితేంద్రియములచే అసక్తబుద్ధితో కర్మయోగమును శీలించవలెను.

అ॥ కావున, శాస్త్రనియతమగు కర్మను (నిష్కామబుద్ధితో తప్పక) ఆచరించవలసినదిగా భగవాను డర్జునుని ఆదేశించుచున్నాడు -

8. నియతం కురు కర్మత్వం కర్మ జ్యాయో హ్యకర్మణః శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః.

టీక:– త్వమ్ = నీవు, నియతమ్ = (శాస్త్రములచే) నియమింపబడినట్టి, కర్మ = కర్మమును, కురు

= చేయుము, *అకర్మణః* = కర్మము చేయకుండుటకంటె, *కర్మ* = కర్మ (చేయుట), *జ్యాయోహి* = శ్రేష్ఠమైనదికదా!, *అకర్మణః* = కర్మచేయకపోవుటవలన, *తే* = నీకు, *శరీరయాత్రాపి చ* = దేహయాత్రకూడ, *న ప్రసిద్ధ్యేత్* = సిద్ధింపనేరదు.

తా:– (ఓ అర్జునా!) నీవు (శాస్త్రములచే) నియమితమైన కర్మను జేయుము. కర్మచేయకుండుటకంటె చేయుటయే శ్రేష్ఠము. మఱియు కర్మ చేయకపోవుటవలన నీకు దేహయాత్రకూడ సిద్ధింపనేరదు.

వ్యాఖ్య:– 'నేనేమి చేయవలెనో అసందిగ్ధముగ చెప్పుము కృష్ణా!' అని ఈ అధ్యాయప్రారంభములో అర్జును డడిగిన ప్రశ్నకు శ్రీకృష్ణమూర్తి 'నియతం కురు కర్మ' (నీవు కర్మమును త్యజింపక శాస్త్రనియమితమగు కర్మను చేయుము) – అని యిచట స్పష్టముగ నాదేశించిరి. నియతకర్మచే చిత్తము శుద్ధమై, ఆత్మజ్ఞానోదయము కాగలదు. కర్మమును త్యజించి కూర్చొనుటవలన ఏమియు సిద్ధింపదు. దానికంటె కర్మచేయుటయే మేలు. అదియు సత్కర్మ, దైవార్పితకర్మయైనచో ఇంకను శ్రేష్ఠము – అని భగవానుడు నుడువుచున్నారు. మఱియొక దృష్టితో చూచిన, కర్మచేయనిచో అసలు శరీరము నిలుచటయే కష్టమనియు, దేహయాత్రయే అత్తఱి కొనసాగదనియు వచించి ఆ విధముగను కర్మాచరణను ప్రోత్సహించుచున్నాడు.

ప్ర:– కర్మచేయుట మేలా, చేయకుండుట మేలా?

ఉ:– చేయుటయే మేలు.

ప్ర:– ఎట్టి కర్మ చేయవలెను?

ఉ:– శాస్త్రనియతమగు కర్మ చేయవలెను.

ప్ర:– కర్మచేయనిచో కలుగు హానియేమి?

ఉ:– అత్తఱి (1) చిత్తశుద్ధిగలుగదు, చిత్తశుద్ధిలేనిచో జ్ఞానమంకురింపదు, జ్ఞానములేనచో మోక్షము సిద్ధింపదు (2) కర్మచేయనిచో దేహయాత్రకూడ కొనసాగదు.

అ|| కర్మబంధనమునుండి విడివడుటకు ఉపాయమును చెప్పుచున్నాడు –

9. యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబన్ధనః
తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసఙ్గస్సమాచర.

టీక:– *కౌన్తేయ* = ఓ అర్జునా!, *యజ్ఞార్థాత్* = యజ్ఞము కొఱకైన (భగవద్విషయమైన), *కర్మణః* = కర్మకంటె, *అన్యత్ర* = ఇతరమగు కర్మచేత, *అయంలోకః* = ఈ లోకము (జనులు), *కర్మబన్ధనః* = కర్మచే గట్టుబడియున్నది (కాబట్టి), *తదర్థమ్* = ఆ యజ్ఞముకొఱకైన, *కర్మ* = కర్మను, *ముక్తసఙ్గః* = సంగమును విడిచినవాడవై, *సమాచర* = లెస్సగా జేయుము.

తా:– ఓ అర్జునా! యజ్ఞముకొఱకైన (భగవత్ప్రీతికరమైన, లేక లోకహితార్థమైన) కర్మకంటె ఇతరమగు కర్మచే జనులు బంధింపబడుదురు. కాబట్టి ఆ యజ్ఞముకొఱకైన కర్మనే సంగరహితుడవై (ఫలాసక్తిలేక) యాచరింపుము.

వ్యాఖ్య:- గీతయందు శ్రీకృష్ణమూర్తి యజ్ఞము, సన్న్యాసము, త్యాగము మున్నగు పదములకు నూతనమగు అర్థమును వెల్లడించిరి. యజ్ఞమును సామాన్యముగ వాడుకలోనున్న అగ్నిహోత్ర, మంత్ర, తంత్ర, ఋత్విగాదులతో గూడిన ఒకానొక క్రియగా వర్ణించక, భగవద్విషయమైన, లేక పరహితార్థమైన క్రియగా వర్ణించి చెప్పిరి. ఇట్టి యజ్ఞము ప్రతివానికిని అందుబాటులో నుండగలదు కావున, దీని నాచరించి ప్రతివారున్ను తరించుటకు చక్కని యవకాశముండును. సామాన్యముగ కర్మ సంసారబంధనమును కలుగుజేయునని లోకములో నొకప్రతీతి. పుణ్యకార్యములు చేసినను ఆ పుణ్యఫలము ననుభవించుటకై మరల జన్మయెత్తవలసి యుండుననియు, కావున అట్టి కర్మలను చేయరాదనియు కొందఱు భయపెట్టుదురు. కాని గీతాచార్యు లట్టి భయములను తొలగించివేసిరి.. సకామముగ ఫలాసక్తితో చేయబడు కర్మమే జన్మాదిరూపసంసారమునకు హేతువై బంధమును గలుగజేయుననియు, తద్వ్యతిరిక్తమైనది, అనగా నిష్కామబుద్ధితో చేయబడుకర్మ ఎన్నటికిని బంధనమును గలుగజేయదనియు వక్కాణించిరి. భగవద్విషయమైన కర్మగాని, లోకహితకరమగు కర్మగాని ఫలాపేక్షారహితముగ జేయబడునది, బంధము నెన్నటికిని గలుగజేయదు. పైగా అట్టి నిష్కామకర్మ చిత్తశుద్ధిద్వారా మోక్షమునకు హేతువున్ను కాగలదు.

ఒకే కర్మ సంగముతో చేసినచో బంధమును, సంగరహితముగ చేసినచో (చిత్తశుద్ధిద్వారా) మోక్షమును కలుగజేయును. ఒకేకర్మ స్వార్థమునకై చేసిన బంధము; భగవదర్థము, లోకహితార్థము చేసినచో మోక్షమును గలుగజేయును. కాబట్టి కర్మలో దోషములేదు. దానిని చేయు పద్ధతిలో దోషము కలదు. సక్తముగ నాచరించుటయే ఆ దోషము. సకామముగ నాచరించుటయే ఆ లోపము.

శ్రీకృష్ణమూర్తి అర్జునునితో 'కర్మలను లెస్సగ నాచరింపుము' (సమాచర) అనిచెప్పి కర్మయోగమును ప్రోత్సహించిరి. అయితే ఆకర్మలను ఎట్లు చేయవలెనో ఆ పద్ధతిని ముందుగా తెలిసికొనుమని హెచ్చరించిరి. కర్మరహస్యము, కర్మకీలకము తెలిసికొనియే కర్మను చేయవలెను. లేకున్న దానిలో తగుల్కొనిపోవుదురు. ఆ కర్మరహస్యమేమియో భగవానుడే రెండు సూత్రములద్వారా యిచట బోధించిరి. అవి యేవియనిన - (1) యజ్ఞముకొఱకై (భగవత్ప్రీతికరములైన, పరహితార్థములైన) కర్మలనే చేయవలెను. (2) కర్మలను సంగరహితముగ, (ఫలాపేక్షారహితముగ) నాచరించవలెను. ఈ ప్రకారముగ నాచరింపబడు కర్మ సామాన్యమైనది అయినను మహాయజ్ఞముగ మారిపోయి జీవునకు పరమశ్రేయమును గలుగజేయగలదు. అపుడు కర్మ కర్మగానుండక ధ్యానముగ మారిపోవును. (Work will be transformed into worship). బంధకరముగ నుండక మోక్షకరముగ పరిణతిజెందును.

ప్ర:- ఎట్టి కర్మ బంధనమును గలుగజేయదు?

ఉ:- యజ్ఞముకొఱకైన (భగవత్ప్రీతికరమైన, పరోపకారార్థమైన) కర్మ బంధనమును గలుగ జేయదు. అద్దానిని సంగరహితముగ, ఫలాపేక్షలేక (నిష్కామముగ) నాచరించవలెను.

అ॥ యజ్ఞములయొక్క మహిమను తెలియజేయుచున్నాడు -

10. సహ యజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వమేషవోఽస్త్విష్టకామధుక్.

టీక:– ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, పురా = పూర్వము (సృష్ట్యాదియందు), సహయజ్ఞాః = యజ్ఞములతోగూడి, ప్రజాః = జనులను, సృష్ట్వా = సృష్టించి, అనేన = దీనిచే (ఈ యజ్ఞములచేత), ప్రసవిష్యధ్వమ్ = వృద్ధిని బొందుడు, ఏషః = ఇది, వః = మీకు, ఇష్టకామధుక్ = ఇష్టములగు కోరికల నిచ్చునట్టిదిగా, అస్తు = అగుగాక, (అని) ఉవాచ = పలికెను.

తా:– పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతో గూడ ప్రజలను సృష్టించి 'ఈ యజ్ఞములచే మీరభివృద్ధినిబొందుడు. ఇవి మీ యభీష్టములను నెరవేర్చుగాక!' అని వారితో బలికెను.

వ్యాఖ్య:– మనుజు డెపుడు సృష్టింపబడెనో, అతనితోసహా అతడు బంధమునుండి ముక్తుడగుటకు వలసిన సాధనోపాయము కూడ సృష్టింపబడెనని ఈ శ్లోకమందు తెలుపబడినది. అహో! భగవంతు డెట్టి కరుణామయుడో, ప్రాణికోట్లను తరింపజేయవలెనని ఎంత కుతూహలముకలవారో చూడుడు! 'అయ్యో! ఈ సృష్టింపబడిన ప్రజలు సంసారబంధమున బడి జననమరణప్రవాహమున కొట్టుకొనుచు ఇంచుకేని శాంతిలేక తల్లడిల్లుదురు. అట్టివారు ఆ సంసారనరకబాధనుండి తప్పించుకొనుటెట్లు?' అని సర్వేశ్వరుడు ఆలోచించి మొట్టమొదటనే మోక్షసాధనోపాయములైన అనేక యజ్ఞములనుగూడ సృష్టించిరనియిట పేర్కొనబడినది.

యజ్ఞమనగా భగద్విషయమైనట్టిగాని, పరోపకారసంబంధమైనట్టిగాని, ఆత్మధ్యానసంబంధమైనట్టి గాని, క్రియయని భావము. ఈ యజ్ఞములనుగూర్చి విస్తారముగ రాబోవు అధ్యాయమున తెలుపబడగలదు.

"ఇష్టకామధుక్" – ఈ యజ్ఞములు కామధేనువువలె జీవుల యభీష్టములను నెరవేర్చి, వారిని ఉన్నతపథగాములుగ నొనర్చునని చెప్పబడినది. జీవులు మిక్కుటముగ నభిలషించునట్టి దుఃఖరాహిత్యము, పరమానందప్రాప్తి అను నీ రెండును ఈ యజ్ఞముల నాచరించుటద్వారా జీవుడు తప్పక పొందగలడు. కావున అవి ఇష్టకామధుక్ – అని వచింపబడినవి. ప్రసవిష్యధ్వమ్ – అని పేర్కొనుటవలన జీవుని నైతిక, ఆధ్యాత్మికాభివృద్ధిని ఆ యజ్ఞములు కలుగజేయగలవని ఇట స్పష్టముచేయబడినది.

ప్ర:– బ్రహ్మదేవుడు ప్రజలను సృష్టించునపుడు వారితోసహా మఱివేనిని సృష్టించిరి?

ఉ:– యజ్ఞములను (సత్కార్యములను, దైవకార్యములను).

ప్ర:– వానివలన ప్రయోజనమేమి?

ఉ:– అవి జీవుని ఆధ్యాత్మికాభివృద్ధిని గలుగజేయును – కామధేనువు చందమున ఆతని కోరికలను (శాంతిసుఖములను, మోక్షమును) నెరవేర్చును.

11. దేవాన్భావయతానేన తే దేవా భావయన్తు వః
పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ.

టీక:– అనేన = ఈ యజ్ఞముచేత, దేవాన్ = దేవతలను, భావయత = సంతోష పఱచుడు, తే దేవాః = ఆ దేవతలు, వః = మిమ్ములను, భావయన్తు = (వర్షాదులచే) సంతుష్టినొందించుదురుగాక! (ఈ ప్రకారముగ), పరస్పరమ్ = ఒకరినొకరు, భావయన్తః = సంతోషపఱచుకొనువారలై, పరమ్ = ఉత్కృష్ట మగు, శ్రేయః = శ్రేయస్సును, అవాప్స్యథ = పొందగలరు.

తా:– ఈ యజ్ఞములచే దేవతలను తృప్తిపఱచుడు. ఆ దేవతలున్ను మిమ్ములను (వర్షాదులచే) తృప్తినొందించుదురు గాక! ఈ ప్రకారముగ పరస్పరము తృప్తినొందించు కొనుటవలన ఉత్తమశ్రేయమును బొందగలరు.

వ్యాఖ్య:– అనేక దేవతల రూపముననున్నది సాక్షాత్ పరమేశ్వరుడే కనుక, ఏ దేవతను పూజించినను, అర్చించినను, ధ్యానించినను భగవంతుని ఆరాధించినట్లే యగును. కావున ఈ యజ్ఞములద్వారా జీవులు భగవంతుని ఆరాధించినచో, భగవానుడు వారల ననుగ్రహించుదురు. ఆ యా దేవతల మూలకముగ తత్తత్ఫలములను ఒసంగుచుండును. ఈ ప్రకారముగ జీవుడు యజ్ఞములద్వారా (ఫలాపేక్షారహితసత్కర్మల ద్వారా) భగవంతు నెపుడారాధించునో అపుడు వారనుగ్రహించి జ్ఞానముద్వారా పరమశ్రేయమగు మోక్షమాతనికి కలుగజేయ గలరు.

"శ్రేయః పరమ్" - ప్రపంచములో అనేక శ్రేయములున్నను వాని నన్నింటిని మించిన శ్రేయమగు మోక్షమును భగవదారాధనపరుడు బడయగల్గుచున్నాడు. కనుకనే అయ్యది యిచట పరమశ్రేయమని వచింపబడినది. ఆత్మస్థితి (మోక్షస్థితి) యొకటియే లోకమున పరమశ్రేయము. దానిని భగవత్కరుణచే జీవుడు పొందగలడు. ఏలయనిన సర్వేశ్వరుని అనుగ్రహములేనిదే ఈ మాయ నెవరును దాటలేరు. ఆ భగవత్కరుణయో, జీవుని యొక్క స్వకీయపురుష ప్రయత్నముచేతనే లభించుచున్నది.

జీవునకు దేవునకు సంబంధము (link) లేనిచో ఎవడును ప్రపంచమున వృద్ధికిరాలేడు. కావున ప్రాపంచికవ్యక్తులతోకంటె దైవముతో ఎక్కువ సంబంధమును ఏర్పఱచుకొనవలెను. ప్రపంచ మనుజులు ఒకపుడు మనకు సహాయము చేయవచ్చును, మఱొకపుడు చేయలేకపోవచ్చును. ఎట్లున్నను వారితోటి సంబంధము ఈ జన్మముతోనే అంతమగును. కాని దైవసంబంధ మట్టిది కాదు. దైవము జన్మజన్మాంతరము జీవులవెంటనుండి వారికి శ్రేయమును గలుగజేయును. లేక, వారివారి సాధనతీవ్రతనుబట్టి ఈజన్మముననే మోక్షమును గలుగజేయవచ్చును. కాబట్టి అట్టి సర్వోత్తమమగు దైవసంబంధము నెవరును విస్మరింపరాదని ఈ శ్లోకమున జ్ఞాపకము చేయబడినది.

ప్ర:– పరమశ్రేయమగు మోక్ష మెట్లు లభించును?

ఉ:– యజ్ఞముల (ఫలాభిసంధిరహిత సత్కర్మల) ద్వారా భగవంతుని, లేక, దేవతలను ఆరాధించుటచే (క్రమముగ చిత్తశుద్ధిగలుగ, దానిచే జ్ఞానమావిర్భవింప, అట్టి జ్ఞానమువలన) మోక్షము లభించును.

అ॥ భగవద్దత్తపదార్థములను భగవంతునకు నివేదించక అనుభవించువాడు దొంగయని చెప్పుచున్నాడు -

12. ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః
తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః.

టీక:– *యజ్ఞభావితాః* = యజ్ఞముచే సంతోషపెట్టబడిన, *దేవాః* = దేవతలు, *వః* = మీకొఱకు, *ఇష్టాన్* = ఇష్టములగు, *భోగాన్* = భోగములను, *దాస్యన్తే హి* = ఇయ్యగలరుకదా!, *తైః* = వారిచేత, *దత్తాన్* =

ఇవ్వబడిన (మృష్టాన్నాది భోగములను), ఏభ్యః = వీరికొఱకు (ఆ దేవతలకు), అప్రదాయ = సమర్పింపకయే, యః = ఎవడు, భుఙ్క్తే = భుజించుచున్నాడో, సః = అతడు, స్తేన ఏవ = దొంగయే యగును.

తా:— మనుజుడు చేయు యజ్ఞములచే సంతోషించి దేవతలు వారికి ఇష్టములైన భోగములనిత్తురు. అట్లు వారిచే ఇవ్వబడిన యా భోగ్యవస్తువులను తిరిగి వారికి సమర్పింపకనే ఎవడనుభవించునో అతడు దొంగయే యగును.

వ్యాఖ్య:— యజ్ఞములచే ఆరాధింపబడినపుడు భగవంతుడు, లేక ఆ యా దేవతలు అన్నాది భోగ్యపదార్థములను వారికి కలుగజేయుదురు. భగవద్దత్తములైనవానిని తిరిగి భగవంతునికి సమర్పింపక, లేక భగవత్స్వరూపులేయగు ప్రాణికోట్లకు ఒసంగక తాను భుజించినచో, లేక అనుభవించినచో అతడు దొంగయే యగునని ఇట చెప్పబడినది. 'దొంగ' అను పదమునకు నిర్వచనమేమి? తనది కాని వస్తువును దాని క్రయము చెల్లించక తెచ్చుకొనువాడే దొంగ. అన్నము మొదలగు భోగ్యవస్తువులు భగవంతుని సొత్తు. మనదికాదు. ఏలయనిన దానిని మనము తయారుచేయలేము. పరమాత్మయే వర్షములను కురిపించి, సస్యములలోని జీవశక్తిని ప్రోద్దీపింపజేసి ధాన్యమును సృష్టించిరి. కావున దానిమూల్యమును మనము భగవంతునకు చెల్లించవలెను. భక్తియే దానిమూల్యము. కృతజ్ఞతయే దాని మూల్యము. కావున ఆ అన్నమును భగవంతునకు (కృతజ్ఞతా పూర్వకముగ) నివేదించవలెను. లేక దానిలో కొంతభాగమును ప్రాణికోట్లకు సమర్పించవలెను. అట్లుచేయకున్న దానిని జీవుడు దొంగిలించినట్లే యగును. ఈ ప్రకారముగ ఈశ్వరుడిచ్చిన అన్నాది భోగ్యపదార్థములను తిరిగి ఈశ్వరునకు సమర్పించక అనుభవించు వాడు దొంగయే యని శ్రీకృష్ణమూర్తి స్పష్టముగ చెప్పివైచిరి.

కాని యిపుడు ప్రపంచమున ఎందఱాప్రకారముగ దైవమునకు నివేదన సల్పుచున్నారు? ప్రపంచవాసుల దృష్టిలో మనుజు డెంత గొప్పవాడైనను, విద్యావంతుడైనను, ధనవంతుడైనను, రాజైనను, భగవంతుని దృష్టిలో దొంగ యనిపించుకొనిన నేమి ప్రయోజనము? కావున అట్టి స్థితి కలుగకుండ చూడవలెను. మఱియు ప్రపంచములో దొంగకు శిక్ష విధింపబడుచున్నది. అట్టిచో దైవవస్తువులను స్వార్థమునకు వినియోగించుకొను ఈ దొంగలకు శిక్ష యుండదా? వారికి ఈశ్వరుడు తగిన శిక్షను విధించియేతీరును. కావున ముముక్షువులు తమకున్నంతలో ఏదియో కొంతపదార్థము కనీసము ఒక్క కబళమైనను - భూతకోట్లకు ప్రసాదించుచు, తాననుభవించు దానిని 'బ్రహ్మార్పణము' లేక 'కృష్ణార్పణము' లేక 'రామార్పణము' చేసి తదుపరి యనుభవింపవలెను. ఈ ప్రకారముగ ఈశ్వరార్పణబుద్ధి, భక్తిభావన, పరోపకారదృష్టి అలవఱచుకొని ధన్యులు కావలయును.

ప్ర:— యజ్ఞములచే (ఫలాపేక్షారహిత సత్కర్మలచే) నారాధింపబడి భగవంతుడు జనుల కేమి యొసంగును?

ఉ:— వారివారికి ఇష్టములైన అన్నాది భోగ్యపదార్థముల నిచ్చును.

ప్ర:— అవి లభించినపుడు జీవు డేమిచేయవలెను?

ఉ:— వెంటనే వానిని ఆ యా దేవతలకు, లేక భగవంతునకు నివేదన చేయవలెను.

ప్ర:— అట్లుచేయక ననుభవించినచో కలుగు నష్టమేమి?

ఉ:— అత్తఱి యాతడు దొంగక్రింద పరిగణింపబడి తగు శిక్ష ననుభవించవలసివచ్చును.

అ॥ పదార్థములను భగవదర్పితముచేసి యనుభవించు వారికి కలుగు సత్ఫలము, స్వార్థము కొఱకు వినియోగించువారికి కలుగు దుష్ఫలితము వచించుచున్నాడు -

13. యజ్ఞశిష్టాశినస్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః
భుఞ్జతే తే త్వఘం పాపా[1] యే పచన్త్యాత్మకారణాత్.

టీక:- యజ్ఞశిష్టాశినః = యజ్ఞమందు భగవదర్పణముచేసి మిగిలినదానిని తిను, సన్తః = సజ్జనులు, సర్వకిల్బిషైః = సమస్త పాపములనుండియు, ముచ్యన్తే = విడువబడుచున్నారు, యేతు = ఎవరైతే, ఆత్మకారణాత్ = తమ (యుదరపూరణ) నిమిత్తమే, పచన్తి = వండుకొనుచున్నారో (భుజించుచున్నారో), పాపాః = పాపులైన, తే = వారలు, అఘమ్ = పాపమును, భుఞ్జతే = తినుచున్నారు.

తా:- యజ్ఞమునందు (భగవదర్పణముచేసి) మిగిలిన పదార్థమును తిను సజ్జనులు సమస్తపాపములనుండియు విడువబడుచున్నారు. అట్లుకాక ఎవరు తమ నిమిత్తమే భుజించు చున్నారో, అట్టివారు పాపమును తినువారే యగుదురు.

వ్యాఖ్య:- భగవదారాధనరూపములగు యజ్ఞములను గావించి, అన్నాదులను భగవంతునకు అర్పణచేసి (లేక, భగవత్స్వరూపులే యగు ప్రాణికోట్లకు కొంతభాగమును సమర్పించి) మిగిలిన పదార్థమును భుజించువాడు సమస్త పాపములనుండియు విముక్తుడగునని యిచట చెప్పబడినది. 'సర్వకిల్బిషైః' - అని చెప్పబడినందున, ఒకటి రెండు పాపముల నుండి కాదనియు, సమస్తపాపముల నుండియు విడివడునని తెలుపబడినది. దీనినిబట్టి యజ్ఞములకు, భగవన్నివేదనమునకు, త్యాగమునకు పరోపకారమునకు ఎంతటి సామర్థ్యమున్నదో స్పష్టమగుచున్నది. కనుకనే ఈశావాస్యోపనిషత్తుయొక్క ఆరంభమున 'తేన త్యక్తేన భుఞ్జీథాః' - 'నీకున్నదానిలో నొకింత త్యాగమొనర్చి భుజింపుము' నీకున్నది భగవంతునకు అర్పించి భుజింపుము. - అని చెప్పబడినది. అట్లు కాక స్వార్థము కొఱకే భుజించువారు, దైవమున కర్పింపక భుజించువారు, పరప్రాణికి ఒకింతైనను త్యాగమొనర్పక భుజించువారు, పాపమును భుజించినట్లే యని భగవానుడు వారిని తీవ్రముగ మందలించిరి. వారు పాపమునే మూటకట్టుకొనుచున్నారు. లేక, పాపమునే భుజించుటచే అయ్యది వారి రక్తనాళములలో ప్రవేశింప వారు కేవలము పాపరూపులే యగుచున్నారని భావము. కావున స్వార్థమే పాపహేతువు, స్వార్థత్యాగమే మోక్షహేతువని ఈ శ్లోకముద్వారా తేటతెల్లమగుచున్నది. భగవంతునకు నివేదింపక, పరప్రాణికి ఒకింతైనను పెట్టక పంచభక్ష్యపరమాన్నములను ఆరగించినను విషము తినినట్లేయగుననియు, ఈశ్వరార్పణముచేసి, భూతకోట్ల కొకింత త్యాగము చేసి గంజి త్రాగినను అది అమృతమేయగు ననియు నిట వెల్లడింపబడినది.

మఱియు మానవునకు తన నిత్యజీవితమున ఏదైన కోయునపుడు, నూఱునపుడు, విసఱుచున్నపుడు, వండునపుడు, ఊడ్చునపుడు, తెలియక కొంత ప్రాణిహింస జరుగవచ్చును. దానినే పంచసూనములందురు. ఆ పాపమును పరిహరించుటకు పంచమహాయజ్ఞము లేర్పడినవి. అవి యేవియనిన - (1) దేవయజ్ఞము (హోమము) (2) పితృయజ్ఞము (తర్పణము) (3) నృయజ్ఞము (అతిథిపూజ) (4) బ్రహ్మయజ్ఞము (వేదాధ్యయనము) (5) భూతయజ్ఞము (ప్రాణులకు అన్నమిడుట). కావున ఇవియు, ఇంకను భగవదారాధనరూపములై, పరోపకార సంబంధములైనట్టి ఇతరములునునగు యజ్ఞముల నాచరిం చుచు, యజ్ఞశేషమును మాత్రము భుజించుచు నుండువారు పాపరహితులై, క్రమముగ పరమశ్రేయము నొందగలరని భగవాను డీశ్లోకమున తెలుపుచున్నాడు.

[1] తే త్వఘం భుఞ్జతే పాపా - పాఠాన్తరము

ప్ర:– యజ్ఞశేషమును (దైవార్పితముచేసి శేషించిన దానిని) భుజించువారికి కలుగు ఫలితమేమి?

ఉ:– వారు సర్వపాపములనుండి విముక్తులగుదురు.

ప్ర:– అట్లుకాక, స్వార్థముకొఱకు భుజించువారికి కలుగు ఫలితమేమి?

ఉ:– వారు పాపమునే పొందుదురు. పాపరూపులే యగుదురు.

అ॥ యజ్ఞము మహాపవిత్రమైనదనియు, పరమాత్మకూడ దానియందు సుప్రతిష్ఠితులై వెలయుచుందురనియు చెప్పబడుచున్నది –


14. అన్నాద్భవన్తి భూతాని పర్జన్యా దన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః.

15. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్.

టీక:– అన్నాత్ = అన్నమువలన, భూతాని = ప్రాణులు, భవన్తి = కలుగుచున్నవి, పర్జన్యాత్ = మేఘమువలన, అన్నసంభవః = అన్నము కలుగుచున్నది, యజ్ఞాత్ = యజ్ఞము వలన, పర్జన్యః = మేఘము, భవతి = కలుగుచున్నది, యజ్ఞః = యజ్ఞము, కర్మసముద్భవః = సత్కర్మాచరణమువలన గలుగుచున్నది, కర్మ = సత్కర్మము, బ్రహ్మోద్భవమ్ = వేదమువలన గలుగుచున్నది, బ్రహ్మ = వేదము, అక్షరసముద్భవమ్ = అక్షరపరమాత్మవలన గలుగుచున్నది, తస్మాత్ = అందువలన, సర్వగతమ్ = అంతటను వ్యాపించిన, బ్రహ్మ = బ్రహ్మము, నిత్యం = ఎల్లపుడును, యజ్ఞే = యజ్ఞమునందు, ప్రతిష్ఠితమ్ = ఉంచబడినదానినిగ, విద్ధి = యెఱుంగుము.

తా:– ప్రాణులు అన్నమువలన కలుగుచున్నవి. అన్నము మేఘమువలన కలుగుచున్నది. మేఘము యజ్ఞమువలన కలుగు చున్నది. యజ్ఞము సత్కర్మవలన కలుగుచున్నది. సత్కర్మ వేదము వలన కలుగుచున్నది. వేదము అక్షరపరబ్రహ్మము వలన కలుగు చున్నది. కాబట్టి సర్వవ్యాపకమగు బ్రహ్మము నిరంతరము యజ్ఞమునందు ప్రతిష్ఠింపబడినదానినిగ నెఱుంగుము.

వ్యాఖ్య:– **ధర్మచక్రము**



బ్రహ్మమువలన వేదము, వేదమువలన సత్కర్మ, సత్కర్మ వలన యజ్ఞము కలుగుచున్నవి. ఇక్కారణమున యజ్ఞము నందు బ్రహ్మము సదాప్రతిష్ఠితమై యలరుచున్నదనియిట చెప్పబడినది. కనుకనే యజ్ఞాదులు మహాపవిత్రములై చిత్తశుద్ధి కారకములై, మోక్షప్రదములై యొప్పుచున్నవి. (పై చక్రమున వర్షము, అన్నము, శరీరము యజ్ఞమునం దంతర్భూతములై యుండుటవలన నిచట లిఖింపబడలేదు). దైవకార్యములు (యజ్ఞాదులు) సామాన్యములని తలంపరాదు. ఏలయనిన వానియందు సాక్షాత్ వ్యాపక పరబ్రహ్మము సుఖప్రతిష్ఠితమై యున్నదని గీత యుద్ఘోషించుచున్నది. కాబట్టి సర్వులు వాని నాచరించి క్రమముగ చిత్తశుద్ధి ద్వారా బ్రహ్మసాక్షాత్కారము నొంది బంధవిముక్తులు కావలసియున్నారు.

"యజ్ఞాద్భవతి పర్జన్యః" - యజ్ఞమువలన వర్షము కురియుచున్నదని చెప్పబడినది. దీనినిబట్టి యజ్ఞాదులయొక్క అభావమువలననే కఱువు - కాటకము లేర్పడుచున్నవని స్పష్టమగుచున్నది. కావున దేశ సౌభాగ్యము కొఱకును, ఆత్మశుద్ధి కొఱకును జనులు సత్కర్మలను విరివిగ నాచరింపవలయును.

ప్ర:- యజ్ఞము లెందులకు పవిత్రములైనవి?

ఉ:- వానియందు సర్వవ్యాపక బ్రహ్మము ప్రతిష్ఠితమై యున్నది. కావున వాని నాచరించుట ద్వారా జీవునకు క్రమముగ బ్రహ్మముయొక్క సాక్షాత్కారము సిద్ధించగలదు.

అ॥ యజ్ఞరూప సత్కార్యముల నాచరించనివాని జీవితము నిష్ఫలమని వచించుచున్నాడు -

16. ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః
అఘాయురిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి.

టీక:- పార్థ = ఓ అర్జునా!, యః = ఎవడు, ఏవమ్ = ఈ ప్రకారముగ, ప్రవర్తితమ్ = ప్రవర్తింపజేయబడిన, చక్రం = జగచ్చక్రమును, ఇహ = ఈ లోకమున, న అనువర్తయతి = అనుసరించి వర్తింపడో, సః = ఆతడు, అఘాయుః = పాపజీవితము కలవాడును, ఇన్ద్రియారామః = ఇంద్రియభోగాసక్తుడును (అయి), మోఘమ్ = వ్యర్థముగ, జీవతి = బ్రతుకుచున్నాడు.

తా:- ఓ అర్జునా! ఈ ప్రకారముగ ప్రవర్తింపజేయబడిన ధర్మచక్రమును ఈ ప్రపంచమున ఎవడనుసరించి వర్తింపడో, ఆతడు పాపజీవితమును గడుపువాడును, ఇంద్రియలోలుడును అయి వ్యర్థముగ బ్రతుకుచున్నాడు.

వ్యాఖ్య:- యజ్ఞములు (నిష్కామబుద్ధితో చేయబడు సత్కార్యములు) సామాన్యము లైనవి కావు. వానియందు సర్వవ్యాపకపరబ్రహ్మముయొక్క శక్తి ఇమిడియున్నది. కావున వానిననుసరించువాడు పరమశ్రేయమును (మోక్షమును) బొందును. అనుసరింపనివాడు తన జీవితమును వ్యర్థము చేసికొనును. ఏలయనిన అతడు దైవమును విస్మరించి, దృశ్యమును నమ్ముకొని విషయలోలుడై పాపపుబ్రతుకు బ్రతుకును. యజ్ఞరూప సత్కర్మలచే భగవంతుని, లేక దేవతలను ఆరాధింపనివాడు, త్యాగబుద్ధిలేనివాడు, పరోపకారముచేయని వాడు సంసారకూపమునబడి జీవితమును భ్రష్టమొనర్చుకొనునని యిట తెలుపబడినది. అట్లుకాక పైన దెలుపబడిన ఈ ధర్మచక్రము ననుసరించి యజ్ఞరూపసత్కర్మల నాచరించువాడు భగవదను గ్రహమునకు పాత్రుడై, చిత్తశుద్ధిని బడసి క్రమముగ మోక్ష ధామము నలంకరించును. ఒకనిది పాపజీవితము,

మఱియొకనిది పుణ్యమయజీవితము; ఒకడు ఇంద్రియారాముడు, మఱి యొకడు ఆత్మారాముడు; ఒకడు వ్యర్థజీవి, మఱియొకడు సార్థకజీవి.

భగవంతుని మఱచుటయే పాపము (To forget God is sin) అని రామతీర్థులు వక్కాణించియున్నారు. పైనదెల్పిన ధర్మచక్రము ననువర్తింపనివారు దైవమును మఱచి దృశ్యమునే వెంటాడుచుందురు. కావున వారు పాపమును మూటకట్టుకొను చుందురు. కనుకనే వారిని 'అఘాయువులు' (పాపపుబ్రతుకు కలవారు) అని గీతాచార్యులు పేర్కొనిరి. మఱియు దృశ్యమును సత్యమని నమ్మి దానివెంట పరుగిడువాడు సహజముగ ఇంద్రియలోలుడై, విషయాసక్తుడై ప్రవర్తించును కాబట్టి వారిని 'ఇంద్రియారాము' లనియు వర్ణించిరి. అట్టివారి జీవితము తమకుగాని, పరులకుగాని ఉపయోగించదు. కావున వారిది 'మోఘజీవితము' (వ్యర్థజీవితము) అనియు చెప్పబడెను. మానవుడైపుట్టి, దైవమును విస్మరించి, ఇంద్రియసుఖములలో మునుగుటకంటె క్రిమికీటకాదులలో జన్మించుట మేలు. కావున భగవానుడు పేర్కొనిన ఈ యజ్ఞాచరణరూప ధర్మచక్రము ననుసరించి మానవజీవితమును సార్థకము చేసికొనవలయును.

ప్ర:– యజ్ఞాదిరూపమగు ధర్మచక్రము ననుసరింపనివాని జీవిత మెట్లుండును?

ఉ:– (1) అతడు పాపమయజీవితము గలిగియుండును. (2) ఇంద్రియలోలుడై వర్తించును. (3) జీవితమును వ్యర్థమొనర్చుకొనును.

అ|| ఆత్మసాక్షాత్కారముగల మహనీయులు స్వతః దైవమునందే నిరంతరము వర్తించు చుందురు. కావున అట్టివారికి మాత్ర మీ యజ్ఞాది కార్యనిర్వహణమునందు విధి యేమియు లేదని రెండుశ్లోకములద్వారా చెప్పుచున్నాడు -

17. యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః
ఆత్మన్యేవ చ సన్తుష్టస్తస్య కార్యం న విద్యతే.

టీక:– యః మానవః తు = ఏ మానవుడైతే, ఆత్మరతిః ఏవ = ఆత్మయందే రమించువాడును, ఆత్మతృప్తః చ = ఆత్మయందే తృప్తిని బొందువాడును, ఆత్మని ఏవ = ఆత్మయందే, సంతుష్టః చ = సంతోషపడువాడును, స్యాత్ = అగునో, తస్య = అట్టివానికి, కార్యమ్ = చేయదగినది, న విద్యతే = లేదు.

తా:– ఎవడు కేవలము ఆత్మయందే క్రీడించుచు, ఆత్మయందే తృప్తిని బొందుచు, ఆత్మయందే సంతోషపడుచు నుండునో, అట్టి ఆత్మజ్ఞానికిక చేయదగినపని (విధి) యేదియును లేదు.

వ్యాఖ్య:– కర్మయోగమును శీలించవలసిన విధి లోకములో కొద్దిమందికి తప్ప తక్కినవారందఱికిని గలదు, ఆ కొద్దిమంది యెవరో ఈ శ్లోకమందు చెప్పబడినది. ఆత్మారాములు, ఆత్మతృప్తులు, ఆత్మసంతుష్టులు - అగు మహనీయులకు కర్మ సంబంధమైన విధిలేదు. ఏలననగా సమస్త కర్మలయొక్క, సాధనల యొక్క అవధి (లక్ష్యము) ఆత్మసాక్షాత్కారము. అదియో వారికి లభించియేయున్నది. కర్మద్వారా పొందదగిన ఫలమును వారు పొందియైచిరి. కాబట్టి శాస్త్రము లట్టివారికి 'విధి' ని తొలగించినవి. అయినను లోకసంగ్రహార్థము అట్టి మహాత్ములు సత్కర్మల నాచరించుచునేయుందురు. వారు కర్మచేసినను దోషములేదు, చేయకున్నను దోషములేదు.

అయితే ఇట్టి స్థితి సామాన్యజనులందఱికిని అన్వయించదు. ప్రపంచములో ఆత్మానుభూతినిబడసిన మహనీయులు చాల అరుదుగా నుందురు. తక్కినవారందఱున్ను కర్మ చేయవలసినదే. కృతార్థులు కావలయుననిన కృతకృత్యులు కావలసినదే. అయితే తాము పూర్ణస్థితిని పొందకున్నను, పొందినట్లు నటించి అకర్మణ్యులవరాదు. అది కపటము, మిథ్యాచారము.

ప్రపంచములో నిపుడెక్కువమంది విషయరతి, విషయతృప్తి, విషయసంతుష్టిలో కాలక్షేపము చేయుచున్నారు. దానివలన ఇహమునకుగాని, పరమునకుగాని వారికి లాభించునది లేదు. కాబట్టి ఆ పద్ధతిని మార్చుకొని "ఆత్మరతి, ఆత్మతృప్తి, ఆత్మసంతుష్టి" - వీనిని పొందులాగున ప్రయత్నించవలెను. జీవిత లక్ష్యమిదియే. వాస్తవముగ ఆనందము జనులు తలంచులాగున బయటలేదు. అది హృదయముననే కలదు. బయట నున్నది ప్రతిబింబానందము, క్షణికసుఖము. లోనగలది శాశ్వత నిరతిశయానందము. కనుకనే విజ్ఞులగువారు దృశ్యపదార్థముల యెడల విరక్తి గలిగి, అంతర్ముఖులై ఆత్మానందమును గ్రోలుచుందురు. అట్టివారిని గూర్చియే ఈ శ్లోకమున ప్రస్తావించబడినది.

"మానవః" - అని ప్రయోగింపబడినందువలన, ప్రతి మానవునకు అట్టి ఆత్మానుభవరూపమైన జీవన్ముక్తస్థితిని బడయుటకు అర్హతకలదనియు, సర్వమానవులును జాతి మత కులభేదములేక అట్టి మహోన్నతస్థితిని ప్రయత్నముచే పొంద వచ్చుననియు పేర్కొనబడినది.

ప్ర:- కర్మయోగమును గూర్చిన విధి యెవరికి లేదు?

ఉ:- ఆత్మారాములు, ఆత్మతృప్తులు, ఆత్మసంతుష్టులు నగు మహనీయులకు కర్మను గూర్చిన విధిలేదు.

18. నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః.

టీక:- తస్య = అతనికి (అట్టి ఆత్మజ్ఞానికి), ఇహ = ఈ లోకమందు, కృతేన = కర్మచేయుట చేత, అర్థః = ప్రయోజనము, న ఏవ = లేదు, అకృతేన = కర్మచేయకపోవుటచేత, కశ్చన = ఒకానొక (దోషః = దోషము), న = లేదు, అస్య = ఇతనికి, సర్వభూతేషు = చరాచర సమస్త ప్రాణులందును, అర్థవ్యపాశ్రయః = ప్రయోజనమునిమిత్త మాశ్రయింపదగినది, కశ్చిత్ = ఏదియును, న = లేదు.

తా:- అట్టి ఆత్మజ్ఞాని కీ ప్రపంచమున కర్మచేయుటచే ప్రయోజనముగాని చేయకుండుటచే దోషముగాని ఏదియును లేదు. మఱియు నాతనికి సమస్తభూతములయందును ఎట్టి ప్రయోజనము కొఱకైనను ఆశ్రయింపదగినది యేమియులేదు.

వ్యాఖ్య:- పైనదెల్పిన జీవన్ముక్తుడగు ఆత్మజ్ఞానికి కర్మచేయుటచేగాని, చేయకపోవుటచేగాని, ప్రయోజనమేమియు లేదని తెలుపబడినది. ఏలయనిన, అతడు, నిరంతరము ఆత్మయందే తృప్తిగలిగి యుండును గనుక కర్మచేగాని, కర్మత్యాగముచేగాని క్రొత్తగ సాధింపదగిన విషయము ప్రపంచమున అతని కేమియునులేదు. అతడు తలంచుకొనినచో కర్మచేయవచ్చును; చేయకను ఉండవచ్చును. విధి యేమియును లేదు. అయినను లోకక్షేమము కొఱకై అట్టి మహనీయులలో పెక్కురు సత్కర్మల నాచరించుచునే యుందురు.

మఱియు అట్టి ఆత్మనిష్ఠులు ప్రపంచమున ఏ ప్రయోజనము నిమిత్తమైనను ఒకరిని ఆశ్రయింపవలసినపని లేదని వచింపబడినది. ఎందువలననగా, అన్ని ప్రయోజనములు దేనివలన సిద్ధించుచున్నవో, అన్ని ప్రయోజనములకును కూడలి, మూలస్థానము (Head Quarters) ఏదియో అట్టి ఆత్మను వారు కైవసము చేసికొనియే యున్నారు. 'శతే పంచాశత్' (నూటిలో యాభై ఇమిడి యున్నది) - అను న్యాయము ననుసరించి సమస్త ప్రాపంచిక ప్రయోజనములున్ను ఆత్మప్రాప్తియం దంతర్భూతములే అయియున్నవి. కావున అట్టివారొకరియొద్ద చేయిజాపవలసిన పనిగాని, ఒకరికి లొంగవలసిన పనిగాని, ఒకరిని ఆశ్రయించవలసిన అవసరముగాని యేదియును లేదు.

అయితే ఇట్టి కర్మసంబంధమైన విధి లేకుండుట ఆత్మనిష్ఠుని కొకనికేకాని తక్కిన వారికి కాదు. తక్కినవారందఱున్ను తప్పక (నిష్కామబుద్ధితో) కర్మనాచరింపవలసినదే. ఉద్యోగవిరమణానంతరము ఉపకారవేతనము (Pension) తీసికొనుచు, తీరికగానుండు వారిని జూచి విద్యార్థిదశలోనున్నవాడుగాని, ఉద్యోగిగాని తమ కర్తవ్యమును వదలినచో ఎట్లు భ్రష్టుడై పోవునో, అట్లే జీవన్ముక్తదశ నొందకపూర్వము కర్తవ్యనిర్వహణమును, (కర్మవిధిని) త్యజించువాడున్ను పతనమునొందిపోవును. కావున సాధకు లీ విషయమున కడుజాగరూకులై మెలగుచు తమతమ సాధనలయం దేమాత్రము కొఱత రానీయక చూచుచుండవలెను.

అ॥ ఫలాపేక్షనువదలి కార్యముల నాచరించవలసినదిగా నిపుడు భగవానుడు అర్జునుని ఆదేశించుచున్నాడు -

19. తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః.

టీక:— తస్మాత్ = అందువలన, (త్వమ్ = నీవు), అసక్తః = సంగము (ఫలాపేక్ష) లేనివాడవు (అయి), సతతమ్ = ఎల్లప్పుడును, కార్యమ్ = చేయదగిన, కర్మ = కర్మమును, సమాచర = లెస్సగ నాచరింపుము, అసక్తః = సంగములేనివాడు (అయి), కర్మ = కర్మను, ఆచరన్ = ఆచరించుచున్న, పూరుషః = పురుషుడు, పరమ్ = మోక్షమును, ఆప్నోతిహి = పొందుచున్నాడుకదా!

తా:— కాబట్టి నీవు సంగము (ఫలాపేక్ష) లేనివాడవై, చేయదగినకర్మను ఎల్లప్పుడును చక్కగ చేయుచుండుము. అసక్తుడై కర్మనాచరించు మనుజుడు (క్రమముగ) మోక్షము నొందుచున్నాడు.

వ్యాఖ్య:— "తస్మాత్" - ఆత్మజ్ఞానికి కర్మనిర్వహణము నందు విధిలేదు. తక్కిన వారందరున్ను కర్మ నాచరించవలసినదే. 'కాబట్టి' (సాధనదశయందున్న) నీవు కర్మ తప్పకచేయవలెను. అయితే (1) దానియందలి సంగమును, సక్తత్వమును (attachment) విడనాడి చేయుము. (2) మఱియు శాస్త్రనియతములగు కార్యములనే చేయుము. ఈ రెండువిశేషణములున్ను చేరి యున్నచో అపుడు కర్మము దోషవర్జితమై మోక్షమునకు గూడ హేతువై యలరును. కనుకనే అట్టి నిష్కామకర్మను ఎల్లపుడు (సతతమ్) ఆచరించుచుండుమని భగవాను డర్జుననకు హిత వొసంగిరి. కర్మ బంధకరమైనచో దేవదేవు డట్లు బోధించుదురా? కర్మమునందలి సక్తత్వమును, ఫలాపేక్షను, వదలివైచినచో ఆ కర్మము నైష్కర్మ్యమునకు, మోక్షము ('పరమ్')నకు దారితీయ గలదు. వదలనిచో ఆ కర్మము బంధకరమై, సంసారహేతువై వర్తించును. ఇదియే కర్మయందలి రహస్యము.

తక్కిన యోగములతోబాటు కర్మయోగముకూడ మోక్షదాయక మెట్లగునో ఈ శ్లోకమునందు స్పష్టీకరించబడినది. అనాసక్త కర్మయోగమువలన చిత్తము శుద్ధముకాగా మోక్షప్రాప్తికి చక్కని వాతావరణమేర్పడుచున్నది. 'మోక్షో హి చేతో విమలమ్' అనునట్లు చిత్తముయొక్క నైర్మల్యస్థితియే మోక్షము. అదియో, నిష్కామకర్మాచరణముచే తప్పక సిద్ధించుచునేయున్నది. మఱియు లోకములో జనసామాన్యమున జ్ఞాన, ధ్యానయోగము లందు ప్రవేశించువారు అరుదుగా నుందురు. కర్మ, భక్తిమార్గము లందు ప్రవేశించువారు ఎక్కువగా నుందురు. కాబట్టి జనులకు సులభముగ అందుబాటులో నున్న ఆ రెండుమార్గములను తక్కిన జ్ఞానధ్యానాదిమార్గములతోబాటు భగవానుడు గీతయందు చక్కగ ప్రోత్సహించినవారైరి.

ప్ర:– కర్మ నేప్రకార మాచరింపవలెను?

ఉ:– (1) అసక్తముగ (ఫలాపేక్షారహితముగ, నిష్కామముగ) నాచరింపవలెను. (2) చేయదగిన, అనగా శాస్త్రనియతములగు కర్మలనే ఆచరింపవలెను.

ప్ర:– ఆ ప్రకార మాచరించినచో కలుగు ఫలితమేమి?

ఉ:– అట్లాచరించినచో మనుజుడు సాక్షాత్ పరమపదమగు మోక్షమునే పడయును.

అ॥ జనకాదుల దృష్టాంతమునొసంగి నిష్కామకర్మ యోగమును బలపఱచుచున్నాడు –

20. కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి.

టీక:– *జనకాదయః* = జనకుడు మొదలగువారు, *కర్మణైవ* = (నిష్కామ) కర్మముచేతనే, *సంసిద్ధిమ్* = (చిత్తశుద్ధిద్వారా) మోక్షమును, *ఆస్థితాహి* = పొందిరికదా!, *త్వమ్* = నీవు, *లోకసంగ్రహమ్* = జనులను సన్మార్గమున ప్రవర్తింపజేయుట యను ప్రయోజనమును, *సంపశ్యన్ అపి* = ఆలోచించియైనను, *కర్తుమేవ* = కర్మమును జేయుటకే, *అర్హసి* = తగియున్నావు.

తా:– జనకుడు మున్నగువారు నిష్కామకర్మముచేతనే మోక్షమునుబొందిరి. జనులను సన్మార్గమున ప్రవర్తింపజేయు నుద్దేశ్యముచేనైనను నీవు కర్మలను చేయుటకే తగియున్నావు.

వ్యాఖ్య:– క్రిందటి శ్లోకమునందు నిష్కామకర్మాచరణచే మనుజుడు పరమాత్మను (మోక్షమును) బొందగలడని వచించిన సిద్ధాంతమునే యిపుడు జనకాదుల దృష్టాంతముచే బలపఱచుచున్నాడు.

"జనకాదయః" - అని చెప్పుటవలన జనకుడు, అశ్వపతి, ఇక్ష్వాకువు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, భగీరథుడు, మున్నగు చక్రవర్తులని అర్థము. ఈ నిష్కామకర్మయోగము క్రొత్తదేమియు కాదనియు, అనేక రాజులు పూర్వము దానినవలంబించి ముక్తి ధామమును జేరిరనియు, కావున అర్జునుడుకూడ దానినవలంబించవచ్చుననియు భగవానుడు తెలుపుచున్నాడు. రాజ్యమును పాలించుచు మోక్షమును బడయగలమా యనియు, కర్మచేతనే మోక్షసిద్ధి నెవరైన పొందగల్గిరా యనియు అర్జునుడు ప్రశ్నించకమునుపే శ్రీకృష్ణమూర్తి దానికి సమాధాన మిచట చెప్పివైచిరి. కర్మమును నిష్కామముగ శీలించుటచే

చిత్తము నిర్మలమగును. నిర్మలచిత్తమందు జ్ఞానముదయించును. జ్ఞాన విచారణచే మోక్షము సిద్ధించును. ఈ ప్రకారముగ నిష్కామకర్మ యోగము మోక్షహేతువేయగుచున్నది. జనకుడు మొట్టమొదట అనేక సత్కార్యములు ఫలాపేక్షారహితముగ గావించి, చిత్తము శుద్ధముకాగా ఆత్మవిచారణసలిపి స్వస్వరూపసాక్షాత్కారరూప మోక్షమును బడయ గల్గెనని యోగవాసిష్ఠమున చెప్పబడినది. కావున అనాసక్తకర్మవలన ముక్తి చేకూరుటలో సందేహమేమియును లేదు.

ఇక లోకసంగ్రహముకొఱకైనను, అనగా లోకులను అపమార్గమునుండి తప్పించి సన్మార్గమున ప్రవర్తింపజేయుట కైనను, కర్మయోగమత్యావశ్యకమని భగవానుడు వాక్రుచ్చు చున్నారు. పరోపకారమున కెంతటి ప్రాధాన్య మొసంగబడెనో చూడుడు! ఒక్క ప్రాణికైనను ఉపకారముచేయుట మహాపుణ్య ప్రదమైనది. అందును మోక్షోపాయమగు కర్మయోగమును తాను శీలించి ఇతరులచే శీలింపజేయుట, తద్ద్వారా జనులను భవబంధనములనుండి విడివడజేయుట అనుదానిని మించిన ఉపకారము మఱియొకటి యేమికలదు? కనుకనే 'నీవు నిష్కామకర్మయోగమును లెస్సగ నాచరించి జనులనుగూడ సన్మార్గమునకు ద్రిప్పి తరింపజేయుమ'ని భగవాను డర్జునునకు హితబోధ గావించిరి.

ప్ర:- కర్మయోగముచే నిదివఱకెవరైన మోక్షమును బడసిరా? పడసినచో వారెవరు?

ఉ:- పడసిరి. వారే జనకాది చక్రవర్తులు మున్నగువారు.

ప్ర:- కర్మయోగమును శీలించుటవలన ప్రపంచమునకు కలుగు ప్రయోజనమేమి?

ఉ:- దానివలన అనేకులను అపమార్గమునుండి త్రిప్పి సన్మార్గమున ప్రవర్తింపజేయుటకు అవకాశము కలుగును.

అ॥ పెద్దలు చేయుదానినే పిన్న లనుకరించుదురను లోకన్యాయమును వచించుచున్నారు -

21. యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే.

టీక:- శ్రేష్ఠః = గొప్పవాడు, యత్ యత్ = ఏ యే కర్మమును, ఆచరతి = చేయుచున్నాడో, ఇతరః జనః = తక్కిన జనుడున్ను, తత్ తత్ ఏవ = ఆ యా కర్మనే (ఆచరతి = చేయుచున్నాడు), సః = అతడు, యత్ = దేనిని, ప్రమాణమ్ = ప్రమాణముగ, కురుతే = చేయుచున్నాడో (కైకొనుచున్నాడో), లోకః = లోకము (జనులు), తత్ = దానిని, అనువర్తతే = అనుసరించుచున్నది.

తా:- గొప్పవా డే కర్మను చేయునో దానినే తక్కినవారున్ను చేయుదురు. ఆతడు దేనిని ప్రమాణముగ గైకొనునో, తక్కినవారును దానినే అనుసరించుదురు.

వ్యాఖ్య:- సామాన్యముగ లోకములో నొక వాడుక కలదు. పెద్ద లేదిచేయుదురో తక్కినవారున్ను దానిననుసరించుదురు అని. కాబట్టి శ్రేష్ఠులగువారు తమ ఆచరణవిషయమై బహుజాగరూకులుగ నుండవలెను. వారు పెట్టిన ఒరవడినే తక్కినవారున్ను అనుసరించుటవలన తమ యనుష్ఠానవిషయమై అప్రమత్తులుగ వ్యవహరింపవలెను. శాస్త్రవిరుద్ధమగు ఆచరణ లేకయుండవలెను. అర్జునుడు తన శౌర్య, ధైర్య,

పరాక్రమములచేతను, సచ్చరిత్ర చేతను లోకములో గొప్ప ఖ్యాతి నార్జించెను. అంతటి గొప్పవాడు అకర్మణ్యుడుకాక, తన విధ్యుక్తధర్మమును ఫలాపేక్షారహితముగ, అసక్తముగ, నాచరించినచో దానిని చూచి తక్కినవారున్ను 'ఆహా, అర్జునుడంతటివాడే ఈ ప్రకారముగ కర్మ నాచరించినపుడు మనమేల చేయరాదు' అని తలంచి నిష్కామకర్మావలంబులై, చిత్తశుద్ధిని బడసి పరమశ్రేయము నొందగలరు. 'యథా రాజా తథా ప్రజాః' – అను ఆర్యోక్తి ననుసరించి తాను అకర్మణ్యుడై యున్న యెడల తక్కినజనులున్ను ఏ కర్మచేయక ఊరక నుండి క్రమముగ కర్మభ్రష్టులైపోవుదురు. కాబట్టి లోకక్షేమదృష్టిని విచారించియైనను పెద్దలు సత్కర్మల నాచరింపవలసియే యున్నారు.

మఱియు పెద్దవారు తాము దేనిని ప్రమాణముగ గైకొందురో, ఇతురులున్ను దానినే ప్రమాణముగ తీసికొందురు. ఏ వాక్యమును, ఏ సిద్ధాంతమును, ఏ పద్ధతిని, ఏ శాస్త్రమును వారాదరించుదురో తక్కిన ప్రజలున్ను దానినే స్వీకరించి యాదరించుదురు. ఈ ప్రకారముగ సత్యసిద్ధాంతము, శాస్త్రనియతక్రమము విరివిగ ప్రచారమగుటయేకాక ఎందఱో వాని ననుష్ఠించుటద్వారా మోక్షభాగులు కాగలరు. కాబట్టి పెద్దలు మహోన్నత ధర్మములను ముమ్మొందు తామాచరించి లోకమునకు జూపుట అత్యావశ్యకమని భగవాను డిచట బోధించుచున్నారు.

"ఆచరతి" – ఈ శ్లోకమున శ్రీకృష్ణపరమాత్మ ఆచరణకు ఎక్కువ ప్రాధాన్య మొసంగిరే కాని 'వాచా' జ్ఞానమునకు గాదు. ఈ విషయమును సాధకులు బాగుగ గమనింపదగియున్నది. ఆచరణ, అనుష్ఠానము లేని ఒట్టి వాక్యములచే ప్రయోజనము లేదు. కావున ముందు తాను చేసిచూపవలెనని భగవదాదేశమై యున్నది. అపుడే జనులకు వానిపైగాని, శాస్త్రవాక్యములపైగాని విశ్వాసమేర్పడగలదు.

అ॥ ఇక మూడు శ్లోకములందు కర్మయోగావశ్యకతను స్వకీయదృష్టాంతము ద్వారా పరిపోషించుచున్నాడు –

22. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.

టీక:– పార్థ = ఓ అర్జునా!, మే = నాకు, త్రిషు లోకేషు = మూడులోకములందును, *కర్తవ్యమ్* = చేయదగినకార్యము, *కించన* = ఒకింతైనను, *న అస్తి* = లేదు. *అనవాప్తమ్* = పొందబడనిదియు, *అవాప్తవ్యమ్* = పొందవలసినదియు (అగు వస్తువేదియు), *న* = లేదు, *(తథాపి) చ* = అయినను, *కర్మణి* = కర్మయందు, *వర్తఏవ* = ప్రవర్తించుచునేయున్నాను.

తా:– అర్జునా! నా కీ మూడులోకములందును చేయదగిన కార్య మేదియును లేదు. మఱియు పొందబడనిదియు, పొందదగినదియునగు వస్తువున్ను ఏదియు లేదు. అయినను నేను కర్మయందు ప్రవర్తించుచునేయున్నాను.

వ్యాఖ్య:– శ్రీకృష్ణమూర్తి సాక్షాత్ పరమేశ్వరుడే కనుక లోకములన్నియు వారి కుక్షియందే వెలయుచుండును. అట్టితఱి ఇక ఆ యా లోకములందు వారికి చేయదగిన కార్యముగాని, పొందవలసినవస్తువుగాని యెట్లుండగలదు? అయినప్పటికిని కరుణామయులు కనుక భక్తసంతరణార్థము అవతారములెత్తి ప్రజోపకృతికై కర్మలను చేయుచునే యున్నారు. వాస్తవముగ నిరాకారుడైనను

సాకారరూపమును ధరించి, ప్రజలలో కలిసిమెలసి, వారికి ధర్మములను తత్త్వరహస్యములను బోధించి, ముక్తిమార్గమును జనులకు కరతలామలక మొనర్చుచున్నారు. సాక్షాత్ భగవానుడే ఈ ప్రకారముగ కర్మల నాచరించుచుండ, ఇక సామాన్యజనులు ఆచరింపవలదా? జీవన్ముక్తులైనప్పటికిని, తత్త్వానుభూతిని తాము బడసినప్పటికిని, అనేకులు భగవానుని ఈ ఆదర్శమునే గైకొని లోకసంగ్రహార్థము పెక్కుకార్యముల నాచరించుచునేయున్నారు. కాబట్టి ఇక సామాన్యులైనవారు, సాధకులు, ముముక్షువులు అకర్మణ్యత్వమును పారద్రోలి ఆత్మోద్ధరణకొఱకై నిష్కామముగ, అనాసక్తముగ కర్మలను తప్పక ఆచరించవలయును. దానిచే వారికి పరమశ్రేయము కలుగగలదు.

23. యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతన్ద్రితః
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః.

టీక:– పార్థ = ఓ అర్జునా!, హి = ఏలయనగా, అహమ్ = నేను, జాతు = ఎప్పుడును, అతన్ద్రితః (సన్) = జాగరూకుడనై, కర్మణి = కర్మయందు, న వర్తేయం యది = ప్రవర్తింపక పోతినేని, మనుష్యాః = మనుష్యులు, సర్వశః = అన్ని విధముల, మమ = నా యొక్క, వర్త్మ = మార్గమునే, అనువర్తన్తే = అనుసరించి వర్తించుదురు.

తా:– అర్జునా! ఏలయనగా, నేనెల్లప్పుడును జాగరూకుడనై కర్మయందు ప్రవర్తింపక పోయినచో, మనుష్యులు సర్వవిధముల నా యొక్క ఆ మార్గమునే అనుసరించి వర్తించుదురు.

వ్యాఖ్య:– "అతన్ద్రితః" - 'తంద్రత' అనగా సోమరితనము, అలసత, మత్తు. అట్టి సోమరితనములేని స్థితియే అతంద్రత; జాగరూకతయని భావము. శ్రీకృష్ణపరమాత్మ తనకేమియు కర్మచేయవలసిన అవసరము లేకున్నను మహాజాగరూకుడై కర్మలను చేయుచున్నానని చెప్పిరి. ఏలననిన, తాను కర్మలను మానివేసినచో తక్కినవారున్ను మానివేసి అధఃపతనము నొందుదురని వారి భావము. ఆ విషయమునే ఈ శ్లోకమందాతడు వ్యక్తము చేసిరి. కనుకనే మహనీయులు, ఆదర్శమూర్తులు, మహాప్రవక్తలు తమ తమ కర్మాచరణ విషయమున, ధర్మప్రవర్తనవిషయమున అత్యంతజాగరూకులై వర్తించిరి; వర్తించుచున్నారుకూడను. చరిత్రయే ఇందులకు ప్రబల నిదర్శనము.

మఱియు, 'అతన్ద్రితః' అను పదప్రయోగముచే ముముక్షువులు తమ సాధనలందు కడుసావధానముగ నుండవలెనని హెచ్చరిక చేయబడుచున్నది. ఏ కర్తవ్యము లేని భగవానుడే తన యాచరణవిషయమున ఇంత అప్రమత్తులై యుండ, ఇక సంసార బంధవిచ్ఛిత్తి కొఱకై ఎంతయో కర్మ, సాధన చేయవలసియున్న సామాన్యజనులు ఎంత జాగరూకతతో కర్మనాచరించవలయునో ఊహించుకొనవచ్చును. సాధనయందు తంద్రత పనికిరాదు. ఎందుకనగా, అజాగ్రతగనున్నచో ఎటువంటి మేధావినిగూడ మాయపడగొట్టగలదు. ఇంద్రియములు మహాప్రబలమైనవి. కాబట్టి అహర్నిశము వానిదెబ్బను ముముక్షువు కాచుకొనియుండ వలెను. ఎంతయో వివేకము, ఎంతయో జాగరూకత, ఎంతయో భగవత్కరుణ ఈ సందర్భమున అవశ్యకములైయున్నవి. రాత్రి మెయిలుబండి నడుపు డ్రైవరు ఎంత అప్రమత్తుడై యుండును, ఏ కొంచెము అజాగ్రత ఆతని పక్షమున సంభవించినను జనులందఱికిని ఘోరవిపత్తు ఎట్లు వాటిల్లునో, అట్లే ముముక్షువులున్ను తమ ఆధ్యాత్మిక సాధనలందు సోమరితనము వహించినచో గొప్ప పతనము చేకూరగలదు. 'జాతు' అని ప్రయోగించినందువలన భగవానుడు తానాచరించు కర్మల విషయమై ఏ కాలమందును

అజాగ్రత వహింపరని స్పష్ట మగుచున్నది. అన్నియు సాధించినవారే యిట్లుండ, ఇక ఏదియు సాధించని సామాన్యజను లెట్లుండవలెను? నిరంతరము బహుజాగరూకులై యుండవలెనని భావము. కనుకనే శాస్త్రములు "ప్రమాదో వై మృత్యుః" (ప్రమత్తత, అజాగ్రత చావుతో సమానము) అని ఘోషించుచున్నవి. శ్రీశంకరభగవత్పాదులున్ను ఈ విషయమున గొప్పహెచ్చరిక చేసియుండిరి★. కాబట్టి సాధకులు భగవానుడు తెలిపిన ఈ 'అతన్ద్రితః' అను పదమును మఱల మఱల జ్ఞాపకము చేసికొనుచు అప్రమత్తులై తమసాధనను కొనసాగించవలెను.

24. ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మచేదహమ్
సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః.

టీక:– అహమ్ = నేను, *కర్మ* = కర్మను, *నకుర్యాంచేత్* = చేయకుందునేని, *ఇమేలోకాః* = ఈ ప్రజలు, *ఉత్సీదేయుః* = భ్రష్టులగుదురు, *సంకరస్య చ* = సంకరమునకును, *కర్తా* = కర్తను, *స్యామ్* = అగుదును, *ఇమాః ప్రజాః* = ఈ ప్రజలను, *ఉపహన్యామ్* = చెడగొట్టినవాడనగుదును.

తా:– మఱియు, నేను కర్మను చేయకుందునేని ఈ ప్రజలు చెడిపోవుదురు. అత్తఱి సంఘమునం దేర్పడు సంకరమునకు నేనే కర్తనగుదును. కావున జనులను నేను చెడగొట్టినవాడనగుదును.

వ్యాఖ్య:– 'నేను కర్మల ననుష్ఠించనిచో, తక్కిన జనులున్ను అనుష్ఠింపరు. అత్తఱి సంఘమున అన్ని రంగములందును గొప్ప సంకరము (కలగలుపు), అశాంతి ఏర్పడును. ప్రజలు అన్యాయమును, అధర్మమును ఆశ్రయించుదురు. తత్ఫలితముగ ఉత్పాతములు, ఉపద్రవములు సంభవించును. ఇవ్విధముగ ప్రజలయొక్క వినాశమునకు నేను కారణభూతుడనగుదును. వారలను అన్ని విధముల చెడగొట్టినవాడనగుదును. కావున ప్రజల సంక్షేమముకొఱకు నేను కర్మను చేయుచునేయుందున'ని భగవానుడు కర్మయోగము యొక్క ఆవశ్యకతను నిరూపించుచున్నాడు. భగవంతునకు ప్రాణికోట్లయెడల నెంతటి కరుణగలదో, వారి శ్రేయము వారెంతగాఢముగ వాంఛించుచున్నారో ఈ శ్లోకములవలన వ్యక్తమగుచున్నది. ఇవ్విధముగ నితరులున్ను భగవానుని యడుగుజాడల నడచుచు కర్మను త్యజింపక లోకక్షేమమునకు హేతుభూతులు కావలయును.

అ॥ లోకహితము కొఱకు జ్ఞానులగువారు అసక్తముగ కర్మల నాచరింపవలయునని యుద్బోధించుచున్నాడు –

25. సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత
కుర్యాద్విద్వాం స్తథాఽసక్తశ్చికీర్షుర్లోకసఙ్గ్రహమ్.

టీక:– భారత = ఓ అర్జునా! *అవిద్వాంసః* = అజ్ఞానులు, *కర్మణి* = కర్మయందు, *సక్తాః* = తగుల్కొని (ఫలాపేక్షగలవారై), *యథా* = ఏ ప్రకారము, *కుర్వన్తి* = చేయుచున్నారో, *తథా* = ఆప్రకారమే, *విద్వాన్* =

★ ప్రమాదో బ్రహ్మ నిష్ఠాయాం న కర్తవ్యః కదాచన
ప్రమాదో మృత్యురిత్యాహ భగవాన్ బ్రహ్మణస్సుతః (వివేకచూడామణి 322)
బ్రహ్మనిష్ఠయందు సోమరితనము (అజాగ్రత) ఎపుడును పనికిరాదు. అట్టి సోమరితనము మృత్యువుతో సమానమని భగవంతుడగు సనత్కుమారుడు చెప్పెను.

జ్ఞాని, *అసక్తః* = తగుల్కొనక (ఫలాసక్తి లేనివాడై), *లోకసంగ్రహమ్* = లోకకల్యాణమును, *చికీర్షుః* = నెఱవేర్పదలంపుగలవాడై, (*కర్మాణి* = కర్మలను) *కుర్యాత్* = చేయవలెను.

తా:– ఓ అర్జునా! అజ్ఞానులు కర్మలందు తగుల్కొని ఫలాపేక్షతో నేప్రకారము చేయుచున్నారో, ఆప్రకారమే జ్ఞానులు వానియందు తగుల్కొనక ఫలాసక్తిరహితులై లోకకల్యాణమునిమిత్తము కార్యముల నాచరించవలెను.

వ్యాఖ్య:– అజ్ఞానులు, జ్ఞానులు ఇరువురును కర్మచేయుదురు. కాని అజ్ఞానులు ఫలాసక్తితో చేయుదురు. జ్ఞానులు ఫలాసక్తిరహితులై చేయుదురు. ఒకరు కర్మయందు తగుల్కొని కర్తృత్వబుద్ధితో నాచరించుదురు. మఱియొకరు తగుల్కొనక కర్తృత్వరహితులై యాచరించుదురు. అజ్ఞానులు స్వార్థముకొఱకు కర్మచేయుదురు. జ్ఞానులు లోకక్షేమము నిమిత్తము చేయుదురు. కర్మలను చేయుట ఇరువురికిని సమానమే. కాని పద్ధతిలో మాత్రము భేదము కలదు. ఒకరు కర్మలలో అంటుకొని పోవుదురు (సక్తులు). మఱియొకరు అంటక నుందురు (అసక్తులు). మొదటివారికి కర్మబంధమును గలిగించును. రెండవవారికి అదియేకర్మ ముక్తిని ప్రసాదించును. ఒకే కత్తి తెలియకవాడినచో కీడుచేయును; తెలిసివాడినచో మేలు చేయును. ఒకే అగ్ని తెలియకవాడినచో శరీరమును కాల్చును. తెలిసి వాడినచో వంటకము తయారుచేయును. అట్లే కర్మ ఒక గొప్ప ఆయుధమువంటిది. దానిని పట్టుకొనుట, ఉపయోగించుట ముందుగా పెద్దలయొద్ద నేర్చుకొనవలెను. అపుడే అయ్యది సంసారబంధవిముక్తి యను లక్ష్యమును సాధించగలదు. కర్మయను ఈ గొప్ప ఆయుధము నెట్లుపయోగించవలెనో, ప్రయోగించవలెనో గీతయం దచటచట భగవానుడు అందఱికిని తేటతెల్లముగ నేర్పుచున్నారు. 'కర్మయను ఆయుధమును మూల పెట్టవలదు (మాతే సఙ్గో౽స్త్వకర్మణి); దానిని వాడుకొనుడు; కాని తెలిసి వాడుడు!, ప్రయోగమును నేర్చుకొని వాడుడు!' అని హెచ్చరించుచున్నారు. ఈ శ్లోకమునం దాప్రయోగమెట్టిదో చక్కగ వివరింపబడినది. అనాసక్తముగ కర్మలను జేయుటయే ఆ ప్రయోగపద్ధతి.

"చికీర్షు ర్లోకసఙ్గ్రహమ్" – అను పదమువలన లోకహితమునందు భగవానున కెంత ప్రీతియో విదితమగు చున్నది. భగవత్ప్రీతికరమైన అట్టి లోకకల్యాణమును సాధించుట వివేకవంతుని విధ్యుక్తధర్మము. తాపత్రయాగ్నిచే సంతప్తులగు ప్రాణికోట్లను తరింప జేయుటకు ఏ ఒకింత సహాయమొనగూర్చినను అది చాల గొప్పదే యగును. కావున విద్వాంసుడగువాడు (జ్ఞాని) అనాసక్త కర్మాచరణద్వారా లోకహితమును సాధించ వలెనని భగవాను డీశ్లోకమున ఆదేశించుచున్నారు. వారిని జూచి తక్కినవారున్ను నిష్కామమార్గము నవలంబించి తరించుటకు వీలుండును.

"భారత" – అను పదముచే అర్జునుని అపుడపుడు సంబోధించుచు భగవాను డతని యుత్సాహమును రేకెత్తించు చున్నారు. ఆ పదమునకు 'భరతవంశమున జన్మించినట్టి' అను అర్థమున్నప్పటికిని ఇంకొక చక్కని అర్థమున్ను గలదు. (భా = ప్రకాశము, రతః = ఆసక్తికలవాడు) ప్రకాశమునం దాసక్తి కలవాడు భారతుడు. 'ఓ అర్జునా! లెమ్ము! అజ్ఞానాంధకారమును పోగొట్టుకొని జ్ఞానదీప్తియందు నిరతుడవుకమ్ము!' అని బోధించుట యగును.

ప్ర:– వివేకవంతుడు కర్మల నేప్రకారము చేయవలెను?

ఉ:– అసక్తుడై (ఫలాసక్తిరహితుడై) చేయవలెను.

ప్ర:– ఎందులకు?

ఉ:– లోకక్షేమముకొఱకు.

26. న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసఙ్గినామ్
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్.

టీక:– విద్వాన్ = జ్ఞాని, కర్మసఙ్గినామ్ = కర్మమునందాసక్తి గల, అజ్ఞానామ్ = అజ్ఞానులకు, బుద్ధిభేదమ్ = (ఫలాసక్తితో కర్మల నాచరించెడు) బుద్ధికి చలనమును, న జనయేత్ = పుట్టింపగూడదు, సర్వకర్మాణి = సమస్తకర్మలను, *(స్వయం) యుక్తఃసమాచరన్* = (తాను) యోగయుక్తుడై (ఆత్మయందు స్థితుడై) నేర్పుతో నాచరించుచు, జోషయేత్ = (వారలచే) చేయించవలెను.

తా:– జ్ఞానియగువాడు కర్మఫలాసక్తులగు అజ్ఞానుల యొక్క బుద్ధిని కదలించరాదు. తాను యోగయుక్తుడై నేర్పుతో సమస్తకర్మల నాచరించుచు, తనయాచరణను జూచి వారున్ను ఆ ప్రకార మనుష్ఠించునట్లు చేయవలెను.

వ్యాఖ్య:– కర్మమందు తగుల్కొని ఫలాపేక్షతో కర్మల నాచరించువారి బుద్ధిని జ్ఞాని తన మౌఖికబోధలచే చపల మొనర్చక, తన నిర్మలయాచరణచే వారలను తన మార్గమునకు త్రిప్పుకొనవలెనని చెప్పబడినది. లోకములో కొందఱు నిష్కామకర్మ తత్త్వము తెలియక ఏదియో కొంత విశ్వాసముతో, శ్రద్ధతో ఫలాసక్తి యుతముగ కర్మలను చేయుచుందురు. అట్టివారికి 'మీరు చేయునది తప్పు, ఈ ప్రకారముగ చేయవద్దు, వేఱొక దారి కలదు.' అని బోధించినచో యథార్థమును గ్రహించువారు చాల అరుదుగా నుందురు. కావున అట్టి బోధలచే వారిలో కొందఱు అసలే వదలివేయు ప్రమాదము కలదు. దానివలన వారు ఉభయభ్రష్టులై ఘోరతమస్సునందు పడిపోవుదురు. కాబట్టి అట్టివారిని ఏమియు కదలించక, తానుమాత్రము ఆత్మస్థితుడై, ఇంద్రియనిగ్రహపరుడై అనాసక్తముగ కర్మల నాచరించుచుండినచో, ఆ నిర్మల యనుష్ఠానమును, ఆత్మశాంతిరూపమగు దాని ప్రత్యక్షఫలితమును వారు నేరులో చూచి గ్రహించి, తమ చిత్తములనుగూడ మార్చుకొని కాలక్రమమున నిష్కామకర్మాచరణపరులై మెలంగగలరు. ఇదియే ఈ శ్లోకమున తెలుపబడిన భావము.

మౌఖికబోధలకంటె అనుష్ఠానముద్వారా చేయు బోధ మహాపటుత్వము గలిగి యుండునని ఈ శ్లోకముద్వారా వ్యక్తమగు చున్నది. సభావేదికలపై చేయు ఉపన్యాసముల (Platform speeches) కంటె నిరాడంబరముగ ఏకాంతముగ గావింపబడు నిష్కామ పవిత్రానుష్ఠానమే (Silent unselfish work) పటుతరమైనదని దీనివలన స్పష్టమగుచున్నది. మఱియు హేతువాదము నర్థించు ఈ విజ్ఞానయుగమున 'వాచా' బోధలచే ఒకరిని మెప్పించుటగాని, మార్చగల్గుటగాని చాల కష్టము, తనయొక్క శుద్ధమైన అనుష్ఠానముచే ఎందఱి జనులనైన మార్చవచ్చును. అపుడే జనులకు వారి బోధలపై నమ్మకమేర్పడ గలదు.

"యుక్తః సమాచరన్" - అని చెప్పుటవలన తాను యోగయుక్తుడై, ఆత్మయందు నిలుకడగలిగి, నిష్కామబుద్ధితో కర్మలను ఆచరించుచుండవలెనని గ్రహింపనగును. 'ఆచరన్' అని చెప్పక 'సమాచరన్' అని చెప్పుటచే పవిత్రమగు అనుష్ఠానము గలిగియుండవలెనని బోధపడుచున్నది.

ప్ర:– అజ్ఞానుల కేప్రకారము బోధించవలెను?

ఉ:– తాను నిర్మలమగు ఆచరణగలిగి, అనాసక్తుడై కర్మలనాచరించుచు, దానినిచూచి వారు నేర్చుకొనులాగున ప్రవర్తించుటయే వారియెడల గావించు ఉత్తమబోధ.

అ॥ జ్ఞానికిని, కర్మఫలాసక్తుడగు అజ్ఞానికిని గల భేదమును రెండుశ్లోకముల ద్వారా తెలుపుచున్నాడు

27. ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః
అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే.

టీక:– *ప్రకృతేః* = ప్రకృతియొక్క, *గుణైః* = గుణములచేత, *సర్వశః* = నానావిధములుగ, *క్రియమాణాని* = చేయబడుచున్న, *కర్మాణి* = కర్మములను, *అహంకార విమూఢాత్మా* = అహంకారముచే వివేకశూన్యమైన మనస్సు గలవాడు, *అహం* = నేను, *కర్తా* = చేయువాడను, *ఇతి* = అని, *మన్యతే* = తలంచుచున్నాడు.

తా:– ప్రకృతివలన బుట్టిన సత్త్వరజస్తమోగుణముల చేతనే సమస్తకార్యములు జరుగుచుండగా, అహంకారముచే వివేక శూన్యమైన మనస్సుగలవాడు తానే చేయుచున్నానని తలంచుచున్నాడు.

వ్యాఖ్య:– ప్రకృతివలన బుట్టిన సత్త్వరజస్తమోగుణములే 'మనోబుద్ధిచిత్తాహంకారములు, సూక్ష్మపంచభూతములు, కర్మేంద్రియ జ్ఞానేంద్రియములు, శబ్దాదివిషయములు' – అను ఇరువదినాలుగు తత్త్వములుగ మార్పునొందినవి. కాబట్టి ఈ దృశ్యప్రపంచము, దేహము, మనోబుద్ధ్యాదులు సమస్తము ప్రకృతిజన్యమే అయియున్నది. ప్రకృతివలన కలిగిన ఈ దేహేంద్రియాదిరూప ఉపాధిచేతనే సమస్త కర్మలు చేయబడుచున్నవి. కాని వానికి సాక్షియగు ఆత్మచేతగాదు. తాను వాస్తవముగ ఆత్మస్వరూపుడు. ఆ ఉపాధికి, దేహేంద్రియమనంబులకు సాక్షి. కావున యథార్థముగ తానేకర్మయు చేయుటలేదు. ప్రకృతియే అంతయు జరుపుచున్నది. దేహేంద్రియ మానసాదుల సంయోగ మగు ఉపాధియే ఆ యా కార్యములనన్నింటిని చేయుచున్నది. కాని దేహాదులం దభిమానముగల అవివేకి 'నేను చేయుచున్నాను, నేనే కర్తను' అని తలంచుచున్నాడు. దేహాహంభావముచే నతని మనస్సు వివేకమును గోల్పోయి ఆత్మానాత్మతత్త్వశూన్యమై యుండుటచే కర్తృత్వమును తనపై ఊరకవేసికొనుచున్నాడు. తత్ఫలితముగ అనేక జన్మలను, దుఃఖములను అనుభవించుచున్నాడు.

జ్ఞానికిని అజ్ఞానికిని భేద మిచటనేయున్నది. అజ్ఞాని ఉపాధితో తాదాత్మ్యమొంది కర్తృత్వభోక్తృత్వములను తనపై ఆరోపించుకొని బాధనొందుచున్నాడు. జ్ఞాని ఉపాధిని తననుండి వేఱుచేసికొని, తాను ఆత్మయేకాని ఉపాధికాదని తలంచి, అద్దానిని సాక్షీభూతముగ వీక్షించుచు కర్తృత్వాదులులేనివాడై, పరమానంద మనుభవించుచున్నాడు. దుఃఖము దుఃఖరాహిత్యము కర్తృత్వ, అకర్తృత్వాదులపై ఆధారపడియుండును. అజ్ఞానికి అనంత దుఃఖము, జ్ఞానికి అనంతానందము కలుగుట కిదియే కారణము. కావున విజ్ఞుడగువాడు ప్రకృతిచేయుదానిని తనపై ఆరోపించుకొనక కర్తృత్వరహితుడై తన సత్యస్వరూపమగు ఆత్మయందే స్థితుడై యుండవలెను.

"అహంకార విమూఢాత్మా" – అను పదమువలన అహంకారము జీవున కెంతటి చేటు తెచ్చునో వెల్లడియగుచున్నది. అహంకారము వివేకమును రూపుమాపి విమూఢత్వమును దరికి జేర్చును. కాబట్టి దేహాదులందు అహంభావ మెన్నటికిని గలిగి యుండరాదు. ఆత్మయందే 'నేన'ను భావము కలిగియుండవలెను. (అహం బ్రహ్మాఽస్మి).

ప్ర:– ప్రపంచములోని సమస్తకర్మలు దేనిచే చేయబడుచున్నవి?

ఉ:– ప్రకృతిచే (ప్రకృతిజన్యములగు గుణములచే).

ప్ర:– కాని అహంకారముగల మనుజు డేమని తలంచుచున్నాడు?

ఉ:– తానే కర్తనని తలంచుచున్నాడు.

ప్ర:– ఫలితమేమి?

ఉ:– తత్ఫలితముగ జన్మపరంపరలను, దుఃఖమును అనుభవించుచున్నాడు. కాబట్టి తానాత్మస్వరూపుడని, కర్త కాదని తలంచి దుఃఖరహితుడై బ్రహ్మానందము నొందవలయును.

28. తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః
గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే.

టీక:– *మహాబాహో* = గొప్పబాహువులుకల ఓ అర్జునా!, *గుణకర్మవిభాగయోః* = గుణములయొక్కయు, కర్మలయొక్కయు విభజననుగూర్చిన, *తత్త్వవిత్తు* = యథార్థమును తెలిసినవాడు, *గుణాః* = (ఇంద్రియాదులను) గుణములు, *గుణేషు* = (శబ్దాది విషయములను) గుణముల యందు, *వర్తన్తే* = ప్రవర్తించుచున్నవి, *ఇతి* = అని, *మత్వా* = తలచి, *న సజ్జతే* = సంగము (అభిమానము) కలిగియుండడు.

తా:– గొప్పబాహువులుగల ఓ అర్జునా! గుణముల యొక్కయు, కర్మలయొక్కయు విభజననుగూర్చిన యథార్థ మెఱిగిన జ్ఞాని గుణములు (ఇంద్రియాదులు) గుణములందు (శబ్దాదివిషయములందు) ప్రవర్తించుచున్నవని, (ఆత్మస్వరూపుడగు తనకు వాస్తవముగ వానితో ఏ సంబంధమున్ను లేదని) తలంచి కర్మలందు సంగము (అభిమానము) లేకుండును.

వ్యాఖ్య:– ప్రపంచమున, దేహమునగూడ ఆత్మ, అనాత్మ, దృక్కు, దృశ్యము కలిసియున్నవి. ఆ రెండిటిని విడదీయవలెను. తత్త్వవేత్త వానిని విభజించగలడు. అట్లు విభజింప శక్తిగలవానినే తత్త్వవేత్తయందురు. 'తం స్వాచ్ఛరీరాత్ప్రవృహేన్ముఞ్జాదివేషీకాం ధైర్యేణ' అను కఠోపనిషద్వాక్యరీతిగా ముంజగడ్డినుండి దర్భను వేఱుపరచునట్లు, బియ్యములోనుండి మట్టిగడ్డలను వేఱుపరచునట్లు ఆత్మానాత్మల సంఘాతమునుండి అనాత్మను వేఱుచేయ వలెను. అట్లు వేఱుపరచి జ్ఞానియగువాడు ప్రపంచమునందలి, తన దేహమునందలి సమస్తకార్యములు ఆ అనాత్మచే ప్రకృతిచే చేయబడుచున్నట్లు వీక్షించును. ఆ యా గుణములు తత్తద్గుణ సంబంధములైన కార్యములందు ప్రవర్తించుచున్నవేకాని ఆత్మయగు తనకు వానితో నేలాటి సంబంధములేదని గ్రహించును. అట్లు గ్రహించినవాడై ఆ ప్రకృతితో (దృశ్యముతో) సంగము, అభిమానము లేకుండును. అసక్తుడైయుండును. ప్రపంచమున సంచరించుచున్నను తామరాకుపై నీటిబిందువువలె నిర్లేపముగ నుండును, 'న సజ్జతే' – అంటుకొనడు.

జడమై, స్వప్నతుల్యమైనట్టి దృశ్యముతో చైతన్యవంతుడగు జ్ఞాని ఎట్లు సక్తుడు కాగలడు? చిలికిన వెన్నముద్ద మజ్జిగయం దెట్లు మునుంగక, మజ్జిగతో సంబంధములేక వేఱుగనుండునో, తత్త్వవేత్తయు దృశ్యముతో నంటక వేఱుగనుండును. కావున ఆ యా దృశ్యసంబంధములైన సుఖదుఃఖము లాతనికి

అంటకనుండును. దుఃఖమునకు కారణము (ప్రకృతి) సంగమే. సంగరాహిత్యమే మోక్షము. 'దృగ్దృశ్యసంయోగోహేయ హేతుః' - (దృక్కు దృశ్యముల కలయికను విడనాడవలెను) - అని పతంజలి మహర్షియు నుడివియున్నాడు. ఈ ప్రకారమగు ఆత్మానాత్మ విచారణ లేనివాడు సంసారమున మునుంగును. ఏలయనగా నతడు దేహమే తానని, ఇంద్రియములే తానని, మనస్సే తానని భావించి, వానియం దభిమానముంచి, ఆ యా ఇంద్రియ కృతకార్యములను తానే చేసితినని తలంచుచు మోహమొందుచు న్నాడు. కాబట్టి అనాత్మ (దృశ్య) వస్తువులగు దేహేంద్రియాదులపై అభిమానమును వీడి ఆత్మయందే నిలుకడ గలిగియుండవలెను. దుఃఖవిముక్తికి ఇదియొకటియే ఉపాయము. సంసారచక్రము నుండి తప్పించుకొనుటకిదియే కీలకము.

ప్ర:– తత్త్వవేత్త కర్మలం దెట్లు ప్రవర్తించును?

ఉ:– ఆత్మానాత్మ వివేకము కలవాడగుటచే నతడు "ఆ యా గుణములు ఆ యా కార్యములందు ప్రవర్తించుచున్నవే కాని ఆత్మయగు తానేమియు చేయుటలేద" ని నిశ్చయించి కార్యములందు సంగవర్జితుడై మెలగును.

అ॥ ఆసక్తితో కర్మలనుజేయువారి చిత్తమును కదిలించ రాదనియు, తాను చక్కగ ననుష్ఠించి వారిని దారికి తీసికొనిరా వలయుననియు నిదివఱలో తెలిపిన భావమునే మరల నొక్కి చెప్పుచున్నాడు -

29. ప్రకృతేర్గుణసమ్మూఢాః సజ్జన్తే గుణకర్మసు
తానకృత్స్నవిదో మన్దాన్కృత్స్నవిన్న విచాలయేత్.

టీక:– (యే = ఎవరు), *ప్రకృతేః* = ప్రకృతియొక్క, *గుణసమ్మూఢాః* = రాజసాది గుణములచే మోహపెట్టబడినవారై, *గుణకర్మసు* = గుణములయొక్క, (దేహేంద్రియమానసాదుల) కర్మలందు, *సజ్జన్తే* = ఆసక్తులగుచున్నారో, *అకృత్స్నవిదః* = అల్పజ్ఞులును, *మన్దాన్* = మందమతులునగు, *తాన్* = అట్టి కర్మసంగులను, *కృత్స్నవిత్* = ఆత్మజ్ఞుడగు జ్ఞాని, *న విచాలయేత్* = చలింపజేయగూడదు.

తా:– ప్రకృతియొక్క రాజసాదిగుణములచే మోహపెట్ట బడినవారై దేహేంద్రియాదుల యొక్క క్రియలందు ఆసక్తులై వర్తించు కర్మసంగులగు అల్పజ్ఞులను, మందమతులను ఆత్మజ్ఞుడగు జ్ఞాని చలింపజేయగూడదు. (కర్మలు మానునట్లు చేయరాదు.)

వ్యాఖ్య:– ఈ అధ్యాయమందలి 26వ శ్లోకమున చెప్పిన భావమునే జాగ్రత కొఱకు మరల చెప్పుచున్నారు - ఆత్మజ్ఞులగు మహనీయులు కర్మలం దాసక్తులైయున్నట్టి అనగా ఫలాదులను కోరుటద్వారా, కర్తృత్వబుద్ధి గలిగియుండుటద్వారా సక్తులై యున్నట్టి అజ్ఞానుల మనస్సును చెడగొట్టక, తమ ఉన్నతాచరణ ద్వారా వారిని గూడ తమదారికి మెల్లగ తీసికొనిరావలెను. తామాచరించి తమ నిష్కామాచరణచే క్రమముగ వారికి ప్రోత్సాహమును గలుగజేయవలెను. తమ సన్నిధియందున్న ఆ పెద్దల యొక్క నిష్కల్మషప్రవర్తనమును, నిస్సంగవ్యవహారమును జూచి వారున్ను క్రమముగ సన్మార్గగాములు కాగలరు.

"అకృత్స్నవిత్" - గుణకర్మములందు, దృశ్యపదార్థము లందు అభిమానము, సంగము కలవారిని

అల్పజ్ఞులని భగవానుడు పేర్కొనిరి. వారెంతటి ప్రాపంచిక విద్యావైదుష్యము కలిగియున్నను, గొప్పపండితులైనను ప్రకృతికి, ఇంద్రియ విషయములకు దాసులై యున్నారు. కనుక అల్పజ్ఞులే యగుదురు. మఱియు 'మన్దాన్' అని చెప్పుటచే వారు పెద్దలదృష్టిలో, భగవంతునిదృష్టిలో మందమతులే అయి యున్నారు. కావున గుణసంగమును, ప్రకృతిదాసత్వమునువీడి సర్వవేత్త (కృత్స్నవిత్) కావలెనేకాని, వాని నంటిపెట్టుకొని మందమతుడు (అకృత్స్నవిత్) అనిపించుకొనగూడదు.

"కృత్స్నవిత్" - దేనిని తెలిసికొనినచో సమస్తము తెలియబడినది యగుచున్నదో (యస్మిన్విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి) అట్టి ఆత్మను ఎఱుంగుటయే సర్వజ్ఞత్వము. దాని నెఱంగువాడే కృత్స్నవిదుడు. సమస్త బ్రహ్మాండములకును మూలాధారమైనట్టి బ్రహ్మ (ఆత్మ) వస్తువు నెఱింగినచో అంతయు తెలిసికొనబడినదియే యగును. కనుకనే మహనీయులగు ఋషులు, మునులు మొట్టమొదట తమహృదయమును శోధించుకొని, ఇంద్రియములను జయించి, ప్రకృతిని స్వాధీనపఱచుకొని, ఆత్మానుభవ మొందుటద్వారా సర్వజ్ఞులు (కృత్స్నవిదులు) కాగల్గిరి. అదియే జన్మసార్థకత్వమునకు ఏకైకమార్గము. శాంతికి సుఖమునకు ఉపాయము.

ప్ర:- ప్రకృతిగుణములకు దాసులై వర్తించు కర్మసంగు లెట్టివారు?.

ఉ:- అల్పజ్ఞులు, మందమతులు.

ప్ర:- అట్టివారిని జ్ఞాను లేమిచేయవలెను?

ఉ:- వారిబుద్ధిని చెడగొట్టకుండ స్వకీయ ఉత్తమాచరణ ద్వారా వారిని క్రమముగ తమదారికి తీసికొనిరావలెను.

అ॥ ఈ అధ్యాయప్రారంభమునగల అర్జునుని ప్రశ్న ననుసరించి పరమశ్రేయమునకు మార్గమేదియో వచించుచున్నాడు -

30. మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః.

టీక:- *సర్వాణి కర్మాణి* = సమస్తకర్మములను, *మయి* = నాయందు, *అధ్యాత్మచేతసా* = అధ్యాత్మ చిత్తముతో (ఆత్మయందు నెలకొనిన మనస్సుతో), *సన్న్యస్య* = సమర్పించి, *నిరాశీః* = ఆశలేనివాడవును, *నిర్మమః* = మమకారములేనివాడవును, *భూత్వా* = అయి, *విగతజ్వరః* = సంతాపరహితుడవై, *యుధ్యస్వ* = యుద్ధము చేయుము.

తా:- సమస్త కర్మములను నాయందు అధ్యాత్మచిత్తముతో సమర్పించి, ఆశగాని, మమకారముగాని లేనివాడవై, నిశ్చింతగ యుద్ధమును జేయుము.

వ్యాఖ్య:- "అధ్యాత్మచేతసా" - జనులలో చాలమంది యొక్క చిత్తము ప్రాపంచిక భావములతో, దృశ్యవికారములతో నిండియుండును. దైవమునకు, పరమాత్మకు అచటచోటు దొరకుట దుస్తరము. అది అధ్యాత్మచిత్తముకాదు. అది ప్రాపంచిక చిత్తము. ప్రతివాడును అధ్యాత్మ చిత్తము గలిగియుండవలెనని భగవంతు డానతిచ్చుచున్నారు. ఆత్మ జ్ఞానముచేతను, పరమార్థ చింతనలచేతను చిత్తము నిండియుండి

నిరతిశయభక్తిభావసమన్వితమై యుండవలెను. అదియే అధ్యాత్మచిత్తము. అట్టి పవిత్ర మానసముతో గూడుకొని సమస్త కర్మలను భగవదర్పణము గావింపవలెనని ఇట బోధింపబడినది. 'సర్వాణి కర్మాణి ' అని చెప్పుటవలన, ఒకటి రెండు కర్మలు కాదనియు, తాను చేయు సమస్తకార్యములను ఈశ్వరార్పణబుద్ధితో నాచరింపవలెనని విదితమగుచున్నది.

"నిరాశీః నిర్మమః" - ఆశ, మమకారము పారద్రోలవలెనని హెచ్చరింపబడినది. ఈ ప్రపంచమున భగవంతుడు (ఆత్మ) అను ఒక వస్తువుతప్ప విజ్ఞునకు వాంఛింపదగినది. మఱియొకటి యేదియునులేదు. ఆత్మ యొకటియే సత్యమైనది. దృశ్య ప్రపంచమంతయు దాని ప్రతిబింబరూపము, కల్పితము, నశ్వరము. అట్టి కల్పిత, మిథ్యాప్రపంచమున వివేకవంతుడగు వాడు ఏ పదార్థమందైన ఆశగాని, మమకారముగాని యెట్లుంచగలడు? కావున ఇట్టి విచారణద్వారా ఆశను, మమకారమును వెడలగొట్టి మనుజుడు అట్టి పవిత్ర భగవదర్పితచిత్తముతో తన విధ్యుక్తకర్మల నాచరించవలయునని అర్జునుని నెపమున లోకమునకంతకును బోధింపబడినది. అర్జునుడు క్షత్రియుడు కావున 'యుధ్యస్వ ' (యుద్ధము చేయుము) అని చెప్పబడినది. తక్కినవారలు వారివారి సాంప్రదాయోచితకార్యములను ఈశ్వరార్పణబుద్ధితో, పైనదెల్పిన అధ్యాత్మగుణములతో గూడి యాచరించవచ్చును. దీనినిబట్టి గృహస్థాశ్రమములో నున్నవారుకూడ తరించుటకు అవకాశ మేర్పడుచున్నది.

"విగతజ్వరః" - 'సంతాపరహితుడవై యుద్ధము చేయుము' అని భగవానుడు సెలవిచ్చెను. జ్వరములు రెండు రకములు (1) బాహ్య జ్వరము (2) అభ్యంతర జ్వరము. రెండును జీవుని బాధించుచున్నవి. అందు మొదటిదియగు బాహ్యజ్వరము అనగా శారీరకజ్వరము ఔషధాదులచే నివారిత మగుచున్నది. అభ్యంతరజ్వము, అనగా మానసికజ్వరము (భవరోగము, సంసారతాపము) చల్లారుటకు భగవాను డీశ్లోకమున చక్కని ఔషధములను నాల్గింటిని తెలియజేసిరి. అవి యేవియనిన -

(1) అధ్యాత్మచిత్తము గలిగియుండవలెను. (ఆత్మయందు, దైవమందు సంలగ్నమైన చిత్తముగలవారై యుండవలెనని భావము).

(2) అట్టి నిర్మలచిత్తముతో గూడుకొని సమస్తకర్మములను, వాని ఫలితములను భగవంతునకు అర్పణచేయవలెను.

(3) ఆశ వదలవలెను.

(4) మమకారము లేకుండవలెను.

ఈ నాలుగున్ను 'రామబాణ' దివ్యౌషధములు. భవరోగభేషజములు. వీనిని చక్కగ సేవించినచో మనుజుడు 'విగతజ్వరుడు' కాగలడు. 'గత' అని చెప్పక 'విగత ' అని చెప్పుటవలన జ్వరము పూర్తిగ తొలగగలదని అర్థము. ఎంతటి దేహారోగ్యము కలిగి యున్నప్పటికిని, జననమరణరూప ఘోరసంసారప్రవాహమున బడవేసి అనేక గర్భనరకములందు జీవుని త్రోసివేయునట్టి ఈ లోపలి జ్వరము అంతమొందనిచో మహా ప్రమాదము వాటిల్లును. కావున భగవానుడు తెలిపిన ఈ నాలుగు దివ్యౌషధములను లెస్సగ సేవించి విగతసంసారజ్వరుడై దైవార్పితచిత్తముతో ఆనందముగ తన కార్యములను చేయుచుండు లాగున శ్రీకృష్ణమూర్తి కరుణతో నిట బోధించుచున్నారు.

ప్ర:— పరమశ్రేయమునకు మార్గమేది?

ఉ:– అధ్యాత్మచిత్తముతో సమస్తకర్మములను భగవదర్పణముగావించి, ఆశామమకారవర్జితుడై నిస్సంతాపముగ స్వకీయకార్యముల నాచరించుటయే శ్రేయోమార్గము.

అ॥ ఇట్టి మార్గము ననుసరించువారికి కలుగు ఫలితమును వివరించుచున్నాడు –

31. యే మే మతమిదం నిత్యమనుతిష్ఠన్తి మానావాః
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః.

టీక:– *యే మానవాః* = ఏ మనుష్యులు, *మే* = నాయొక్క, *ఇదంమతమ్* = ఈ యభిప్రాయమును, *శ్రద్ధావన్తః* = శ్రద్ధావంతులును, *అనసూయన్తః* = అసూయలేనివారును (అయి), *నిత్యమ్* = ఎల్లప్పుడును, *అనుతిష్ఠన్తి* = అనుసరించు చున్నారో, *తే అపి* = వారుకూడా, *కర్మభిః* = కర్మలచేత, *ముచ్యన్తే* = విడువబడు చున్నారు.

తా:– ఏ మనుజులు శ్రద్ధావంతులై, అసూయలేనివారై ఈ నా అభిప్రాయముల నెల్లపుడును ఆచరణయందుంచుచున్నారో, వారున్ను కర్మబంధమునుండి విడివడుచున్నారు.

వ్యాఖ్య:– పైనదెల్పిన నిష్కామకర్మాచరణద్వారా మనుజుడు కర్మబంధమును త్రెంపి వేయగల్గుచున్నాడని చెప్పబడినది. దీనినిబట్టి సరిగా తెలిసికొని ఆచరించినచో కర్మయే కర్మను త్రుంచివేయగల్గుచున్నదని స్పష్టమగుచున్నది. కర్మయోగము ద్వారా కర్మ విముక్తుడు కాగల్గుచున్నాడు. అనగా అనాసక్త కర్మాచరణద్వారా కర్మయోగులు జ్ఞానయోగుల వలెనే కర్మబంధ విచ్ఛిత్తిని గలుగజేసికొనుచున్నారని భావము. (నిష్కామకర్మానుష్ఠానముచే చిత్తశుద్ధిగలుగ, దానిచే జ్ఞానమంకురింప విముక్తు లగుచున్నారు)

''నిత్యమ్'' – అను చెప్పుటవలన ఏదియో ఒక సమయమున ఆ ప్రకారము వర్తించుట చాలదనియు, ప్రతిదినము వారు వారు చేయు సమస్తకార్యములను అనాసక్తముగ నాచరింపవలెననియు తేలుచున్నది. అయితే, అనుష్ఠించునపుడు రెండు సద్గుణములను ముఖ్యముగ నవలంబించియుండవలెను. అవియే శ్రద్ధ, అసూయారాహిత్యము. ఏ వస్తువునందుగాని, ఏ వాక్యమునందుగాని, ఏ వ్యక్తియందుగాని మనుజున కెంతెంత శ్రద్ధావిశ్వాసములుండునో అంతంత యధికఫలమును వానిద్వారా యతడు పొందగల్గును. అసూయ యనునది వేరుపురుగువంటిది. అది జీవుని శక్తిని తినివేయును. అధ్యాత్మరంగమున అది ప్రబల శత్రువు. సాధకుడు కష్టపడి సంపాదించిన సద్గుణముల నన్నింటిని తృటిలో నయ్యది బూడిదపాలుచేయును (క్షీరములో పడిన విషబిందువువలె). ఈ ప్రమాదమును కనిపెట్టి భగవానుడు సాధకలోకమునకు సకాలమున తగు హెచ్చరిక చేసిరి. శ్రద్ధ, అసూయ అను రెండు శస్త్రములను ధరించి – అనగా శ్రద్ధను ఆశ్రయించి, అసూయను పారద్రోలి కర్మక్షేత్రమున దుమికి అనాసక్తుడై నిరంతరము కర్మచేసినప్పటికిని మనుజుడు కర్మబంధమును ఏమాత్రమును పొందనేరడని ఇటవచింపబడినది. ఈ ప్రకారముగ కర్మ కర్మరాహిత్యమున కెట్లుపకరించగలదో ఇచట చక్కగ నిరూపింపబడినది. భగవదర్పితకర్మచే లేక ఫలాభిలాషా రహిత (అనాసక్త) కర్మచే కర్మయందలి బంధరూపమగు విషము హరించిపోయి కర్మ నైష్కర్మ్యముగ మారిపోవును.

''మానవాః'' – అని చెప్పబడినందున ఈ పరమార్థసాధనలను జాతి మతకులభేదములేక సమస్తమానవులును ఆచరించి తరించవచ్చునని భావము.

"అపి" - అను పదప్రయోగమువలన - సామాన్యులు కూడ ఇట్టి పద్ధతిచే తరించిపోవుచుండ, ఇక అర్జునునకు అది సులభతరమని బోధించినట్లైనది.

ప్ర:— కర్మలనుండి యెవరు విముక్తులగుదురు?

ఉ:— భగవానుడు బోధించిన ఈ అనాసక్త కర్మయోగపద్ధతిని శ్రద్ధావంతులై, అసూయారహితులై, సత్యము శీలించువారు కర్మబంధవిక్తులగుదురు.

అ॥ (నిష్కామయోగ) పద్ధతిని అనుష్ఠించనివారికి కలుగు హానిని వివరించుచున్నాడు -

32. యే త్వేతదభ్యసూయన్తో నానుతిష్ఠన్తి మే మతమ్
సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః.

టీక:— యేతు = ఎవరైతే, మే = నాయొక్క, ఏతత్ మతమ్ = ఈ యభిప్రాయమును, అభ్యసూయన్తః = ద్వేషించువారలై, న అనుతిష్ఠన్తి = అనుసరింపరో, తాన్ = వారిని, అచేతసః = బుద్ధిహీనులుగను, సర్వజ్ఞాన విమూఢాన్ = ఏవిధమగు జ్ఞానములేనివారలుగను, నష్టాన్ = చెడినవారలుగను, విద్ధి = ఎఱుంగుము.

తా:— ఎవరు నా యీ యభిప్రాయమును (అధ్యాత్మ మార్గమును, నిష్కామకర్మ యోగపద్ధతిని) ద్వేషించువారై యనుసరింపకనుందురో, అట్టివారిని బుద్ధిహీనులుగను, బొత్తిగ జ్ఞానములేనివారలుగను, చెడిపోయినవారలుగను నెఱుంగుము.

వ్యాఖ్య:— భగవత్ప్రోక్తమగు ఈ అనాసక్తకర్మయోగమును, దైవమార్గమును ద్వేషించువారు, ఆసక్తితో కర్మలుచేయుచు దృశ్యమందే రమించుచునుందురు. అట్టివారు కర్మబంధమున తప్పక తగుల్కొని జననమరణరూపమగు ఈ సంసారప్రవాహమున చిక్కుపడి నశించుదురు. వారు అటు బ్రహ్మమునుగాని, ఇటు కర్మమునుగాని తెలిసికొననివారై అవివేకమువలన వినాశమును జేబట్టుదురు. ప్రపంచజ్ఞానము లెన్ని కలిగియున్నను, మహాపండితుడైనను, భగవంతునియెడల భక్తిశ్రద్ధలు, నిష్కామ భావము, ఆత్మజ్ఞానము మున్నగునవి లేనిచో ఆతడు దైవదృష్టిలో సర్వజ్ఞానవిమూఢుడే యగును. బుద్ధియున్నను లేనివాడే యగును. (ఆ బుద్ధి నశ్వరదృశ్యవస్తువులందే మునుగుచుండును గనుక). అట్టివారి నొసట 'పతనము' అను పదము వ్రాయబడి యున్నదని ఈ శ్లోకమున స్పష్టముగ చెప్పివేయబడినది (నష్టాన్). కాబట్టి భగవదుక్తమార్గమునే చేబట్టి భక్తిశ్రద్ధలతో నిష్కామకర్మయోగాది పరమార్థతత్త్వముల నాశ్రయించుట, అనుష్ఠించుట శ్రేయస్కరము. లేకున్న మూడు గొప్ప అనర్థములు వాటిల్లగలవు. అవియే (1) సర్వజ్ఞానవిమూఢత్వము (2) బుద్ధివిహీనత్వము (3) వినాశము.

ప్ర:— భగవానుడు బోధించిన ఈ పరమార్థతత్త్వము ననుసరింపనివారికి, ద్వేషించువారికి కలుగు దుర్గతు లెవ్వియో వివరింపుడు.

ఉ:— (1) బొత్తిగా జ్ఞానములేకుండుట (2) బుద్ధిచెడిపోవుట (3) సంసారకూపమునబడి నశించిపోవుట.

అ॥ ఈ ప్రకారముగ మనుజుడు తన విధ్యుక్తకర్మలను నిష్కామముగ నాచరింపక పైపెచ్చు కర్మలన్నిటిని త్యజించివేసి ఊరకనున్నచో కలుగు నష్టమేమి యనిన, వచించుచున్నాడు. -

33. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్జ్ఞానవానపి
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి.

టీక:– జ్ఞానవాన్ అపి = జ్ఞానవంతుడైనను, స్వస్యాః = తనయొక్క, ప్రకృతేః = ప్రకృతికి (స్వభావమునకు), సదృశమ్ = అనుగుణముగనే, చేష్టతే = ప్రవర్తించుచున్నాడు, భూతాని = ప్రాణులు, ప్రకృతిమ్ = తమ స్వభావమును (ప్రకృతిని), యాన్తి = అనుసరించి నడచుచున్నవి, (కాబట్టి) నిగ్రహః = నిరోధము, *కిం కరిష్యతి* = ఏమి చేయగలదు?

తా:– జ్ఞానవంతుడైనను (శాస్త్రపాండిత్యము, లేక, లౌకిక జ్ఞానము కలవాడైనను) తన ప్రకృతికి (జన్మాంతర సంస్కారము వలన గలిగిన స్వభావమునకు) అనుగుణముగనే ప్రవర్తించుచున్నాడు. ప్రాణులు తమ ప్రకృతి ననుసరించియే నడుచుచున్నవి. కావున ఇక నిగ్రహ మేమిచేయగలదు?

వ్యాఖ్య:– ఇచట 'జ్ఞానవానపి' అను పదమునకు శాస్త్రపాండిత్యము, లౌకిక విద్యలు మాత్రము కలవాడని యర్థము. అనుభవముగల పూర్ణజ్ఞానికాదు. ఎంతటి మహాపండితుడైనను, శాస్త్రజ్ఞానము కలవాడైనను తన ప్రకృతికి, పూర్వజన్మసంస్కారమునకు అనుగుణ్యముగనే ప్రవర్తించుచున్నాడు. ఇక సామాన్యుల విషయమై వేఱుగ చెప్పవలెనా? అని భావము. ఇచ్చోట పూర్వ సంస్కారముయొక్క ప్రాబల్యమును వచించుటయే ప్రధానోద్దేశ్యము. అంతియేకాని నిగ్రహముయొక్క నిరుపయోగత్వము వివక్షితము కాదు. కాకున్న మఱుసటి శ్లోకములోనే "తయోర్న వశమాగచ్ఛేత్" ఇంద్రియములకు లోబడక వానిని నిగ్రహించ వలెను – అని యేల చెప్పవలసివచ్చును? గీతాశాస్త్ర ప్రారంభము నుండియు భగవానుడు 'దుష్టసంస్కారములను నిరోధించుడు, కామమును పారద్రోలుడు, క్రోధమును అరికట్టుడు, ఇంద్రియములను నిగ్రహించుడు' – అని నిట్టి ధోరణిలోనే బోధించుకొనుచువచ్చిరి. అట్టితఱి ఈ ఒక్కచోటమాత్రము నిగ్రహమువలన ప్రయోజనములేదని వచించుదురా? కాదు. జన్మాంతరవాసనలయొక్క, సంస్కారములయొక్క దృఢతరశక్తిని గూర్చి వర్ణించుచు నట్లు చెప్పవలసివచ్చినది. అంతియే.

అ॥ ప్రతివాడును తన ప్రకృతి ననుసరించి వర్తించునో, ఇక కర్మబంధమునుండి విడివడుట కాతడేమి చేయవలెనను ప్రశ్నకు సమాధానమును చెప్పుచున్నాడు –

34. ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ
తయోర్న వశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపన్థినౌ.

టీక:– ఇన్ద్రియస్య ఇన్ద్రియస్య = ప్రతి ఇంద్రియము యొక్క, అర్థే = విషయమందు, రాగద్వేషౌ = రాగము, ద్వేషము, వ్యవస్థితౌ = ఏర్పడియున్నవి, తయోః = ఆరాగద్వేషములకు, వశమ్ = అధీనమును, న ఆగచ్ఛేత్ = పొందగూడదు, తౌ = ఆ రాగద్వేషములు, అస్య = వీనికి, పరిపన్థినౌ హి = శత్రువులుగదా?

తా:– ప్రతి ఇంద్రియమునకును దాని దాని విషయమందు (శబ్దాదులందు) రాగద్వేషములు (ఇష్టానిష్టములు) ఏర్పడియున్నవి. ఆ రాగద్వేషములకు ఎవరును లోబడగూడదు. అవి మనుజునకు ప్రబలశత్రువులుగదా!

వ్యాఖ్య:— క్రిందటి శ్లోకములో వచించినట్లు మనుజుడు తన ప్రకృతికి అనుగుణ్యముగ వర్తించుట సహజమైనను పురుష ప్రయత్నబలముచే ప్రకృతిని జయించుటకు వీలుకలదను పరమసత్య మిచ్చోట చెప్పబడుచున్నది. ఇంద్రియములు శబ్దాది విషయములందు ఇష్టానిష్టములు (రాగద్వేషములు) కలిగి యున్నవి. అవి ముముక్షువునకు పరమశత్రువులు. అవి అనేక జన్మలనుండియు జీవుని హృదయక్షేత్రమును ఆక్రమించుకొని అధికారమును కొనసాగించుచున్నవి. ఇపుడు సద్గురూపదేశముచే ఆ శత్రువులను తరిమివేసి ఆత్మసామ్రాజ్యాధిపత్యమును తిరిగి సంపాదించుకొనుచున్నాడు. ఆత్మవిచారణ, భక్తి, వైరాగ్యము, నిష్కామకర్మాచరణ - మున్నగువానిద్వారా అక్కార్యమును సాధించవలెను. అట్లు సాధించువఱకు జీవునకు శాంతియుండదు. ఏలయనిన శత్రువు ఊరిలోనున్నచో ప్రమాదము; ఇంటిలో నున్నచో ఇంకను ప్రమాదము; హృదయములోనే యున్నచో ఎంతటి మహాప్రమాదమో, ఎంతటి అశాంతియో వేఱుగ చెప్పవలెనా? కావున ఆ రాగద్వేషాది అంతశ్శత్రువులకు లోబడక దైవిక పురుషప్రయత్నముచే వానినెట్లైన పరాజితమొనర్చి వేయవలెను.

పూర్వజన్మదుష్టసంస్కారము, ఇహజన్మపరమార్థయత్నము అను రెండును రెండు పొట్టేళ్ళవలె యుద్ధము చేసికొనుచున్నవి. అందేది బలవత్తరముగ నుండునో అదియే జయించును. కాబట్టి ఆధ్యాత్మిక పురుషప్రయత్నమును ద్విగుణీకృత మొనర్చి 'తయోర్న వశమాగచ్ఛేత్' అని భగవాను డాదేశించిన విధముగ, ఆ రాగద్వేషములకు తలయొగ్గక హృదయకుహరమునుండి వానిని దూరీకృతము చేసివేయవలెను. పూర్వజన్మ సంస్కారము బాగుగలేదే యని శోకించిన లాభములేదు. అది యెట్లైన నుండుగాక! 'పౌరుషేణ ప్రయత్నేన యోజనీయా శుభేపథి' - అని శ్రీవసిష్ఠమహర్షి పలికినట్లు ఇప్పటి పురుషప్రయత్నముచే ఆ పాతశక్తులను హతమార్చి మనస్సును శుద్ధమార్గమున ప్రవేశపెట్ట వచ్చును. శ్రీకృష్ణభగవానుడున్ను గీతయం దాప్రకారమే హెచ్చరిక చేయుచున్నారు. - 'ఓ జీవులారా! మీ మీ దుష్టసంస్కారములకు లోబడకుడు. ప్రయత్నపూర్వకముగ వానిని నిర్జించి ఆత్మ సామ్రాజ్యమును జేబట్టుడు!' భగవానుని ఈ యాదేశము నాలకించి ముముక్షువులెల్లరు తమ యంతఃశత్రువులగు రాగ ద్వేషాదులను జయించి పరమశాంతిని బడయుదురుగాక!

ప్ర:— ఇంద్రియముల స్వభావమేమి?

ఉ:— విషయములందు రాగము, ద్వేషము కలిగియుండుట.

ప్ర:— మోక్షాపేక్షగలవా డాచరించవలసిన విధానమేమి?

ఉ:— ఆ రాగద్వేషములకు లోబడక పురుషప్రయత్నముచే వానిని జయించివేయవలెను. అవి మనుజునకు ప్రబల శత్రువులు.

అ॥ స్వధర్మాచరణద్వారా అట్టి రాగద్వేషరహితస్థితికై యత్నింపవలెనని వచించుచున్నాడు -

35. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః.

టీక:— *స్వనుష్ఠితాత్* = చక్కగా నాచరింపబడిన, *పరధర్మాత్* = ఇతరుల ధర్మముకంటె, *విగుణః* =

గుణములేనిదైనను, స్వధర్మః = తన ధర్మమే, శ్రేయాన్ = శ్రేష్ఠమైనది, స్వధర్మే = తన ధర్మమందు, నిధనమ్ = మరణమైనను, శ్రేయః = శ్రేయస్కరము, పరధర్మః = ఇతరులధర్మము, భయావహః = భయమును గలుగజేయునది (అయియున్నది).

తా:— చక్కగ నాచరింపబడిన ఇతరుల ధర్మముకంటె గుణములేనిదైనను తన ధర్మమే శ్రేష్ఠమైనది. తన ధర్మమందు మరణమైనను శ్రేయస్కరమే యగును. ఇతరులధర్మము భయదాయకమైనది.

వ్యాఖ్య:— అర్జునుడు క్షత్రియుడు. కావున యుద్ధము చేయుట అతని ధర్మము. దానిని వదలివేసి మఱియొకని ధర్మమును స్వీకరించుట ఉత్తమముకాదు. స్వధర్మమగు యుద్ధమందు మరణించినను అతనికి శ్రేయమే (ఉత్తమలోకము) కలుగును. పరుల ధర్మము నాశ్రయించుట భయదాయకమైనది.

ఈ శ్లోకమునకు మఱియొక చక్కని యర్థము చెప్పవచ్చును. 'స్వధర్మః' = ఆత్మసంబంధమైన ధర్మము - ఆత్మప్రాప్తికి వలసిన సాధనములు. 'పరధర్మః' = దృశ్యసంబంధమైన ధర్మము - శబ్దాది విషయసౌఖ్యములు, ప్రాపంచిక భోగములు మొదలైనవి. ఆత్మప్రాప్తికై ఒనర్పబడు సాధనలు, వ్రతాదులు, ప్రారంభములో ఒకింత ప్రయాసకరములుగ తోచినను వానిని వదలరాదు. అట్లే విషయసౌఖ్య సాధనలు సులభముగ లభ్యమైనను వానిని చేబట్టరాదు. ఏలయనిన అవి జీవుని దైవవిముఖునిగజేసి నరకమున బడద్రోయును. కావున మహాభయప్రదమైనవి. అందుచే ముముక్షువు వాని జోలికిపోక, ఆత్మధర్మములందు, సదాచారములందు, వ్రతనిష్ఠాదులందు ప్రీతిని గొని వానినే యాశ్రయించవలెను. మాయ పలువిధముల జీవుని మోసగించును. పరమార్థసాధనలను ప్రారంభమున 'విగుణ'ముగ, ప్రయాసగ తోపింపజేయును. సంసార సౌఖ్యములను 'సుగుణ'ముగ సులభతరముగ తోపింపజేయును. సాధకు డివ్విషయమున కడుజాగరూకుడై యుండి కష్టముగా తోచినను తన పరమార్థసాధనను, వ్రతనిష్ఠను ఏమాత్రము సడలింపక జూడవలెను. ఒకవేళ స్వాత్మధర్మాచరణమందు, వ్రతపాలన మందు మధ్యలో చావు తటస్థించినను, అది శ్రేయస్కరమే యగును. బాధలు సంభవించినను అవి మంచికొఱకేయగును. అచంచలనిష్ఠతో ధైర్యముతో, పట్టుదలతో, తన యాత్మసాధనను కొనసాగించినచో అచిరకాలములో పరమానందరూపలక్ష్యమును బడయగల్గును. కావున ఎంత విగుణముగ తోచినను స్వాత్మధర్మమును విడనాడవలదనియు, ఎంత సుగుణముగ తోచినను దృశ్య ధర్మమును గ్రహించరాదనియు భగవానుడీ శ్లోకమున నుద్బోధించుచున్నారు. సాధనకాలమున ఇట్టి ధైర్యోత్పాదక వచనములను ముముక్షువు మరల మరల స్మరించుచు ముందుకు పోవలయును.

ప్ర:— స్వధర్మ, పరధర్మములలో ఏది శ్రేష్ఠమైనది? ఎందువలన?

ఉ:— కష్టముగా తోచినను స్వధర్మమే మేలైనది. సుఖముగా తోచినను పరధర్మము భయానకమైనది. స్వధర్మము ఉన్నతిని గలుగుజేయును. స్వధర్మపాలనమధ్యమున ఒకవేళ మరణము తటస్థించినను అది జీవునకు శ్రేయస్కరమే యగును.

అ॥ ఇవ్విధముగ పరధర్మము నాశ్రయించుటగాని, పాపకార్యముల నవలంబించుటగాని దుఃఖప్రదములని తెలిసినప్పటికని మనుజు డేల బలవంతముగ వానివైపున కీడ్వబడు చున్నాడను శంక అర్జునునకీ సందర్భమున నుదయింప దానిని గూర్చి భగవాను నిట్లు ప్రశ్నించుచున్నాడు -

అర్జున ఉవాచ :-

36. అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః.

అర్జున ఉవాచ - అర్జునుడు చెప్పెను.

టీక:- వార్ష్ణేయ = ఓ కృష్ణా!, అథ = అయితే, అయం పూరుషః = ఈ పురుషుడు, కేన = దేనిచేత, ప్రయుక్తః = ప్రేరేపింపబడినవాడగుచు, అనిచ్ఛన్ అపి = కోరనప్పటికిని, బలాత్ = బలాత్కారముగ, నియోజిత ఇవ = నియోగింపబడినవానివలె, పాపమ్ = పాపమును, చరతి = ఆచరించుచున్నాడు?

తా:- అర్జునుడు శ్రీకృష్ణమూర్తి నిట్లు ప్రశ్నించెను - ఓ కృష్ణా! అయితే మనుజుడు పాపముచేయవలెనని కోరనప్పటికిని, దేనిచే ప్రేరేపింపబడి బలాత్కారముగ పాపము చేయుచున్నాడు?

వ్యాఖ్య:- శ్రీకృష్ణపరమాత్మ ఇంద్రియనిగ్రహము, రాగద్వేష వివర్జనము స్వధర్మము మున్నగువానినిగూర్చి బోధించుచు పోవుచుండ, అర్జునున కొక సందేహము కలిగి వెంటనే భగవానుని ప్రశ్నించివైచెను. ఈ సందేహము అర్జునుని కొకనికేకాదు. ప్రతి ముముక్షువునకు కలుగుచుండును. కాబట్టి ఆ ప్రశ్నయు, దానికి భగవానుడొసంగిన సమాధానమున్ను సాధకలోకమునకు అత్యావశ్యకమైనది.

విషయానుభవము ప్రమాదమని తెలియనివాడెవడు? అసత్యము పాపమని ఎఱుగని వాడెవడు? కోపము చెడ్డదని ప్రతివానికిని తెలియును గదా? అట్లెఱింగియు ఎందఱో బలాత్కారముగ ఆ యా పాపములను చేయుచునేయున్నారు. ఒక వస్తువును తినగూడదని మనస్సు భావించినను, ఏదియో యొకశక్తి దానిచేత తినిపించితీరుచున్నది. ఆ శక్తి యేది అనునది అర్జునునిప్రశ్న. చేయగూడదని నిశ్చయించుకొనిన మానవునిచేత ఆపనిని చేయించుచుదేదియని యాతని శంక. పాపము చేయవలెనను కోరిక లేకపోయినను, పాపము చేయుచున్నాడనిన, ప్రతికూలశక్తి జీవునియం దెంత బలవత్తరముగ నున్నదో యోచించుకొనవచ్చును. 'బలాదివ నియోజితః' - అని చెప్పినందు వలన రాజుచే నాజ్ఞాపితుడగు భృత్యునిపగిది ఏదియోయొక శక్తిచే మనుజుడు బలాత్కారముగ దుష్కర్మయందు నియోగింపబడు చున్నాడు. ఆ ప్రతికూలశక్తియేదియో, దానిని తొలగించు ఉపాయ మేదియో భగవానుడు కరుణతో నుపదేశింపబోవుచున్నారు. కాబట్టి సాధకు లత్యంతజాగరూకతతో ఈ ఘట్టమును పరిశీలించి తమ ఆచరణయందు చక్కని మార్పును తెచ్చుకొనవలసియుందురు.

ప్రపంచములో మూడురకముల జీవులుకలరు - (1) ఎన్నడును పాపము చేయనివారు (2) పాపము చేయ దలంపులేనివారైనను దేనియొక్క ప్రేరణచేతనో బలాత్కారముగ పాపముచేయువారు (3) కావలెనని పాపముచేయువారు. వీరిలో మొదటి తరగతివారు ఉత్తమోత్తములు, జీవన్ముక్తులు. మాయను దాటినవారు. వీరియెదుట ప్రకృతియొక్క కుట్రలు, పన్నాగములు సాగవు. రెండవతరగతివారు ముముక్షువులు, సాధకులు. వీరిని గూర్చియే అర్జును డిచట ప్రశ్నించెను. ఇక మూడవతరగతి వారు నికృష్టులు, రాక్షసతత్త్వముకలవారు. మహా అజ్ఞానులు. మూడు, రెండు తరగతులు దాటి మొదటితరగతిలోనికి ప్రవేశించవలెను. అందులకై భగవాను డిపుడు చెప్పబోవు సమాధానమునాలకించి జనులు వారివారి హృదయములను పరిశోధించుకొని పాపరహితులగుటకై తీవ్రతరయత్న మాచరించవలయును.

అ॥ అర్జునుని ప్రశ్నకు భగవానుడు సమాధాన మొసంగు చున్నాడు -

శ్రీ భగవానువాచ -

37. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్.

శ్రీభగవానువాచ = శ్రీభగవంతుడు చెప్పెను.

టీక:- ఏషః = (నీవడిగిన) ఈ హేతువు, రజోగుణ సముద్భవః = రజోగుణమువలన పుట్టిన, కామః = కామము, ఏషః = ఇదియే (ఈకామమే), క్రోధః = క్రోధము (గ పరిణమించుచున్నది), మహాశనః = (ఇది) తృప్తిబొందనిదనియు, మహా పాప్మా = మహాపాపములకు కారణభూతమైనదియు, (అయి యున్నది కావున), ఏనమ్ = ఈ కామమును, ఇహ = ఈ మోక్షమార్గమందు, వైరిణమ్ = శత్రువుగా, విద్ధి = ఎఱుంగుము.

తా:- శ్రీభగవంతుడు చెప్పెను - ఓ అర్జునా! నీవడిగిన ఈ హేతువు రజోగుణము వలనపుట్టిన కామము. ఇదియే క్రోధముగ పరిణమించుచున్నది. ఈ కామము ఎంత అనుభవించినప్పటికిని తృప్తినిబొందనిదియు, మహాపాపములకు కారణభూతమైనదియు అయియున్నది. కావున దీనిని ఈ మోక్షమార్గమున శత్రువుగా నెఱుంగుము.

వ్యాఖ్య:- పాపముచేయగూడదని యనుకొనినను జీవునిచే బలాత్కారముగ పాపమును చేయించుశక్తి యేదియో ఇచట వచింపబడుచున్నది. అదియే కామము. అది రజోగుణము నుండి పుట్టినది. దానితమ్ముడు క్రోధము. ఈ కామక్రోధములు రెండును దాదాపు కూడియేయుండును. గీతయందును చాలచోట్ల వీరిరువురును కలిసియే వచ్చుచుందురు. ఇదివరలో తెలిపిన రాగద్వేషములయొక్క ప్రతిరూపములే ఈ కామక్రోధము లని యెఱుంగవలెను. క్రోధము కామమునుండియే ఉద్భవమగుట బట్టి ఈ రెంటియందును కామమే ప్రధానమైనది. శత్రువులలో మహాబలవత్తరమైనది కామమే యగుటచే అరిషడ్వర్గములో దానికి ప్రథమస్థాన మొసంగబడినది. అసురగుణములలో ఆ కామము నాయకుడు (Captain). క్రోధము ఉపనాయకుడు. మోక్షమార్గమున జనువారెదుర్కొను ప్రతిపక్షులలో ముఖ్యమైనదికావునను, జీవునకు దైవసాక్షాత్కారమున మహాప్రతిబంధకముగ నుండుటవలనను ఈ కామమును గూర్చి ఒకింత వివరించిచెప్పుటకై భగవాను డిచట పూనుకొనిరి.

దాని చరిత్రను వర్ణించిచెప్పుచు మొట్టమొదట (1) 'ఇది గొప్పతిండిబోతు' (మహాశనః) అని పలికెను. ఎన్ని ఆహుతులు వేసినను అగ్నిహోత్రునకు తృప్తిలేని చందమున ఈ కామె మెంత యనుభవించినను తృప్తినొందదు. పైగా వృద్ధినొందుచునే యుండును. 'కడుపు నిండినది' అని కామము చెప్పిన సందర్భ మొకటియైనను చరిత్రలో లేదు. కోరికల ననుభవించుచు కామము నెవరును నశింపచేయలేరు. సమిధలు వేయనిచో అగ్ని చల్లారునట్లు తత్త్వవిచారణ ద్వారా కోరికలు ననుభవింపకుండ చేయుటయే కామ నిర్మూలనమునకు మార్గము. మఱియు ఈ కామము (2) మహా పాపజనకమైనది (మహాపాప్మా) అని ఇచట చెప్పబడినది. 'పాప్మా' అని చెప్పక 'మహాపాప్మా' అని చెప్పుటవలన ఘోరపాపమున కిది హేతువైయున్నదని స్పష్టమగుచున్నది. జీవునకు అనేక జన్మలలో పుణ్యముయొక్క పద్దు తగ్గి, పాపముయొక్క పద్దు పెరిగిపోవుటకు కారణ మీ కామమే అయియున్నది.

ఇంకను ఇయ్యది (3) శత్రువు (వైరి) అని పేర్కొనబడినది. జీవునకు అతి సమీపమునగల శత్రు వీ కామమేయగును. ఏలయనిన అది బాహ్యమునగాక కేవలము హృదయముననే తిష్ఠవేసికొనియున్నది. ఇది ఇప్పటిశత్రువుకాదు. చాల పాతకాలపు శత్రువు. ఎన్ని జన్మలనుండియో జీవుని వేధించుచు, అతని యాత్మస్వాతంత్ర్యమును గుంజుకొని, వానిని బానిసగచేసివైచి తన చెప్పుచేతలలో నుంచుకొనుచు అతని హృదయసామ్రాజ్యాధిపత్య మంతయు తానే స్వీకరించి అధికారము చలాయించుచు, తానొకటియేకాక తన బంధువర్గమును (క్రోధాదులను) గూడ జేరబిలుచుకొని అటవసించుచున్నది. శత్రువుండినచోట శాంతియుండదు. కావున వివేక వైరాగ్యాదులచే ఈ కామమను ప్రబలశత్రువును హృదయగేహమునుండి తరిమివేయుటకు జీవుడు బద్ధకంకణుడు కావలెను.

వ్యాధిని పైపైన నివారించుటకంటె దానిమూలమును విచారించి, సమూలముగ దానిని తొలగించివేయుట శ్రేయస్కరము (Prevention is better than cure); భగవాను డిచట ఆ పనినే కావించుచున్నాడు. సంసారదుఃఖములను పైపైన నివారించుటకంటె, ఆ దుఃఖములకన్నిటికిని మూలమేమియో విచారించి, సంసారవృక్షమునకు బీజరూపముగనున్నట్టి ఆ కామమును పెకలించివేయుటకై ఉద్యమించుచున్నాడు.

ప్ర:– దేనిప్రేరణచే జీవుడు తాను వలదనుకొనినను పాపమును చేయుచున్నాడు?

ఉ:– కామముయొక్క ప్రేరణచే.

ప్ర:– ఆ కామమెట్టిది?

ఉ:– అది (1) ఎంత అనుభవించినను తృప్తినొందనిది (2) మహాపాపజనకమైనది (3) జీవునకు ప్రబలశత్రువు.

అ|| కామముయొక్క స్వరూపస్వభావములను, పాపజనకత్వమును మూడు శ్లోకములద్వారా వివరించి చెప్పుచున్నాడు –

38. ధూమేనావ్రియతే వహ్నిర్యథాఽఽదర్శో మలేన చ
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్.

టీక:– యథా = ఏప్రకారముగ, ధూమేన = పొగచేత, అగ్నిః = అగ్ని, ఆవ్రియతే = కప్పబడుచున్నదో, (యథా = ఏప్రకారముగ), ఆదర్శఃచ = అద్దమున్ను, మలేన = మాలిన్యము చేత, (ఆవ్రియతే = కప్పబడుచున్నదో), యథా = ఏప్రకారముగ, ఉల్బేన = మావిచేత, గర్భః = గర్భమందలి శిశువు, ఆవృతః = కప్పబడియుండునో, తథా = ఆప్రకారమే, తేన = ఆ కామముచేత, ఇదమ్ = ఈ ఆత్మజ్ఞానము, ఆవృతమ్ = కప్పబడియున్నది.

తా:– పొగచేత అగ్నియు, మురికిచేత అద్దమున్ను, మావిచేత గర్భమందలి శిశువున్ను కప్పబడియుండులాగున ఆ కామముచేత ఈ ఆత్మజ్ఞానమున్ను కప్పబడియుండును.

వ్యాఖ్య:– ప్రతిజీవియొక్క హృదయమందును ఆత్మ దేదీప్యమానముగ ప్రకాశించుచున్నది. కాని

అయ్యది కామాదులచే ఆవరింపబడుటవలన అనుభూతముకాకయున్నది. ఈ విషయమును స్పష్టీకరించుటకై భగవాను డిచట మూడు దృష్టాంతముల నొసంగెను. (1) అగ్ని పొగచే కప్పబడినట్లు (2) అద్దము దుమ్ముచే కప్పబడినట్లు (3) గర్భస్థ శిశువు మావిచే కప్పబడియున్నట్లు ఈ ఆత్మ కామముచే కప్పబడియున్నదని వచించెను. పొగచే కప్పబడినపుడు అగ్ని యున్నట్లే తెలియదు. పొగయొక్క నలుపుదనము అగ్నియొక్క ప్రకాశమును అభిభూత మొనర్చి అదియే జయించినదానిచందమున పైకి కనబడును. అట్లే దర్పణాదులున్ను. కాని విసరుట మొదలగు ప్రయత్నములచే ఆ పొగ తొలగిపోగా అగ్ని స్వతస్సిద్ధముగ దేదీప్యమానముగ నెట్లు వ్యక్తమగునో, అద్దముపైగల మురికిని తుడిచివేసినచో స్వచ్ఛముగ నది యెట్లు ప్రకాశించునో, మావి తొలగినపుడు శిశు వెట్లు బహిర్గతమగునో, అట్లే భక్తిజ్ఞానవైరాగ్యాదిసాధనములచే కామాదులను హృదయమునుండి పారద్రోలినచో ఆత్మ ప్రత్యక్షముగ అనుభూతము కాగలదు. అదియే మోక్షస్థితి, బంధరాహిత్యము.

మఱియు అగ్ని పొగచేత కప్పబడియున్నపుడుకాని, అద్దము దుమ్ముచే నావరింప బడి యున్నపుడుకాని, శిశువు మావిచే కప్పబడియున్నపుడుకాని, ఆ అగ్ని, దర్పణ, శిశువుల యొక్క స్వరూపములకు వాస్తవముగ ఏ హానియులేదు. అవి స్వతః నిర్మలములుగనే యున్నవి. అట్లే అజ్ఞానకాలమందును, కామాదులచే గప్పబడియున్నపుడుకూడను ఆత్మయొక్క నిర్మలత్వమందు ఏ మార్పున్ను ఉండదు. ఆవరణముండుట వలన పూర్వ మనుభూతము కాలేదు. అది తొలగినందువలన ఇపు డనుభూతమగుచున్నది. ఇదియే మార్పు. వస్తువులో ఏ మార్పున్ను జరుగలేదు. ఆవరణము మాత్రము భంగమైనది. కాబట్టి సాధకులు తమ హృదయమందుగల కామాదిరూప ఆవరణను పురుషప్రయత్నముచే, పెక్కు సాధనలచే పటాపంచలు చేసి తమ సహజ ఆత్మస్వరూపము ననుభూతమొనర్చుకొని, జన్మసార్థకత నొందవలెను. ఈ సత్యమునే భగవాను డీశ్లోకముద్వారా స్ఫురింపజేయుచున్నాడు.

పైన దెల్పిన దృష్టాంతములందు అసాధ్యమైన దేదియును లేదు. పొగను తేలికగా విసరివేయవచ్చును. దుమ్మును సులభముగ తుడిచివేయవచ్చును. మావియు కాలక్రమముగ తొలగిపోగలదు. అట్లే ఆత్మప్రాప్తియందును అసాధ్యమైనదేదియును లేదు. సోమరితనమును వీడి ఒకింత ప్రయత్నము సలిపినచో కామాదులు తప్పక జయించి వేయబడగలవు.

క్రిందటి శ్లోకమున కామమును గూర్చి ప్రస్తావించినందు వలన ఈ శ్లోకమందలి 'తేన' అను పదమునకు 'ఆ కామముచే' అనియు (రాబోవు శ్లోకమున 'ఈ కామముచే జ్ఞానము కప్పబడియున్నది' అని తెలుపబడినందువలన) 'ఇదమ్' అను పదమునకు జ్ఞానమనియు అర్థమును భావించవలసియుండును.

ప్ర:- ఆత్మజ్ఞానము దేనిచే కప్పబడుచున్నది?

ఉ:- కామాదులచే.

ప్ర:- ఏ ప్రకారముగ?

ఉ:- (1) పొగచే అగ్నివలె (2) దుమ్ముచే అద్దమువలె (3) మావిచే గర్భమందలి శిశువువలె.

అ|| కామమును అగ్నితో పోల్చి చెప్పుచున్నాడు -

39. ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణానలేన చ.

టీక :– కౌన్తేయ = ఓ అర్జునా!, దుష్పూరేణ = నిండింప శక్యముకానిదియు, అనలేనచ = అగ్నివలె తృప్తిని బొందనిదియు, కామరూపేణ = ఆశారూపమైనదియు, జ్ఞానినః = జ్ఞానికి, నిత్యవైరిణా = నిరంతర శత్రువును (అగు), ఏతేన = ఈ కామముచేత, జ్ఞానమ్ = (ఆత్మ) జ్ఞానము, ఆవృతమ్ = కప్పబడియున్నది.

తా:– ఓ అర్జునా! నిండింప శక్యముకానిదియు, అగ్నివలె తృప్తిని జెందనిదియు, ఆశారూపమైనదియు, జ్ఞానికి నిరంతర శత్రువునగు ఈ కామముచేత (ఆత్మ) జ్ఞానము కప్పబడియున్నది.

వ్యాఖ్య:– క్రిందటి శ్లోకములో కామమునుగూర్చిన ఒకింత పరిచయము గావింపబడెను. ఇచట దానిని గూర్చి మఱికొంత చెప్పబడుచున్నది. సాధకులకు దాని స్వరూపము బాగుగ తెలియవలెనని భగవానుని యభిప్రాయము. ఏలయనిన శత్రువు యొక్క బలాబలములను బాగుగ తెలిసియున్నవాడే ఆతనిని పరాజయ మొనర్పగలడు. కామ మిచట మరల రెండు విశేషణములతో వర్ణించి చెప్పబడినది. అవి యేవియనిన – (1) నిత్యవైరి (2) దుష్పూరమగు అగ్ని. వీనినిగుఱించి ఒకింత విచారింతము.

"నిత్యవైరిణా" – మోక్షము నొందువఱకు ఈ కామము ఎన్నిజన్మలైనను మనుజుని వేధించుచునే యుండును. గావున దీనిని నిత్యశత్రువని పేర్కొనిరి. ప్రపంచములో శత్రువులనేకులుండవచ్చును. కాని ఒకపుడు శత్రువుగానున్నవాడు కాలక్రమమున మిత్రుడిగా మారిపోవచ్చును. కావున వారందఱును అనిత్య శత్రువులు. ప్రపంచములో ఒకే ఒక నిత్యశత్రువు జీవునకు కలడు. ఆతడే కామము. ప్రతిక్షణము ముముక్షువును పడగొట్టుటకై అతడు వేచియుండును. మహామహాపండితులను, బలవంతులను, రాజాధిరాజులను, ఇంద్రులను, చంద్రులను అందఱిని తృటికాలములో నతడు పడగొట్టివైచును. వెయ్యేల, అధ్యాత్మసాధనలో చాలవఱకు ముందుకుసాగిన ఉద్దండులను గూడ వారొకింత అజాగ్రతగనున్నచో, సమయమునుకనిపెట్టి ఈ శత్రువు తనవలలో వేసికొనుచున్నాడు. పరమపదసోపానపటములోని పెద్దపాముతో వీనిని పోల్చవచ్చును. పైకిపోయిన సాధకుడు వీనినోటిలోపడి మొదలుకు వచ్చును. ఈ నిత్యశత్రువుబారినుండి తప్పించుకొనుటకై సాధకులు ఎన్నియో యత్నములు చేయవలసి యున్నారు. ఒకవేళ ఆ కామము పైపైన తొలగినను, వాసనారూపముగ హృదయములో మఱికొంతకాలము తిష్ఠవేసికొనియే యుండును. కావున వివేకవైరాగ్యాదులచే, ఆత్మ విచారణచే దానిని నిశ్శేషముగ తొలగించివేయువాడు ధన్యుడు.

"దుష్పూరేణ అనలేన" – అగ్నివలెను, సముద్రము వలెను కామము నింప శక్యము కానిది. ఎన్నిసమిధలు వేసినను అగ్ని 'చాలును' అని అనదు. ఎంత నదీజలము వచ్చిచేరినను సముద్రము 'చాలును' అని చెప్పదు. అట్లే కామమున్ను; అనుభవించుచు దాని నెవరున్ను తృప్తిని బొందింపలేరు. అది 'మహాశనుడ 'ని ఇదివఱకే పేర్కొనబడెనుగదా! అలకని గంపతో నీళ్ళు చేదినట్లేయుండును. ఆ కామమును పూరించుటకు చేయుయత్నము. ఆ గంప ఏనాటికిన్ని నిండదు. అట్లే 'తృప్తోఽస్మి' అని కామము అనదు. దానిని అనునట్లు ఎవరును చేయలేరు. అగ్నిలో నేయి వేయుచుండినచో అది చల్లారదు. పై పెచ్చు వృద్ధియగుచుండును. అట్లే కామమును అనుభవించినకొలది పెరుగునేకాని తరగదు. ఈ సందర్భమున భాగవతమునందలి యయాతి అనుభవ పూర్వకముగ పలికిన పలుకులు ముముక్షువులచే స్మరింపదగినవి★ కావున సమిధలు తీసివైచినచో అగ్ని చల్లారునట్లు కోరికలను, భోగసంకల్పములను హృదయము నుండి

★ న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏ వాభివర్ధతే. (భాగవతము. 9-14-14)

"అనుభవించుచుండినచో కామ మెన్నటికిని శమింపదు. అగ్నిలో నేయివేసినచందమున పైగా అది వృద్ధినొందుచునేయుండును. (యయాతి)"

ఏరిపారవేసినచో కామము చల్లారును. కామనివారణ కిదియే యుపాయముకాని అనుభవించుటకాదు. సంస్కృతములో 'అలమ్' అనగా 'చాలు' అని అర్థము. 'అనలమ్' అనగా 'చాలదు' అని అర్థము. ఎంత ఆహుతివేసినను అగ్ని చాలదని చెప్పును, గావున దానిని అనలము అని పేర్కొనిరి. కామమున్ను అట్టిదేయని భగవానుడు పలుకుచున్నాడు. మఱియు తన్ను స్పృశించువారిని అగ్నివలె కాల్చుటబట్టియు దానిని అగ్నితో పోల్చిచెప్పిరి.

"జ్ఞానినో నిత్యవైరిణా" - కామము సర్వజీవులకును అనర్థము కలిగించినను, అట్టి అనర్థమును తెలిసికొనువాడు, తొలగించుటకు యత్నించువాడు జ్ఞానిమాత్రమే యగుటవలన అది యాతనికి శత్రువుపగిది యుండును. అజ్ఞానికిగూడ వాస్తవముగ అది శత్రువుగా నున్నప్పటికిని ఆ విషయము నాతడు తెలిసికొనలేక దానిని మిత్రుడుగా భావించుచు మహానర్థమును బొందుచున్నాడు. ఇక్కారణమువలననే జ్ఞానికిమాత్రము నిత్యశత్రువుగా నిట వర్ణించబడినది.

ఇట్టి నిత్యశత్రువు హృదయమున నున్నంతవఱకు జీవునకు మోక్షమునుగూర్చిన వార్తయే ఉదయింపదు కావున, అనేక సాధనలద్వారా ఆ కామపిశాచము నతడు తొలగించివేసి తన జన్మహక్కు అయిన ఆత్మానందము ననుభవింపవలసినదిగా ఈ గీతాశాస్త్రమున శ్రీకృష్ణభగవాను డాదేశించుచున్నారు.

ప్ర:— (ఆత్మ) జ్ఞానము దేనిచే గప్పబడినది?

ఉ:— కామముచే

ప్ర:— అది యెట్టిది?

ఉ:— (1) జ్ఞానికి నిత్యశత్రువు (2) అగ్నివలె పూరింప శక్యము కానిది, అగ్నివలె దహించునది.

అ॥ అట్టి కామమును నశింపజేయు ఉపాయమును చెప్పబోవుచు ముందుగా అదియుండు స్థానమును వచించుచున్నాడు -

40. ఇన్ద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే
ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్.

టీక:— ఇన్ద్రియాణి = ఇంద్రియములు, మనః = మనస్సు, బుద్ధిః = బుద్ధి, అస్య = దీనికి (ఈ కామమునకు), అధిష్ఠానమ్ = ఆశ్రయమని, ఉచ్యతే = చెప్పబడుచున్నది, ఏషః = ఇది (ఈ కామము), ఏతైః = వీనిచేత (ఈ యింద్రియాదులచేత), జ్ఞానమ్ = (ఆత్మ) జ్ఞానమును, ఆవృత్య = కప్పి, దేహినమ్ = మనుజుని, విమోహయతి = మిగుల మోహపెట్టుచున్నది.

తా:— ఈకామమునకు ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఆశ్రయములని చెప్పబడుచున్నది. ఆ యింద్రియాదులచేత కామము ఆత్మజ్ఞానమును గప్పివైచి మనుజుని మిగుల మోహపెట్టు చున్నది.

వ్యాఖ్య:— ఇంతదనుక కామముయొక్క స్వరూప స్వభావములను వర్ణించిచెప్పి, ఇక దానిని తొలగించివేయుట కుపాయమును చెప్పబోవుచు, మొట్టమొదట అది ఆశ్రయించు నట్టి స్థానములను

పేర్కొనుచున్నారు. ఏలయనగా, శత్రువును జయించవలెననిన అతడుండుచోటు చక్కగ తెలిసియుండవలెను. ఈ కామమునకు ఆశ్రయస్థానములు ఇంద్రియములు, మనస్సు, బుద్ధి. వీని ద్వారా అది ఆత్మజ్ఞానమును కప్పివైచి జీవుని మోహపెట్టుచున్నది. 'మోహయతి' అని చెప్పక 'విమోహయతి' అని చెప్పుట వలన కామము జీవుని యెంతగా బాధించుచున్నదో, స్పష్టమగుచున్నది. జీవునియందది ఇంద్రియ, మనోబుద్ధులను కొన్నిస్థానములను సంపాదించుకొని, కొంతపట్టు సంపాదించి చివఱ కాజీవునే పడగొట్టుచున్నది. ఇపుడు కామమును జయించ వలెనన్న, దాని యాశ్రమములగు ఇంద్రియాదులను మొదట జయించవలెను. ఈ విషయమునే రాబోవు శ్లోకమున భగవానుడు స్పష్టముగ చెప్పివైచిరి. ఇంద్రియములను విషయములపైకి పోకుండ అరికట్టినయెడల ఇక కామమునకు నిలువనీడలేక క్రమముగ నశించిపోవును. ఇదియే కామజయమునకు చక్కటి ఉపాయము.

ప్ర:– కామమున కాశ్రయములేవి?

ఉ:– ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, వీనిచే నది జ్ఞానమును కప్పివైచి జీవుని అజ్ఞానమున బడద్రోయుచున్నది.

అ॥ ఇట్లు కామముయొక్క ఆశ్రయములను పేర్కొని ఇక దానిని నశింపజేయుట కుపాయమును వచించుచున్నాడు –

41. తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్.

టీక:– భరతర్షభ = భరతవంశశ్రేష్ఠుడవగు ఓ అర్జునా!, తస్మాత్ = అందువలన, త్వమ్ = నీవు, ఆదౌ = మొదట, ఇన్ద్రియాణి = ఇంద్రియములను, నియమ్య = నిగ్రహించి (స్వాధీనముచేసికొని), జ్ఞానవిజ్ఞాన నాశనమ్ = జ్ఞాన విజ్ఞానములను (శాస్త్రజ్ఞాన, అనుభవజ్ఞానములను) రెండిటిని నాశనము చేయునదియు, పాప్మానమ్ = పాపస్వరూపమైనదియు (అగు), ఏనమ్ = దీనిని (ఈ కామమున), హి = తప్పకుండ, ప్రజహి = పూర్తిగా విడువుము (నశింపజేయుము).

తా:– భరతవంశశ్రేష్ఠుడవగు ఓ అర్జునా! కాబట్టి నీవు మొట్టమొదట ఇంద్రియములను నిగ్రహించి జ్ఞానవిజ్ఞానములను (శాస్త్రజ్ఞాన, అనుభవజ్ఞానములను) రెండిటిని నాశనముచేయు నదియు, పాపస్వరూపమైనదియునగు ఈ కామమును తప్పకుండ సంపూర్ణముగ విడిచివేయుము (నశింపజేయుము).

వ్యాఖ్య:– కామమును జయించవలెననిన, ముందుగా దాని ఆశ్రయములను లోబఱచుకొనవలెను. ఆ ఆశ్రయములేవి? ఇంద్రియములు, మనస్సు, బుద్ధి అని పైనతెలుపబడినది. అందు మొదటిదియగు ఇంద్రియముల నది ముందుగా నాక్రమించుకొని ఆ పిదప మనస్సును, బుద్ధిని వశపఱచుకొనును. కాబట్టి సాధకుడు మొట్టమొదట కామముయొక్క ప్రథమాశ్రయమగు ఇంద్రియములను వశపఱచుకొనినచో కామ మిక ముందుకు పోజాలక అట్లే శమించిపోవును. కనుకనే భగవానుడు కామజయమునకు మొదట ఇంద్రియములను స్వాధీనపఱచుకొనవలసినదిగా ఆనతిచ్చిరి. 'ఆదౌ' అని చెప్పినందువలన, తక్కిన సాధనలన్నిటికంటె ముందు ఈ ఇంద్రియనిగ్రహరూప సాధనను తప్పక అవలంబించవలెనని

స్పష్టమగుచున్నది. సాధకుడు అధ్యాత్మ రంగమున ప్రవేశించి మోక్షప్రాప్తికై ప్రయత్నము సలుపునపుడు మొట్టమొదట చేయవలసినపని యిదియే. 'ఓ అర్జునా! నీకు ఇతర పనులెన్నియున్నను, ముందు ఈ పని జూడుము' అని శ్రీకృష్ణు డర్జునునకు హెచ్చరికచేయుచున్నాడు. సర్వజ్ఞుడగు పరమాత్మ వచించిన ఈ వాక్యముపై ముముక్షువుల కెంతటి విశ్వాసముండవలెను! కాబట్టి ఏ యే ఇంద్రియములు ఏ యే విషయములపై పరుగిడుచున్నవో జాగ్రతగ పరిశీలించి అభ్యాసవైరాగ్యవిచారణాదులద్వారా వానిని వెనుకకు త్రిప్పవలెను. అత్తఱి కామము నిలుచుటకు నీడలేక పలాయనము చిత్తగించును.

"పాప్మానమ్" - కామముయొక్క అల్పత్వమును అందఱికిని ఎత్తిచూపుటకు కాబోలు భగవానుడు మరల మరల దాని హీనస్వరూపమును బయట పెట్టుచున్నాడు. ఇదివఱలో (37వ శ్లో) 'మహాపాప్మా' అని వర్ణించెను. ఇపుడు 'పాప్మానమ్' - పాపస్వరూపమైనది యని వచించెను. ఏలయనిన, దానినుండియే అనేక పాపము లుద్భవించుచున్నవి. కామాంధులై ఎందఱు ఎన్ని ఘోరపాపములకు ఒడిగట్టుచున్నారో లోకమెఱిగినవిషయమే. ఇంతియేకాదు. ఆ కామము మనుజుని జ్ఞాన విజ్ఞానముల రెండిటిని నాశమొనర్చునని చెప్పబడినది. జ్ఞానమనగా శాస్త్రజ్ఞానము; విజ్ఞానమనగా అనుభవజ్ఞానము. సాధనదశలో కష్టపడి సంపాదించిన ఈ రెండును కామప్రభావముచే బూడిదపాలై పోవుచున్నవి. ఎందఱో పండితులు, శాస్త్రవేత్తలు, ఒకింత అనుభవముగలవారుగూడ కామముచే నాక్రమింపబడినపుడు తమ విజ్ఞానమును గోల్పోయి పామరులవలె ప్రవర్తించుట చూడబడుచున్నది గదా! విజ్ఞానవంతులవిషయమే యిట్లుండ ఇక సామాన్యులమాట చెప్పవలెనా! అయితే ఇంద్రియనిగ్రహము గలవారినిగాని, పూర్ణజ్ఞానముకలవారినిగాని ఆ కామ మేమియును చేయజాలదని గుర్తుంచుకొనవలెను.

కామమునకింతటి వినాశకరశక్తి యున్నప్పటికిని ఎవరును ఏమియు జంకనక్కరలేదు. అభ్యాసమును, వివేకవైరాగ్యములను జేపట్టి దానిని బయటకి గెంటిపారవేయవలెనని భగవానుడు నుడువుచున్నాడు. కనుకనే 'ప్రజహి' అని చెప్పుటద్వారా కామమును పూర్తిగా విడువవలెననియు, సంపూర్ణముగ వినాశమొనర్పవలెననియు తెలుపబడినది. (ఇచట కామమనగా దృశ్యవిషయసంబంధములైన వాంఛలన్నియును అని భావము).

"భరతర్షభ" - 'ఓ అర్జునా! నీవు భరతకులమందు శ్రేష్ఠుడవై, భౌతికబల సంపన్నుడవై యలరుచున్నావు. అట్లే ఇంద్రియములను గూడ జయించి ఆధ్యాత్మిక బలమును గూడ జేర్చుకొని నీ శ్రేష్ఠత్వమును ఇనుమడింపజేసికొనుము' అను భావ మీ పదమునందు స్ఫురించుచున్నది.

ప్ర:— పరమార్థరంగమున సాధకుడు మొట్టమొదట ఏమిచేయవలెను?

ఉ:— ఇంద్రియములను నిగ్రహించవలెను.

ప్ర:— దానివలన కలుగు లాభమేమి?

ఉ:— కామము తొలగును.

ప్ర:— ఆ కామ మెట్టిది?

ఉ:— (1) పాపజనకమైనది (2) జ్ఞానవిజ్ఞానములను నాశమొనర్చునది.

అ॥ కామము ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని వశపఱచుకొని, జీవుని (ఆత్మని) మోహపెట్టుచుండ ఇక దానిని జయించుటెట్లు? ఇంద్రియములను వశపఱచుకొనుటెట్లు? అను శంకకు సమాధానము చెప్పదలచి జీవునియొక్క యథార్థ స్వరూపమును, అతని నిజస్థానమును, శక్తిని వర్ణించుచున్నాడు -

42. ఇన్ద్రియాణి పరాణ్యాహురిన్ద్రియేభ్యః పరం మనః
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః.

టీక:- *ఇన్ద్రియాణి* = ఇంద్రియములు, *పరాణి* = (దేహాదులకంటె) గొప్పవి, *ఇన్ద్రియేభ్యః* = ఇంద్రియముకంటె, *మనః* = మనస్సు, *పరమ్* = గొప్పది, *మనసఃతు* = మనస్సు కంటెనో, *బుద్ధిః* = బుద్ధి, *పరా* = గొప్పది, *బుద్ధేః* = బుద్ధికంటె, *పరతః* = గొప్పవాడు, *యః తు* = ఎవడో, *సః* = అతడే ఆత్మ, (*ఇతి* = అని) *ఆహుః* = పెద్దలు చెప్పుదురు.

తా:- (దేహాదులకంటె) ఇంద్రియములు గొప్పవి. ఇంద్రియములకంటె మనస్సు గొప్పది. మనస్సుకంటె బుద్ధి గొప్పది. బుద్ధి కంటె గొప్పవాడెవడో అతడే ఆత్మ అని యిట్లు పెద్దలు చెప్పుదురు.

వ్యాఖ్య:- ఇంద్రియములను తొలుదొల్త నిగ్రహించవలెనని క్రిందటి శ్లోకమున చెప్పబడెను. అయితే వానిని నిగ్రహించుటెట్లు? ఆ పద్ధతిని రెండు శ్లోకములద్వారా తెలుపుచున్నారు. ఒక వస్తువును నిగ్రహించవలెనననిన, దానికంటె పైస్థానమందున్ననే సాధ్యపడును. లేక దానికంటె శక్తివంతమైన వస్తువును జేబట్టిననే వీలగును. కావున ఇంద్రియములను జయించవలెనననిన వానికంటె పరమైనట్టి స్థానమందు జీవుడు స్థితిని బొందవలెను. దేహము రథమువంటిది. అది జడమైనది. ఇంద్రియములు గుఱ్ఱముల వంటిది. అవి ఒకింత చైతన్యవంతములు. కావున దేహముకంటె ఇంద్రియములు గొప్పవి. అట్లే ఇంద్రియముల కంటె మనస్సునున్ను; మనస్సుకంటె బుద్ధియు, బుద్ధికంటె ఆత్మయు గొప్పవి. ఒకదానికంటె మఱియొకటి అధికచైతన్య వంతములు, శక్తివంతములునైయున్నవి. మఱియు ఒకదానికంటె మఱియొకటి ఉపరి భాగమున కలవు. అన్నిటికంటెపైన ఆత్మ కలదు. ఒకదృష్టితో చూచినచో ఆత్మతప్ప తక్కిన బుద్ధ్యాదు లన్నియును జడములే యగును. ఆత్మయొకటియే చైతన్యవంతమైనది. ఆత్మసాన్నిధ్యమున (అగ్నిసన్నిధియందు ఇనుపగుండువలె) ఆ బుద్ధ్యాదులు చైతన్యవంతములుగ గన్పట్టుచున్నవి. ఆత్మేతరములగు ఆ బుద్ధ్యాది సమస్తపదార్థములున్ను ప్రకృతికి (మాయకు) లోబడి వర్తించుచున్నవి. అవి దృశ్యములు. ఆత్మయొకటియే దృక్కు.

కాబట్టి అట్టి ఆత్మస్థానమునన్నుచో తక్కిన ఇంద్రియాదు లన్నిటిని సులభముగ నిగ్రహించవచ్చును. అపుడే పూర్ణఇంద్రియ నిగ్రహము సాధ్యమగును. 'రసోఽప్యస్య పరందృష్ట్వా నివర్తతే' (2-59) అని భగవాను డిదివఱకే ఈ భావమును వ్యక్తముచేసి యున్నాడు. ఇది వేదాంతమునందలి కీలకమగుటచే ముముక్షువులెల్లరు దీనిని చక్కగ గ్రహించవలెను. కావున ప్రతివాడును దేహమునందుగాని, ఇంద్రియములందుగాని, మనస్సు నందుగాని, బుద్ధియందుగాని నివసించుట తగదనియు వాని యన్నింటికి సాక్షిగా, పరముగానున్న ఆత్మనుజేరి అచటనే నివాసమేర్పఱచుకొనవలెననియు, అపుడే పూర్ణ ఇంద్రియ నిగ్రహము, తద్ద్వారా కామాదుల జయము తత్ఫలితముగ సంసారబంధ విచ్ఛేదము సంభవించుననియు ఇచట స్పష్టమొనర్పబడినది. జీవుడు తన గొప్ప అంతస్తును తాను గుర్తించవలెను. తాను

సర్వోపరిస్థానమందుగల ఆత్మయే యను నిశ్చయభావము గలిగియుండవలెను. అట్టి నిశ్చయముచే ఇంద్రియాదుల జయము అతిసులభముగ సిద్ధించును. ఆత్మయందు స్థావరము నేర్పరచుకొని ఇంద్రియాదులను దుష్టమృగములను గురిపెట్టి కాల్చవలెను. ఆ చోటనుండి తప్పి తక్కిన యేస్థానమునుండికూడ వానిని పూర్ణముగ వశపఱచు కొనుట సాధ్యముకాదని తెలుపుచు బుద్ధికి పరమైన ఆత్మయందే సదా నిలుకడను బొందులాగున భగవాను డీశ్లోకమున, రాబోవు శ్లోకమున హెచ్చరికచేయుచున్నాడు.

ప్ర:- ఆత్మయొక్క స్థానమును, శక్తిని నిరూపించుము?

ఉ:- దేహమునకుపైన ఇంద్రియములు, ఇంద్రియములకు పైన మనస్సు, మనస్సునకుపైన బుద్ధి, బుద్ధికిపైన ఆత్మ కలదు. ఇవి ఒకదానికంటె మఱియొకటి ఉత్తరోత్తర శ్రేష్ఠములై యొప్పుచున్నవి.

అ॥ ఈ ప్రకారముగ ఆత్మ అన్నిటికంటెను పరముగ నున్నదని తెలిసికొని అట్టి యనుభవముచే కామపిశాచమును పారద్రోలవలసినదిగా ఆదేశించుచున్నాడు -

43. ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్.

టీక:- మహాబాహో = గొప్ప బాహువులుకల ఓ అర్జునా! ఏవమ్ = ఈ ప్రకారముగ, బుద్ధేః = బుద్ధికంటె, పరమ్ = అతీతమైనదానినిగా, లేక, శ్రేష్ఠమైనదానినిగా, (ఆత్మానమ్ = ఆత్మను), బుద్ధ్వా = తెలిసికొని, ఆత్మనా = (వివేకవంతమైన) బుద్ధిచేత, ఆత్మానమ్ = మనస్సును, సంస్తభ్య = లెస్సగా నరికట్టి, దురాసదమ్ = జయించుటకు కష్టసాధ్యమైనట్టి, కామరూపమ్ = కామమను, శత్రుం = శత్రువును, జహి = నశింపజేయుము (విడువుము లేక జయింపుము).

తా:- గొప్పబాహువులుకల ఓ అర్జునా! ఈ ప్రకారముగ బుద్ధికంటె అతీతమైన దానినిగా ఆత్మ నెఱింగి, (వివేకముతో గూడిన) బుద్ధిచేత మనస్సును బాగుగ నరికట్టి జయించుటకు కష్టసాధ్యమైనట్టి ఈ కామమను శత్రువును నశింపజేయుము.

వ్యాఖ్య:- ప్రపంచములోగల దుఃఖమంతటికిని కారణము జీవుడు తన నిజ స్వరూపమును తెలిసికొనక యుండుటయే. తాను దేహమని, ఇంద్రియములని, మనస్సని యనుకొనుచు జీవుడు ఆ యా దేహేంద్రియాదుల వికారములను తనపై ఆరోపించుకొనుచు దుఃఖించుచున్నాడు. ఈ దేహాదిరూప దృశ్యతాదాత్మ్యమే అశాంతికి, దుఃఖమునకు మూలము. కాని భగవాను డిచట యథార్థతత్త్వమును బోధించుచు 'ఓ జీవుడా! నీవు బుద్ధికంటెను పరమైనట్టి ఆత్మవే కాని దేహాదులుకావు. అట్టి యాత్మస్థానమున నిలుకడనొంది జయింప దుస్సాధ్యమగు ఈ కామమను శత్రువును నశింపజేసి పరమానందమొందుము' అని కరుణతో బోధించుచున్నారు.

దేహమునకు, ఇంద్రియములకు, మనస్సునకు వాస్తవముగ చైతన్యమును కల్పించుచున్నది ఆత్మయే. ఆత్మనుండియే అవి శక్తిని గ్రహించుచున్నవి. కాని అవియే కాలక్రమమున ఆత్మను మరుగుబఱచి తామే పైకివచ్చి కూర్చున్నవి. జీవుని అజ్ఞానమే దీనికి కారణము. ఆత్మను విస్మరించుటయే దీనికి హేతువు. కావున ఇపుడు విచారణచేతను, మహనీయుల బోధలచేతను తన యథార్థస్వరూపమును (ఆత్మను) తిరిగి జ్ఞప్తికి

తెచ్చుకొనినచో ఆ దేహేంద్రియాదు లన్నియు అణగియుండును. కాబట్టి భగవాను డీశ్లోకమున కామజయమునకు, బంధరాహిత్యమునకు ఆత్మజ్ఞానమొకటియే పరమశరణ్యమని తెలుపుచు, అట్టి ఆత్మయొక్క సర్వోపరిస్థానమును, ప్రచండసామర్థ్యమును వెల్లడించుచున్నాడు.

దేహేంద్రియాది సంఘాతమునకంతకును వ్యవహారమును కల్పించుచున్న ఏ అభ్యాసము, ఆత్మతోటి దృశ్యసంగము కలదో ఆ సంగమును, గ్రంథిని, వివేకమను శస్త్రముతో ఛేదించివైచినచో ఇక ఆ ఇంద్రియాదులన్నియు దుర్బలములై, నిర్వీర్యములైపోవును. దీనినే గ్రంథివిచ్ఛేదనమందురు. అజ్ఞాని ఈ దేహేంద్రియాది దృశ్యజాతమంతటితో తన్ను ముడివేసికొనును. జ్ఞాని ఆముడిని ఊడదీసి తననుండి (ఆత్మనుండి) దానిని వేఱుపఱచుకొనును. అపుడీ ఇంద్రియాదులన్నియు ఉన్నను జీవుని ఏ మాత్రము బాధింపనేరవు. అవి యాతనికి లొంగిపడియుండును. ఇదియే వేదాంతమునందలి పరమరహస్యము. ఒక్కొక్క ఇంద్రియమును, ఒక్కొక్క దృశ్యవస్తువును పట్టుకొని లొంగదీసికొనుటకంటె, సమస్తమునకు మూలమగు ఆత్మస్థానమును జేరినచో, ఒక ఇంద్రియములేల, మనస్సేల, బుద్ధియేల, సమస్తదృశ్యము కూడ వశమైపోవును. సంసార దుఃఖమంతయు శమించుటకిది సులభోపాయము. నడచుచున్న రైలుబండిని ఆపవలెననిన వేలకొలది జనులు పట్టి వెనుకకు లాగినను ఆగదు. ఇంజనులోని ఒక చిన్న 'బ్రేకు' వేసినచో ఆగిపోవును. ఒక ఫ్యాక్టరీలోని చక్రములన్నిటిని ఆపవలెననిన ఇంజనుతో కలుపునట్టి బెల్టు తొలగించిన చాలును. అట్లే ఈ సంసారచక్రపరిభ్రమణమంతయు, ఈ అనాది దుఃఖజాలమంతయు ఇతరమగు ఏ ప్రక్రియ చేతను తొలగదు. దృశ్యముతోటి ఆత్మయొక్క సంగమును ఛేదించివైచినచో చాలును. అది అంతయు ఆగిపోవును. ఆత్మస్వరూపవిజ్ఞాన మొకదానిచేతనే తత్ఫలితము చేకూరగలదు. ఈ రహస్యమునే భగవాను డీశ్లోకములందు వ్యక్తమొనర్చుచున్నాడు. తత్త్వజ్ఞానముచే వాసనాక్షయము తప్పక కలుగగలదని ఘంటాపథముగ నిట వచించుచున్నారు.

"దురాసదమ్" - కామమను శత్రువు మహాశక్తివంతమైన దనియు, జయించుటకు కష్టసాధ్యమైనదనియు చెప్పబడినది. మహావటవృక్షము వేళ్లు తన్నుకొని దృఢముగ నున్నట్లు, పెక్కుజన్మలందు బలమును సంపాదించుకొని కామము హృదయక్షేత్రమున చక్కగ నిలద్రొక్కుకున్నది. కామరూపమహాపాదపము అసంగమను (ఆత్మజ్ఞానమను) గండ్రగొడ్డలిచేతనే ఛేదింపశక్యమగును (అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్త్వా).

కామమను శత్రువును జయించుట కీచిన్న బాహువులు చాలవు. మహాబాహువులు, శక్తివంతములైన భుజములు, గొప్పబలము కావలెనని సూచించుటకే కాబోలు అర్జునుని 'మహాబాహో' యని భగవాను డిచట సంబోధించెను.

కాబట్టి శోకసాగరమును తరింపదలంచువారు, కామాదిశత్రువులను జయింపదలంచువారు, మోక్షపదవిని కాంక్షించువారు, తాము దేహేంద్రియాదులని భావింపక, వాని యన్నింటికిని సాక్షియగు ఆత్మయే తామని దృఢముగ నిశ్చయించుకొనవలెను. అట్టి నిశ్చయము గల్గియున్నచో ఇక నిండు యౌవనమందున్నప్పటికిని, ప్రపంచమధ్యమున మెలగు చున్నప్పటికిని, ఇంద్రియములు అదుపులోనేయుండును. ఈ ప్రకారముగ కామాదులను జయించుటకు ఆత్మజ్ఞానమను అద్భుతసాధనమును భగవాను డిచట బోధించినవారైరి.

కర్మయోగమునుగూర్చి బోధించుచు బోధించుచు తుట్టతుద కీయఖండజ్ఞానబోధను

గావించినందువలన, ప్రతి వారును, మొట్టమొదట నిష్కామకర్మాచరణ ద్వారా చిత్తశుద్ధిని బడసి, తద్ద్వారా దృగ్దృశ్యవివేకరూపమగు ఈ ఆత్మజ్ఞానమును తప్పక పొందవలసి యుందురని స్పష్టము చేయబడినట్లైనది.

ప్ర:– కామమును జయించుట కుపాయమేమి?

ఉ:– బుద్ధికంటెను పైస్థానమున నున్న సాక్షియగు ఆత్మను తెలిసికొని అచ్చోట నిలుకడను బొందినచో కామము పలాయనము చిత్తగించగలదు.

ఓమ్

ఇతి శ్రీమద్భగవద్గీసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే

శ్రీకృష్ణార్జునసంవాదే కర్మయోగోనామ

తృతీయోఽధ్యాయః

ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును,

శ్రీకృష్ణార్జున సంవాదమునగు శ్రీ భగవద్గీతలందు కర్మయోగమను

మూడవ అధ్యాయము

ఓమ్ తత్ సత్

